
‘ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి’

సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 98

గురువారం 29-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

### మనోవాంఛల త్యాగమే బక్రీద్

త్యాగధనుల ఆచరణను స్మరిస్తూ జరుపుకొనే పర్వదినమే బక్రీద్ -11లో



### బుల్.. కొత్త రికార్డుల్

64 వేల స్థాయిని అందుకున్న సెన్సెక్స్. ముగింపులోనూ కొత్త రికార్డులు -13లో



### చెరకు ధర క్వింటాల్ రూ.315

చెరకు పంటకు ఎఫ్ఆర్‌పీని క్వింటాల్‌కు రూ.10 చొప్పున పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. క్వింటాల్ ధర 315కి పెరిగింది.

వివరాలు 6లో ▸



### యూసీసీని వ్యతిరేకిస్తాం

ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్నట్టు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చెప్పింది. దీనిపై న్యాయ పోరాటం చేస్తామంది.

వివరాలు 6లో ▸



### మరో రఫేల్ అవుతుందా?

మోదీ అమెరికా పర్యటనలో కుదిరిన 31 ఎంక్యూ-9బీ ప్రిడేటర్ డ్రోన్ల ఒప్పందంపై కాంగ్రెస్ సందేహాలు వ్యక్తం చేసింది.

వివరాలు 6లో ▸



### ‘హెచ్1బీ’తో కెనడాలో జాబ్

అమెరికాలో హెచ్1బీ వీసాదారులు ఇక కెనడాలోనూ ఉద్యోగాలు చేయొచ్చు. ఈ మేరకు కెనడా బంపర్ ఆఫర్ ఇచ్చింది.

వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### ఐక్యంగా హక్కులను కాపాడుకుందాం



కాంగ్రెస్‌లోని ఓబీసీ నేతలు ఏకమయ్యారు. ‘టీం ఓబీసీ’ పేరుతో పలువురు బీసీ నేతలు సమావేశమయ్యారు. పార్టీలో పదవులు, టికెట్ల కేటాయింపు అంశాలపై చర్చించారు. ఈసారి కూడా ఓబీసీలకు తగిన అవకాశాలు దక్కేలా పనిచేయాలని తీర్మానించారు.

- వివరాలు 2లో▶

### బియ్యం ఇవ్వలేం!



మిల్లర్ల నిర్వాకంతో కర్ణాటక, తమిళనాడుకు బియ్యం ఇవ్వలేమని తెలంగాణ పౌరసరఫరాల సంస్థ చేతులెత్తేసిన నేపథ్యంలో దీనిపై సీఎం కేసీఆర్ దృష్టి సారించారు. మంత్రులు గంగుల, హరీశ్‌రావు, సీఎస్ సమావేశమై దీనిపై చర్చించాలని ఆయన సూచించినట్లు తెలిసింది.


- వివరాలు 5లో▶



# ఆర్ఆర్ఆర్ చుట్టూ రింగ్ రైల్..

## రీజనల్ రింగ్‌రోడ్డు వెంట రైల్వే ప్రాజెక్టు సర్వేకు కేంద్రం పచ్చజెండా: కిషన్‌రెడ్డి

- దేశంలోనే తొలి రీజనల్ రింగ్ రోడ్డు, తొలి ఔటర్ రింగ్ రైలు తెలంగాణలోనే..
- కరీంనగర్–హసన్‌పర్తి రైల్వే లైన్ సర్వేకూ ఓకే
- ప్రజారవాణా, సరుకుల రవాణాకు మరింత తోడ్పాటు
- ఈ ప్రాజెక్టులతో తెలంగాణ ప్రాంత రూపురేఖలు మారిపోతాయి
- సంపూర్ణంగా కేంద్ర నిధులతోనే యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ ఫేజ్–2 నిర్మిస్తామని వెల్లడి
- జీనోమ్ వ్యాలీలో భూబదలాయింపు చేయాలంటూ కేసీఆర్‌కు లేఖ
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పుపై ఎలాంటి చర్చా లేదని వ్యాఖ్య



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీజనల్ రింగ్ రోడ్డుకు అనుబంధంగా రైల్వే లైన్ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోందని.. ఈ మేరకు ఔటర్ రింగ్ రైల్వే ప్రాజెక్టు తుది సర్వేకు కేంద్రం పచ్చజెండా ఊపిందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. సర్వే కోసం తాజాగా రూ. 14 కోట్లను కేటాయించిందని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు, దానివెంట ఔటర్ రింగ్ రైల్ ప్రాజెక్టులతో హైదరాబాద్ నగరంతోపాటు తెలంగాణ రాష్ట్ర రూపురేఖలు మారిపోతాయని పేర్కొన్నారు. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో స్పష్టమైన సానుకూల మార్పులు వస్తాయని చెప్పారు. బుధవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

**నలువైపులా లైన్లను అనుసంధానిస్తూ..**

హైదరాబాద్‌కు నలువైపులా ఉన్న రైల్వేలైన్లను కలుపుతూ రీజనల్ రింగ్ రోడ్డుకు అనుబంధంగా ఔటర్ రైల్ రింగ్ ప్రాజెక్టు నిర్మాణం ఉంటుందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు రైల్వే కనెక్టివిటీ లేని ప్రాంతాలకు కొత్తగా రైల్వే సదుపాయం లభిస్తుందని.. ఆయా ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు త్వరగా, సులభంగా చేరుకోవచ్చని కేంద్ర మంత్రి వివరించారు. దీనితోపాటు కరీంనగర్– హసన్‌పర్తి (వరంగల్) మధ్య 61 కిలోమీటర్ల రైల్వేలైన్ సర్వే కోసం రైల్వేశాఖ రూ.1.5 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.330 కోట్లతో యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ రెండో ఫేజ్ పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం.. ఈ వ్యయంలో మూడింట రెండొంతుల మేర రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సిన ఉన్నా ముందుకు రాలేదని.. దీనితో మొత్తం ఖర్చును కేంద్రమే భరించి పనులు చేపట్టాలని

మిగతా 3వ పేజీలో ▶



### పార్టీ రాష్ట్ర అధ్యక్ష మార్పుపై ఎలాంటి చర్చా లేదు

తెలంగాణలో రాష్ట్ర బీజేపీ నాయకత్వం మార్పు వంటిదేమీ లేదని, ఈ విషయంలో వస్తున్న వార్తలన్నీ పూర్తి అవాస్తవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అధ్యక్ష మార్పు అంశమేదీ అధిష్టానం దృష్టిలో లేదని, దీనిపై పార్టీలో ఎలాంటి చర్చ జరగలేదని చెప్పారు. కార్యకర్తల్లో ఎలాంటి గందరగోళం లేదని, ఇదంతా మీడియా సృష్టించిన గందరగోళమేనన్నారు. తెలంగాణలో పార్టీ అధ్యక్ష మార్పు వార్తలను బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ కూడా కొట్టిపారేశారు. అధిష్టానం వద్ద ఇలాంటి ఆలోచనేదీ లేదన్నారు.

# ఇదీ భూ కబ్జానే..

### కులాలవారీగా భూములివ్వడం సరికాదు: హైకోర్టు

- కమ్మ, వెలమ సంఘాలకు భూముల కేటాయింపు జీవోపై స్టే
- ఆ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశం
- సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా జీవో ఉందని వ్యాఖ్య
- తదుపరి ఉత్తర్వుల వరకు స్టే కొనసాగుతుందని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కులాలవారీగా భూములు ఇవ్వడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. కుల సంఘాలకు భూములు ఇవ్వడాన్ని కూడా కబ్జాగానే పరిగణించాలని ఘాటు వ్యాఖ్యలు చేసింది. కమ్మ, వెలమ సంఘాలకు భూములు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 47పై స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఈ మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులకు విరుద్ధంగా జీవో ఉందని చెప్పింది. ఆ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించి ఉంటే వెంటనే ఆపాలని తేల్చిచెప్పింది. ప్రభుత్వం గతంలో చేసిన ఇలాంటి భూ కేటాయింపును కూడా రద్దు చేశామంటూ సాయి సింధు ఫౌండేషన్

మిగతా 3వ పేజీలో ▶

### భట్టి పాదయాత్ర ముగింపు.. | పొంగులేటి చేరిక

# జన గర్జనలోనే..

### సత్తా చాటేలా ఖమ్మం సభ

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే వెల్లడి
- రాహుల్ గాంధీ ఈ సభలో పాల్గొంటారు
- కాంగ్రెస్‌ను వీడిన వారంతా తిరిగి వస్తున్నారని వెల్లడి
- పొంగులేటితో కలసి సభాస్థలి పరిశీలన



ఖమ్మం మయూరి సెంటర్: వచ్చే నెల 2న ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న తెలంగాణ జనగర్జన సభలోనే భట్టి పాదయాత్ర ముగింపు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన అనుచరుల చేరిక ఉంటాయని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే వెల్లడించారు. ఖమ్మంలో ఈ సభ నిర్వహించనున్న స్థలంలో ఏర్పాట్లను మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఠాక్రే బుధవారం సాయంత్రం పరిశీలించారు. తర్వాత పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 105 రోజులుగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రజలతో

మిగతా 2వ పేజీలో ▶

**బీఆర్ఎస్‌ను అడ్డుకోకుంటే తీరని నష్టం: భట్టి** 2లో

## క్లుప్తంగా...

### గవర్నర్ బక్రీద్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పర్వదినం ఆనందోత్సాహాలు, శాంతి, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. త్యాగనిరతికి, కఠోర భక్తిశ్రద్ధలకు ప్రతీకగా బక్రీద్‌ను జరుపుకుంటారని గవర్నర్ పేర్కొన్నారు.

### త్యాగాలతోనే సమాజ హితం

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: దేశానికే ఆదర్శవంతమైన లౌకిక, ఆధ్యాత్మిక వాతావరణం రాష్ట్రంలో ఉందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. ఈదుల్ అజ్‌హా(బక్రీద్) పర్వదినం సందర్భంగా ఆయన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సమష్టి ప్రయోజనం కోసం వ్యక్తిగత స్వార్థాన్ని విడిచి త్యాగాలకు సిద్ధపడ్డప్పుడే సమాజ హితం జరుగుతుందని, త్యాగాల ఫలాలు సమస్త జనులకు సమానంగా అందినప్పుడే ఆ త్యాగాలకు సార్థకత చేకూరుతుందనే సందేశాన్ని బక్రీద్ పండుగ విశ్వ మానవాళికి అందిస్తుందని సీఎంఅన్నారు.

### త్యాగ నిరతికి నిదర్శనం బక్రీద్

ఏపీ సీఎం జగన్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ముస్లిం సోదర సోదరీమణులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ పండుగ జరుపుకుంటారన్నారు. త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని చెప్పారు. ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా ముస్లిలందరూ ఈ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటారన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని అభిలషించారు. ఈ మేరకు బుధవారం సీఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

### అదనపు సీఈవోగా లోకేశ్‌కుమార్

కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) కార్యాలయానికి కొత్తగా ఇద్దరు అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్‌ను అదనపు సీఈవోగా.. ఇప్పటి వరకు జాయింట్ సీఈవోగా వ్యవహరించిన టి.రవికిరణ్ స్థానంలో సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్యకార్యదర్శి రాహుల్ శర్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### పెన్షనర్ల డైరెక్టరేట్‌కు వినతి

సాక్షి, హైదరాబాద్: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడానికి వెంటనే ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.మోహన్‌నారాయణ, ఎస్.నర్సరాజు డిమాండ్ చేశారు. తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం బుధవారం జరిగింది.



ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసిన టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి

### ఇదం జగత్



---

రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించడమే లక్ష్యంగా 'గోల్డెన్ అవర్' వాట్సాప్ గ్రూప్‌లు

రోడ్ల పక్కన ఉండే వ్యాపారస్తులే గ్రూపుల్లో సభ్యులు

క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడంపై ప్రత్యేక శిక్షణ

తెలంగాణ ట్రాఫిక్ పోలీసుల వినూత్న కార్యక్రమం

శిక్షణ ఇస్తున్న సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు



రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. గతేడాది 19,456 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 6,746 మంది మరణించగా.. 18,413 మంది క్షతగాత్రులయ్యారు. మరణించిన వారిలో 50% మంది గోల్డెన్ అవర్‌లో ప్రథమ చికిత్స అందించకపోవటం వల్లే మృత్యువాత పడ్డారు. గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులకు వైద్య సహాయం అందించగలిగితే 90 శాతం వరకు ప్రాణాపాయం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో గోల్డెన్ అవర్‌కు ఉన్న ప్రాధాన్యత, ఆ సమయంలో ప్రథమ చికిత్స ఆవశ్యకతను తెలంగాణ ట్రాఫిక్ పోలీసు విభాగం విశ్లేషించింది. రోడ్డు ప్రమాదాలలో క్షతగాత్రుల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా 'గోల్డెన్ అవర్ వాట్సాప్ గ్రూప్‌ల'పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బాధితులకు అవసరమైన ప్రథమ చికిత్స అందించి, స్థానిక ఆసుపత్రికి తరలించడమే ఈ గ్రూప్‌ల లక్ష్యం. - సాక్షి, హైదరాబాద్

# గోల్డెన్ అవర్ 'గాడ్స్'!

#### గోల్డెన్ అవర్ అంటే?

➤ ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత మొదటి గంటను 'గోల్డెన్ అవర్'గా పిలుస్తారు. అంబులెన్స్ చేరుకొని, ఆసుపత్రికి తరలించే లోపు క్షతగాత్రులకు వైద్య సహాయం అందించినట్లయితే ప్రమాద తీవ్రతను బట్టి గాయాల తీవ్రత తగ్గేందుకు, ప్రాణాపాయం తప్పేందుకు అవకాశం ఉంటుంది. మన దేశంలో గోల్డెన్ అవర్‌కు మోటారు వాహన చట్టం–1988లోని సెక్షన్ 2 (12 ఏ) కింద చట్ట పరమైన గుర్తింపు కూడా ఉంది.

#### గుడ్ సామరిటన్స్‌కు శిక్షణ

➤ ఒంటరిగా వాహనంపై వెళ్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై గాయపడితే.. తనంతట తానుగా లేచి ప్రథమ చికిత్స చేసుకొని, ఆసుపత్రికి వెళ్లలేని స్థితిలో ఉంటాడు. ఇలాంటి సమయంలో ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా క్షతగాత్రుడికి సహాయం చేసే వాళ్లను 'గుడ్ సామరిటన్స్'గా పిలుస్తారు. అయితే కొన్ని సందర్భాలలో 'గుడ్ సామరిటన్స్ అందించే ప్రథమ చికిత్స వల్ల క్షతగాత్రుడికి మరింత ఇబ్బందులు, కొన్ని సందర్భాలలో ప్రాణాపాయం కూడా జరుగుతున్నాయి. దీనికి పరిష్కారంగా గుడ్ సామరిటన్స్‌కు రోడ్డు ప్రమాద బాధితులకు అందించాల్సిన ప్రథమ చికిత్సలపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు కొన్నిచోట్ల శిక్షణ ప్రారంభమైంది. అలాగే ఎస్పీలు, డీసీపీల ఆధ్వర్యంలో గోల్డెన్ అవర్ వాట్సాప్ గ్రూప్‌లు క్రియేట్ చేసి ఈ గుడ్ సామరిటన్స్‌ను సభ్యులుగా చేర్చుకుంటున్నారు.

#### గ్రూప్‌లో ఎవరెవరుంటారు?

➤ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సాధారణంగా ఆ చుట్టుపక్కలవారే స్పందిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే రోడ్ల వెంబడి దాబాలు, హోటళ్లు, పంక్చర్ షాపులు, మెడికల్ షాపులు, పెట్రోల్ బంక్‌లు, కిరాణా దుకాణాలు, టీ స్టాళ్ల నిర్వాహకులు, ఎన్జీవోలకు చెందిన వారిని గోల్డెన్ అవర్ వాట్సాప్ గ్రూప్‌లో సభ్యులుగా పరిగణనలోకి తీసుకుంటారు. స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వీరి ఎంపిక బాధ్యత తీసుకుంటారు. సైబరాబాద్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (టీటీఐ), సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సంయుక్తంగా ఇప్పటివరకు 800కు పైగా గుడ్ సమారిటన్స్‌కు శిక్షణ ఇచ్చినట్లు ఓ ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు బీఎల్‌ఎస్ (బేసిక్ లైఫ్ సపోర్ట్), సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) వంటి ప్రథమ చికిత్సలపై శిక్షణ ఇస్తున్నామని వివరించారు.



#### వీరు ఏం చేస్తారంటే..

రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి క్షతగాత్రులకు అధిక రక్తస్రావం కాకుండా కట్టుకట్టడం, సీపీఆర్ వంటి ప్రథమ చికిత్స అందిస్తారు. పోలీసులు, బాధితుల కుటుంబాలకు సమాచారం అందించి, క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రిలో చేర్పుతారు. అలాగే ఏదైనా వాహనం అతివేగంగా వెళ్తున్నట్లు గుర్తిస్తే.. వెంటనే ఆ ప్రాంతం, వాహనం నంబరు వివరాలను గోల్డెన్ అవర్ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేస్తారు. స్థానిక పోలీసులు వెంటనే స్పందించి ఆ వాహనాన్ని నిలువరించేందుకు చర్యలు తీసుకుంటారు.

---

## ఎంఐఎం నిర్ణయంతో ఎఫెక్ట్ ఏంటి?

- రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని స్థానాల్లో పోటీ చేస్తామనడంపై కాంగ్రెస్ పార్టీ అలర్ట్
- తమకు సంప్రదాయకంగా ఉన్న ముస్లిం ఓట్లను చీల్చే కుట్ర అనే అనుమానం
- దీనిని ఎదుర్కొనే వ్యూహాలపై దృష్టి పెట్టాలని రాష్ట్ర నేతలకు అధిష్టానం సూచన
- సుమారు 49 స్థానాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో దూకుడు పెంచిన కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణలో బలంగా ఉన్న అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని మజ్లిస్ (ఎంఐఎం) పార్టీ చేసిన ప్రకటనపై దృష్టిపెట్టింది. కాంగ్రెస్‌కు సంప్రదాయకంగా ఉన్న ముస్లిం ఓట్లను చీల్చే కుట్రలో భాగంగానే ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఈ నిర్ణయం తీసుకున్నారని.. దీనివల్ల కాంగ్రెస్‌పై పడే ప్రభావం ఎలా ఉంటుంది, దీనిని ఎలా ఎదుర్కోవాలన్న విషయాలపై ఆలోచన చేస్తోంది. ఈ మేరకు వ్యూహాలను సిద్ధం చేయాలని రాష్ట్ర నేతలకు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే సూచించినట్టు సమాచారం. ముస్లిం ఓటర్లు 15 % నుంచి 40% వరకున్న 49 నియోజకవర్గాల పరిధిలో కార్యాచరణ తీసుకోవాలని ఆదేశించినట్టు తెలిసింది.

**ఎంఐఎంను అడ్డుకోవాల్సిందే..**

రాష్ట్రంలో సుమారు 44 లక్షల ముస్లిం జనాభా ఉంది. ఇందులో 20 వేలకన్నా ఎక్కువ ముస్లిం ఓటర్లున్న నియోజకవర్గాలు 49 ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం ఎంఐఎం ఎమ్మెల్యేలున్న స్థానాలతోపాటు కొత్తగా జహీరాబాద్, సంగారెడ్డి, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిర్మల్, ముధోల్, ఆదిలాబాద్, కరీంనగర్, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్, గోషామహల్, కుత్బుల్లాపూర్, ముషీరాబాద్, వరంగల్ ఈస్ట్, మహబూబ్‌నగర్, బాన్సువాడ, ఎల్లారెడ్డిలలో మజ్లిస్ పోటీచేసే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు అంచనా వేసినట్టు తెలిసింది. ఇందులో మెజార్టీ స్థానాలు ప్రస్తుత సర్వేల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నవేనని.. కేవలం ముస్లిం ఓటుబ్యాంకును చీల్చేందుకే ఎంఐఎం ఆ స్థానాల్లో పోటీచేసే అవకాశం ఉందని భావిస్తున్నట్టు సమాచారం. ఆయా స్థానాల్లో ఎంఐఎం ప్రాబల్యాన్ని అడ్డుకోకుంటే.. కాంగ్రెస్ గెలుపు అవకాశాలపై ప్రభావం పడుతుందని అభిప్రాయపడినట్టు తెలిసింది.

**కర్ణాటకలో కలసిరావడంతోనే..**

కర్ణాటక ఎన్నికల్లో ముస్లిం ఓట్లన్నీ కాంగ్రెస్ వైపు మళ్లడం విజయానికి బాటలు వేసిందని.. బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిన 4% రిజర్వేషన్ కోటాను పునరుద్ధరిస్తామన్న ప్రకటన కాంగ్రెస్‌కు కలసి వచ్చిందని నేతలు చెప్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలో బీఆర్‌ఎస్ హామీఇచ్చి అమలు చేయలేకపోయిన ముస్లింలకు 12% రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు తెలిసింది. ముస్లింలలో ప్రభావం చూపే వ్యక్తులతో సమావేశాలు నిర్వహించి కాంగ్రెస్ వైపు తిప్పుకోవాలని అధిష్టానం సూచించినట్టు సమాచారం.

## ఉన్నతస్థాయికి గురుకుల విద్య: కొప్పుల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గురుకుల విద్య ఉన్నతస్థాయికి చేరిందని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఈ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులంతా ఉత్తమ కొలువుల్లో స్థిరపడుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని బేగంపేటలో బుధవారం జరిగిన ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీల సక్సెస్ మీట్‌లో మంత్రి కొప్పుల పాల్గొని మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యం, వసతుల లేమితో ఉమ్మడి రాష్ట్రంలో కుదేలైన విద్యారంగం ప్రత్యేక రాష్ట్రంలో బలోపేతం అయ్యిందన్నారు. రాష్ట్రంలో గురుకుల విద్యా వ్యవస్థను సీఎం కేసీఆర్ ఉన్నత స్థాయికి తీసుకొచ్చారని కొనియాడారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు రెండొందల గురుకులాలు మాత్రమే ఉండేవని, ఇప్పుడు వాటి సంఖ్య 1030కి పెరిగిందని వివరించారు. గురుకులాలతో గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతోందన్నారు.

### 'ప్రగతి పైన పటారం..'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అభివృద్ధి పైన పటారం.. లోన లొటారంగా ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో బుధవారం అధికార ప్రతినిధులు సామ రామ్మోహన్, శ్రీరంగం సత్యంతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు కాంగ్రెస్ హయాంలోనే వచ్చాయని స్పష్టం చేశారు. తెలంగాణ నమూనా అంటూ అభివృద్ధిని తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తూ ప్రజలను కేటీఆర్ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

---

# రాష్ట్రంపై డెంగీ పంజా!

**ఈ ఏడాది ఇప్పటివరకు 583 కేసులు..**
**అత్యధికంగా మే, జూన్ నెలల్లోనే నమోదు**

- హైదరాబాద్‌లోనూ పెరుగుతున్న డెంగీ కేసులు
- హైరిస్క్ ఉన్న 10 జిల్లాలను గుర్తించిన వైద్యారోగ్య శాఖ
- మలేరియా నియంత్రణపైనా దృష్టి
- సీజనల్ వ్యాధులపై మంత్రి హరీశ్‌రావు సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంపై డెంగీ పంజా విసురుతోందని.. ఈ ఏడాది ఇప్పటివరకు 583 డెంగీ కేసులు నమోదయ్యాయని వైద్యారోగ్యశాఖ పేర్కొంది. అందులోని ఇటీవలి మే, జూన్ నెలల్లోనే అధికంగా కేసులు నమోదయ్యాయని నివేదికలో వెల్లడించింది. సాధారణంగా వానాకాలం సీజన్ మొదలయ్యాక డెంగీ, ఇతర విష జ్వరాలు వ్యాపిస్తుంటాయి. కానీ ఈసారి వానాకాలం సీజన్ ప్రారంభం కాకముందే మే నెలలోనే డెంగీ కేసులు నమోదవడం ఆందోళనకరంగా మారింది. అత్యధికంగా హైదరాబాద్‌లో 218 డెంగీ కేసులురాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 44, మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్ జిల్లాల్లో 38 చొప్పున కేసులు నమోదయ్యాయి. వానలు మొదలైన నేపథ్యంలో డెంగీ కేసులు పెరిగే అవకాశం ఉంటుందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

**ఆ పది జిల్లాల్లో రిస్క్**

రాష్ట్రంలో డెంగీ హైరిస్క్ జిల్లాలను ప్రజారోగ్య కార్యాలయం గుర్తించింది. హైదరాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, మేడ్చల్, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, సంగారెడ్డి, పెద్దపల్లి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో డెంగీ కేసులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలో గతేడాది నమోదైన డెంగీ కేసుల్లో ఈ జిల్లాల్లోనే 80 శాతం వరకు నమోదైనట్టు పేర్కొంది. ఇక ఈ ఏడాది ఇప్పటి వరకు 121 మలేరియా కేసులు నమోదయ్యాయి. దీనికి సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, కొమురంభీం ఆసిఫాబాద్, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలను హైరిస్క్ జిల్లాలుగా వైద్యారోగ్యశాఖ గుర్తించింది. గతేడాది రాష్ట్రంలో నమోదైన మలేరియా కేసుల్లో ఈ ఏడు జిల్లాల్లోనే 91.5 శాతం కేసులు వచ్చాయని పేర్కొంది.


#### అధికారులతో మంత్రి సమీక్ష

వానాకాలం మొదలైన నేపథ్యంలో డెంగీ, మలేరియా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ నిర్ణయించింది. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల నియంత్రణపై ప్రత్యేకంగా అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలతో మంత్రి హరీశ్‌రావు తాజాగా సమీక్ష నిర్వహించారు. కలుషిత నీటి ద్వారా వచ్చే వ్యాధులు మిషన్ భగీరథతో తగ్గిపోయాయని.. కానీ కీటకాలతో వ్యాపించే వ్యాధుల నియంత్రణపై ప్రధానంగా దృష్టి పెట్టాలని అన్ని జిల్లాల వైద్యాధికారులను ఆదేశించారు. మలేరియాను గుర్తించే 8 లక్షల ర్యాపిడ్ కిట్లను, డెంగీని గుర్తించే 1.23 లక్షల ఎలిజా కిట్లను ఇప్పటికే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపామని తెలిపారు.

---

## గోవధ నిషేధ చట్టం అమలయ్యేలా చూడండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- నిజమైన స్ఫూర్తితో బక్రీద్ జరుపుకోవాలని ఆకాంక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గోవధ నిషేధ చట్టం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ విషయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ అన్ని రకాల చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. గోవుల తరలింపుపై చర్యలు తీసుకోవాలని బక్రీద్‌కు ఒక్క రోజు ముందు యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్ కోర్టుకు లేఖ రాయడాన్ని తప్పుబట్టింది. సున్నితమైన అంశాల్లో చివరి నిమిషంలో వచ్చి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే ఎలా అని అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి సమయాల్లో శాంతిభద్రతలు దెబ్బతినకుండా చూడాలని, నిజమైన స్ఫూర్తితో ప్రజలు బక్రీద్ జరుపుకోవాలని సూచించింది. లేఖలోని అంశాలపై ఆగస్టు 2న నివేదికలు సమర్పించాలని సీఎస్, డీజీపీలను ఆదేశించింది. బక్రీద్ సందర్భంగా పాత బస్తీలో గోవులను నిర్బంధించారని, వాటిని గోశాలలకు తరలించేలా పోలీసులకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్ కె. శివకుమార్ హైకోర్టుకు లేఖ రాశారు. హైకోర్టు చెంతనే గోవులను కట్టేసి క్రయవిక్రయాలు జరుపుతున్నా, పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాల నుంచి గోవులను హైదరాబాద్‌కు తరలించి బహిరంగ బలికి సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో కోర్టు జోక్యం చేసుకొని తగిన ఆదేశాలు ఇవ్వకపోతే వేలాది గోవుల ప్రాణాలు పోతాయని వెల్లడించారు. ఈ లేఖను హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. గోవధ, అక్రమ రవాణా నియంత్రణకు అన్ని చర్యలు తీసుకున్నామని అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ ధర్మాసనానికి నివేదించారు. ఎక్కడికక్కడ చెక్ పోస్టులు పెట్టి కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. నివేదికలు అందజేయాలని సీఎస్, డీజీపీని ఆదేశిస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.

## ఐక్యంగా హక్కులను కాపాడుకుందాం

కాంగ్రెస్ ఓబీసీ నేతల సమావేశంలో నిర్ణయం

- 'కర్ణాటక' ఫలితాల స్ఫూర్తితో ముందుకు..
- ఐక్యతతో పార్టీలో అవకాశాలు పదిలపరచుకోవాలని తీర్మానం
- బీసీలకు ప్రాధాన్యం కోరుతూ అన్ని జిల్లాల్లో ర్యాలీలకు నిర్ణయం



హోటల్‌లో సమావేశమైన కాంగ్రెస్‌కు చెందిన బీసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: 'పార్టీలోని బీసీ నేతలందరూ ఏకం కావాలి. పార్టీలో మన హక్కులను కాపాడుకోవాలి. కాంగ్రెస్ పార్టీని రక్షించాలి. సముచిత, సమాన అవకాశాల కోసం అన్ని వర్గాలను ఏకం చేసి మనమే ముందుండి పోరాడాలి'అని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓబీసీ నేతలు నిర్ణయించారు. టీం ఓబీసీ పేరుతో బుధవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో రాష్ట్ర కాంగ్రెస్‌లోని పలువురు బీసీ నేతలు సమావేశమయ్యారు. టీపీసీసీ బీసీ నేతలు చెరుకు సుధాకర్, కత్తి వెంకటస్వామి, ప్రేమ్‌లాల్, బీర్ల అయిలయ్య, నందికంటి శ్రీధర్, రాజ్‌ఠాకూర్, ఆది శ్రీనివాస్, కేతూరి వెంకటేశ్, ఈర్ల కొమురయ్య, వీరపల్లి శంకర్, సంజీవ్ ముదిరాజ్, ప్రదీప్ గౌడ్, శ్రీహరి, యడవల్లి కృష్ణ, చిరుమర్రి కృష్ణయ్య, ధనలక్ష్మి, విజయలక్ష్మి, సీతారాం యాదవ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పార్టీలో పదవులు, టికెట్ల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వర్గాలకు అన్ని అవకాశాలు లభించాయని, ఈసారి కూడా ఓబీసీలకు తగిన అవకాశాలు దక్కేలా పనిచేయాలని తీర్మానించారు. ఎస్సీ, ఎస్టీలు పోటీ చేసే సీట్లు ఆయా వర్గాలకు రిజర్వు అయి ఉన్నందున బీసీలు జనరల్ కేటగిరీలో పోటీ చేయాల్సి వస్తోందని, కానీ జనరల్ కేటగిరీ సీట్లు అగ్రవర్ణాలకు అప్రకటిత రిజర్వేషన్ స్థానాలుగా మిగిలిపోయాయని ఈ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ గెలుపు సామాజిక సమతుల్యతతోనే సాధ్యమయిందని, ఈ నేపథ్యంలో పార్టీ నేతలంతా కలసి ఐక్యతతో అవకాశాలు పదిలపర్చుకోవాలని తీర్మానించారు. బీసీలకు ప్రతి పార్లమెంటు స్థానానికి కనీసం రెండు అసెంబ్లీ సీట్ల చొప్పున కేటాయించాలని డిమాండ్ చేస్తూ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లకు వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు. అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని, వీటిని యాదగిరిగుట్ట నుంచి ప్రారంభించి రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాలు తిరిగి మల్కాజ్‌గిరిలో ముగించాలని టీం ఓబీసీ నేతలు ఈ సమావేశంలో తీర్మానించారు.

## బీఆర్‌ఎస్‌ను అడ్డుకోకుంటే తీరని నష్టం



సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెంలో పాదయాత్ర శిబిరం వద్ద భట్టివిక్రమార్కతో మాణిక్‌రావు ఠాక్రే, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

- పాదయాత్ర పొడవునా ప్రజల కష్టాలు, కడగళ్లను చూశా: భట్టి
- కేసీఆర్ కుటుంబం, బీఆర్‌ఎస్ నేతలు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు
- ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించిన భట్టి పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర

మోతె/కూసుమంచి: ఆదిలాబాద్‌లో పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రజల కష్టాలు, కడగళ్లను చూశానని.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనను అడ్డుకోకుంటే ప్రజలు మరింత నష్టపోవాల్సి వస్తుందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబం, బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. బుధవారం ఆయన సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రం నుంచి మామిళ్లగూడెం వరకు, అక్కడి నుంచి ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వరకు పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా మామిళ్లగూడెంలోని చౌరస్తా వద్ద, నాయకన్‌గూడెంలో భట్టి మాట్లాడారు. జనం తెలంగాణ వస్తే కష్టాలు తీరుతాయని భావించి ఉద్యమం చేస్తే.. వారి ఆకాంక్షలు, ఆశలను బీఆర్‌ఎస్ అడియాసలు చేసిందని మండిపడ్డారు. రైతుబంధు వల్ల వేల ఎకరాలున్న భూస్వాములు కోటీశ్వరులు అవుతున్నారని.. ధరణి పేరుతో తెలంగాణ ప్రభుత్వం రైతుల భూములను లాక్కుంటోందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పేదలకు రూ.5లక్షలతో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని.. గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. భట్టి పాదయాత్రలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

**భట్టిని కలసిన ఠాక్రే, పొంగులేటి**

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, మాజీ ఎంపీ పొంగులేటి మామిళ్లగూడెంలో పాదయాత్ర చేస్తున్న భట్టిని కలిశారు. పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందనను తెలుసుకున్నారు. తర్వాత ఠాక్రే మీడియాతో మాట్లాడా రు. భట్టి యాత్రకు భారీ స్పందన వస్తోందని, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్ గెలుపును కోరుకుంటున్నారని చెప్పారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణను కేసీఆర్ అప్పుల పాలు చేశారని.. బడుగు బలహీన వర్గాల ప్రజలను గాలికి వదిలేశారని మండిపడ్డారు.

## నాణ్యమైన విత్తనాల లభ్యతే లక్ష్యం

వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: నాణ్యమైన విత్తనాల లభ్యతే లక్ష్యంగా ముందుకెళ్తామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లో అత్యాధునిక ఇస్టా ప్రమాణాలతో విత్తన పరీక్ష ల్యాబ్ (టిస్టా) భారత వ్యవసాయశాఖ ప్రతినిధుల అధ్యయన బృందం బుధవారం సందర్శించింది. ఈ అధ్యయనంలో భాగంగా తెలంగాణలో నిర్మించిన ఇస్టా ల్యాబ్‌లోని అధునాతన విత్తన పరీక్ష పరికరాలు, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డితో భారత ప్రభుత్వ ప్రతినిధులు భేటీ అయ్యారు. సమావేశంలో ఇస్టా ప్రెసిడెంట్ కె.కేశవులు, స్పెషల్ కమిషనర్ హనుమంత్ పాల్గొన్నారు.

---

## జన గర్జనలోనే..

▶ మొదటి పేజీ తరువాయి

మమేకమై పాదయాత్ర చేస్తున్నారని.. ఆ యాత్ర ఖమ్మం జనగర్జన సభతో ముగుస్తుందని తెలిపారు. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మరి కొందరు నేతలు, కార్యకర్తలతో కలసి పార్టీలో చేరుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సభలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొంటారని చెప్పారు. కాంగ్రెస్‌ను వీడిన వారంతా తిరిగి వస్తున్నారని, తెలంగాణలో కేసీఆర్ పాలనకు చరమగీతం పాడటమే లక్ష్యంగా అంతా కృషి చేస్తారని చెప్పారు.

## క్లుప్తంగా...

### ఉస్మానియా వైభవాన్ని పునరుద్ధరించాలి



సాక్షి, హైదరాబాద్: వందేళ్ల చరిత్ర గల ఉస్మానియా జనరల్ ఆస్పత్రి దుస్థితిని చూస్తే ఆందోళనకరంగా ఉందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. వైద్యవిద్య శిక్షణతో పాటు వ్యాధులను నయం చేసే ఈ అత్యున్నత నిర్మాణ ప్రతిష్టతను పునరుద్ధరించాల్సి ఉందన్నారు. ఉస్మానియా ఆస్పత్రి దుస్థితిపై 'జస్టిస్ ఫర్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్'అనే ట్విట్టర్ హ్యాండిల్ చేసిన ట్వీట్‌ను గవర్నర్ షేర్ చేస్తూ పై వ్యాఖ్యలు చేశారు.

### రాష్ట్ర సాధనపై వివరాలు పోస్టు చేయండి

**ఔత్సాహికులను కోరిన స్పెషల్ కమిషనర్ అశోక్**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సాధన ఉద్యమం, వివిధ సంఘటనలు, ప్రజల ఆకాంక్షకు సంబంధించిన ఆధారాలు, ఫొటోలను సేకరించాలని ప్రభుత్వం సంకల్పించిందని సమాచార, పౌర సంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ కె.అశోక్‌రెడ్డి తెలిపారు. వీటిని వచ్చే నెల 5లోపు స్పెషల్ కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ మాసబ్ ట్యాంక్, ఏసీగార్డ్స్, హైదరాబాద్‌కు పంపాలని పేర్కొన్నారు. ఔత్సాహికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. సమాచారం కోసం బిమల్ దేవ్ 99493 51523, adphoto.ts@gmail.comను సంప్రదించాలని వెల్లడించారు.

### పూటకో మాట.. రోజుకో వేషం

**సీఎం కేసీఆర్‌పై ట్విట్టర్‌లో వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ధ్వజం**



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పూటకో మాట మారుస్తూ రోజుకో వేషం వేస్తున్నారని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల విమర్శించారు. ఆయన ప్రజల పక్షమని చెప్పుకోవడానికి సిగ్గుపడాలని బుధవారం ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. సీఎం కేసీఆర్‌ది ప్రజల పక్షం కాదని, ప్రజల్ని దోచుకుతినే దొంగల పక్షమని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలతో కేసీఆర్ దోస్తానా అందితే జుట్టు అందకపోతే కాళ్లు అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. తాను రైతు పక్షపాతినని చెప్పుకుంటున్న కేసీఆర్ రుణమాఫీ పేరుతో 31 లక్షల మందిని మోసం చేసినందుకా? తొమ్మిదేళ్లలో 9వేల మంది రైతుల్ని పొట్టన బెట్టుకున్నందుకా? వరివేస్తే ఉరేనని చెప్పినందుకా? ఎందుకో రైతుల పక్షమో సమాధానం చెప్పాలని నిలదీశారు.

### మోదీ దత్తపుత్రుల అవినీతి బయటపెట్టాలి: నారాయణ



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ దత్తపుత్రుల అవినీతిని బయటపెట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ సహా తమిళనాడు నుంచి జమ్మూకశ్మీర్ వరకు ప్రాంతీయ పార్టీల కుటుంబ పాలన, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కుటుంబపాలన సాగుతోందని, వాళ్లంతా అవినీతికి పాల్పడుతున్నారని మోదీ చేసిన ఆరోపణలపై నారాయణ స్పందించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక మోదీ దత్తపుత్రులు 30 మంది ఎంత అవినీతికి పాల్పడ్డారో లెక్కలు చెప్పాలని, వారి అవినీతిని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. దత్తపుత్రుల్లో ప్రథమ పుత్రుడు అదానీ అని ఎద్దేవా చేశారు. లక్షల కోట్లు ఎగ్గొట్టి దేశం నుంచి వెళ్లిపోయినవాళ్లను, ఇక్కడే ఉండి దేశాన్ని దోచుకుంటున్న వారిని మోదీ కాపాడుతున్నారని దుయ్యబట్టారు. దేశం మొత్తంలో అవినీతికి పాల్పడుతున్నది బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మిత్రులేనని నారాయణ ఆరోపించారు.

### అమరవీరులస్తూపం వద్ద 'ధరణి'పై చర్చకు సిద్ధమేనా?

**ధరణి చర్చపై మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ నేత కోదండరెడ్డి సవాల్**



సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్‌పై చర్చించేందుకు గన్‌పార్క్ వద్ద ఉన్న అమరవీరులస్తూపం వద్దకు రావాలని, ఎప్పుడొస్తారో టైం చెబితే కాంగ్రెస్ నేతలుగా తాము వస్తామని మంత్రి కేటీఆర్‌కు ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి సవాల్ విసిరారు. ధరణి నిర్వహణలో తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మంత్రి కేటీఆర్ ఏదేదో చెబుతున్నారని ఆక్షేపించారు. గాంధీభవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...అవినీతి, దళారీవ్యవస్థను తీసేయడానికే ధరణిని తెచ్చామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెబుతున్నారని, ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే ధరణి పోర్టల్ ఆసరాగా వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ధరణిలో ఉన్న లోపాలపై ఆధారాలతో సహా అప్పటి సీఎస్ సోమేశ్‌కుమార్‌కు నోట్ ఇచ్చామని, ఆ వివరాలను సీఎంకు కూడా పంపామని, అయినా ఇంతవరకు ఎలాంటి స్పందన లేదని చెప్పారు.

# మా మంచి పనులు ఎందుకు కన్పించవు?

**గవర్నర్‌కు మంత్రి హరీశ్‌రావు ప్రశ్న**

- తమిళిసై బీజేపీ అధికార ప్రతినిధిలా మాట్లాడుతున్నారని విమర్శ
- ఉస్మానియా ఆస్పత్రిపై వ్యాఖ్యలు దురదృష్టకరమన్న మంత్రి
- ఆ భవనం ఆస్పత్రికి పనికిరాదని నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చినట్లు వెల్లడి
- కోర్టు క్లియరెన్స్ రాగానే నిర్ణయం తీసుకుంటామన్న హరీశ్



కోఠిలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అధికార ప్రతినిధిలాగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతున్నారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్ కోఠిలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. 'ఉస్మానియా ఆసుపత్రిపై గవర్నర్ ట్వీట్, వ్యాఖ్యలు దురదృష్టకరం. భవన నిర్మాణంపై మొదట స్పందించింది ముఖ్యమంత్రి కేసీఆరే. 2015 జూలైలో సీఎం ఆసుపత్రిని సందర్శించారు. నూతన భవన నిర్మాణానికి అప్పుడే రూ.200 కోట్లు ప్రకటించారు. అయితే ఆగస్టు 5వ తేదీన కొందరు కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారు. అందువల్ల అది ముందుకు వెళ్లలేదు. ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది. కోర్టు ఆదేశాల మేరకు హైదరాబాద్ ఐఐటీ నిపుణులు, పురావస్తు శాఖ డైరెక్టర్‌తో ప్రభుత్వం స్వతంత్ర కమిటీ వేసింది. ఈ కమిటీ ఆసుపత్రి నిర్వహణకు భవనం పనికిరాదని నివేదిక ఇచ్చింది. ప్రభుత్వం కోర్టుకు ఇదే విషయం చెప్పింది. కోర్టు నుంచి సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్నాం. అది రాగానే ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారు. గవర్నర్ ఈ విషయాలన్నీ పక్కన పెట్టి కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్టు, భూతద్దం పెట్టి వెతికినట్టు రాజకీయంగా బురద జల్లే వ్యాఖ్యలు చేయడం బాధాకరం. వైద్య ఆరోగ్య శాఖలో జరుగుతున్న మంచి పనులు గవర్నర్‌కి కనిపించవా? ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాం.. అది గవర్నర్‌కి కనిపించదు. ''మంచి కనబడదు.. మంచి వినబడదు.. మంచి చూడం''అన్నట్టుగా గవర్నర్ తీరు ఉంది..' అని హరీశ్‌రావు విమర్శించారు.

**చెడు మాత్రమే చూస్తామంటే ఎలా?**

'గవర్నర్ తీరులో రాజకీయం స్పష్టంగా కనిపిస్తోంది. ఒక వైద్యురాలిగా గవర్నర్ వైద్య ఆరోగ్యశాఖ కష్టాన్ని గుర్తించడం లేదు. 2014తో పోల్చితే పరిస్థితి మారింది. నీతి ఆయోగ్ నివేదికలో వైద్య రంగంలో తెలంగాణ మూడో స్థానంలో నిలిచింది. నిమ్స్‌లో పడకల సంఖ్యను 1,500కు పెంచాం. కొత్తగా 2,000 పడకలతో విస్తరిస్తున్నాం. కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ వంటి కార్యక్రమాలు అమలు చేసి, ప్రభుత్వ దవాఖానాల్లో వసతులు పెంచి మాతా శిశు మరణాలను తగ్గించాం. ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాలను 30 శాతం నుండి 70 శాతానికి పెంచాం. దేశంలో 100 శాతం ఆసుపత్రి డెలివరీలు జరుగుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కేంద్రమే చెప్పింది. కంటి వెలుగు చాలా బాగా చేశాం. ఇవేవీ గవర్నర్ గుర్తించరు. ప్రశంసించడానికి మనసు రాదు. అభినందిస్తూ కనీసం ఒక ట్వీట్ కూడా చేయరు. నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అనే స్థితి నుంచి నేను వస్తా బిడ్డ సర్కార్ దవాఖానకు అనే స్థాయికి చేర్చాం. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ దేశంలోనే ఒక చరిత్ర. లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లతో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నాం. డయాలసిస్ సెంటర్లు గతంలో మూడు ఉంటే 102కు పెంచాం. గాంధీ, నిమ్స్, ఉస్మానియాలో పేదలకు ఒక్క రూపాయి ఖర్చు కాకుండా అవయవ మార్పిడి చేస్తున్నారు. బస్తీ దవాఖానాలను కూడా నీతి ఆయోగ్ ప్రశంసించింది. ఇవేమీ గవర్నర్‌కు ఎందుకు కనిపించడంలేదు? ఎందుకు అభినందించరు? ఎందుకు స్పందించరు? ఒక డాక్టర్‌గానైనా గవర్నర్ అభినందించాలి కదా? వైద్యుల మనోధైర్యం పెంచేలా అభినందిస్తూ ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడరు? ప్రశంసిస్తే మేమింకా ఉత్సాహవంతంగా పనిచేస్తాం కదా? అలా కాకుండా చెడును మాత్రమే చూస్తాం, చెడు మాత్రమే వింటాం, చెడు మాత్రమే మాట్లాడతాం అన్నట్టుగా వ్యవహరించడం గవర్నర్‌కు తగదు. బీజేపీలా రాజకీయ విమర్శలు చేయడం దురదృష్టకరం..'అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## రాష్ట్రంలో టీసీఎల్ యూనిట్ ఏర్పాటు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- రూ.225 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి
- మంత్రి కేటీఆర్ సమక్షంలో రాష్ట్రానికి చెందిన రిసోజెట్‌తో అవగాహన ఒప్పందం
- తొలి దశలో 500 మందికి ఉపాధి

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ సంస్థ టీసీఎల్.. తెలంగాణలో కంపెనీని ఏర్పాటు చేయనుంది. ఈ కంపెనీ రాష్ట్రానికి చెందిన రిసోజెట్ సంస్థతో కలసి కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్ గూడ్స్ తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. ఈ మేరకు బుధవారం పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు సమక్షంలో రిసోజెట్‌తో టీసీఎల్ ప్రతినిధులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. టీసీఎల్ ఎలక్ట్రానిక్స్ తన ప్రధాన కేంద్రం అయిన చైనాలోని హెఫెయి నగరం తర్వాత ఇతర దేశాల్లో ఏర్పాటు చేస్తున్న తొలి తయారీ యూనిట్ ఇదే కావడం గమనార్హం. ఈ కంపెనీలో తొలుత వాషింగ్ మెషిన్లను తయారు చేస్తారు. అనంతరం రిఫ్రిజిరేటర్లు, డిష్ వాషర్ల వంటి ఇతర ఉపకరణాలనుకూడా తయారు చేస్తారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలోని 'ఈ- సిటీ'లో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్ కోసం టీసీఎల్ రూ.225 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. ఈ యూనిట్‌తో తొలిదశలోనే సుమారు 500 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెపుతున్నారు. రాష్ట్రంలో టీసీఎల్ కంపెనీ పెట్టుబడులు పెట్టడాన్ని మంత్రి కేటీఆర్ స్వాగతించారు. ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ రంగానికి తెలంగాణ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, ఇక్కడ హైటెక్నాలజీ ఉత్పత్తుల తయారీకి మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం హైదరాబాద్‌ను షెన్జెన్ ఆఫ్ ఇండియాగా మార్చేందుకు సిద్ధంగా ఉన్నదని తెలిపారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలను, టీసీ ఎల్ సంస్థ చైర్‌పర్సన్ జువాన్ డూకి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. తెలంగాణలో ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీకి ఉన్న అనుకూల పరిస్థితులు, మౌలిక వసతులు, తమ ప్రభుత్వ విధానాలను పరిశీలించేందుకు రాష్ట్రంలో పర్యటించాలని కేటీఆర్ ఆమెను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కంపెనీ రెజల్యూట్ గ్రూప్ చైర్మన్ రమీందర్ సింగ్ సొయిన్, రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ విభాగం డైరెక్టర్ సుజాయ్ కారంపురి తదితరులు పాల్గొన్నారు.



భోపాల్ నుంచి వచ్చిన కార్యకర్తలకు స్వాగతం పలుకుతున్న బండి సంజయ్

## ఆ మార్పుల ప్రచారం కేసీఆర్ కుట్ర

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్
- వచ్చే నెలలో ప్రధాని నగరానికి రానున్నారని వెల్లడి

సికింద్రాబాద్: బీజేపీ రాష్ట్ర కమిటీలో మార్పులు చేస్తారన్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రకటించారు. రాష్ట్ర పార్టీలో నాయకత్వ మార్పులు జరుగుతాయని, మంత్రి వర్గంలో కూర్పులు ఉంటాయని జరుగుతున్న ప్రచారం వెనుక సీఎం కేసీఆర్ కుట్ర ఉందని ఆయన విమర్శించారు. భోపాల్ పట్టణంలో జరిగిన 'మేరా బూత్ సబ్‌సే మజ్బూత్'కార్యక్రమానికి హాజరైన 600 మంది కార్యకర్తలు తిరిగి బుధవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వీరికి స్వాగతం పలికేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చిన బండి సంజయ్ విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్.. తన పార్టీ పనులు పక్కనబెట్టి ఇతర పార్టీల్లో గందరగోళం సృష్టించే మూర్ఖుడని అభివర్ణించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా తనకు, జాతీయ అధ్యక్షుడు నడ్డాకు తెలియకుండా తమ పార్టీలో మార్పుల గురించి మీడియాల్లో కథనాలు రావడం విచారకరమన్నారు. అన్ని రాష్ట్రాల నాయకులతో సమావేశాల్లో భాగంగా.. వచ్చే నెలలో రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటన ఉంటుందని సంజయ్ తెలిపారు. తమ పార్టీ నేత ఈటల రాజేందర్‌ను హత్య చేయడానికి కుట్రపై పూర్తిస్థాయి విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని, ఆయనకు అవసరమైన భద్రతను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, జె.సంగప్ప, శ్యాంసుందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇదీ భూ కబ్జానే..

▶ మొదటి పేజీ తరువాయి

అంశాన్ని ప్రస్తావించింది. ఎలాంటి అభివృద్ధికి నోచుకోని అణగారిన వర్గాలకు భూమి ఇస్తే అర్థం చేసుకోవచ్చు గానీ.. ఆర్థికంగా బలంగా ఉన్న కులాలకు ఎందుకని ప్రశ్నించింది. ప్రభుత్వమే కులాలను పెంచి పోషించేలా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్న న్యాయస్థానం.. హైటెక్ రాష్ట్రం తెలంగాణలో ఇదేం పద్ధతని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కుల సంఘాల పేరిట రాజధాని నడిబొడ్డున అత్యంత విలువైన భూములను కేటాయించడం అసంబద్ధమైన విధానమంటూ తదుపరి విచారణను ఆగస్టు 2కు వాయిదా వేసింది. కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్య, ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్‌కు కుల సంఘ భవనాల నిర్మాణం కోసం 5 ఎకరాల చొప్పున హైటెక్ సిటీ సమీపంలో అత్యంత విలువైన భూములు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎ.వినాయక్ రెడ్డి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం బుధవారం మరోసారి విచారించింది.

**కౌంటర్‌కు అనుమతి...**

ఈపిటిషన్‌లో ఇప్పటివరకు ఎలాంటి కౌంటర్ దాఖలు చేయని కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్యకు ఎక్స్‌పార్టీ ఆదేశాలు జారీ చేస్తామని గత విచారణ సందర్భంగా ధర్మాసనం చెప్పింది. వెలమ అసోసియేషన్‌కు మాత్రం రెండు వారాలు సమయం ఇస్తున్నామంది. కమ్మ సంఘం తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కోవిడ్ కాలంలో తమకు నోటీసు అందలేదని, భూ కేటాయింపుపై విచారణ సాగుతున్న విషయం ప్రచార మాధ్యమాల ద్వారా తెలిసిందన్నారు. ఈ క్రమంలో తమకు కౌంటర్ దాఖలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేయగా, ధర్మాసనం అంగీకరించింది. కాగా, తమకు కేటాయించిన భూముల కబ్జా అయ్యే అవకాశం ఉందని, చుట్టూ ప్రహరీ కట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలని కుల సంఘాల తరఫు న్యాయవాదులు కోరారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం .. ఈ భూ కేటాయింపే ఓ కబ్జా అని వ్యాఖ్యానించింది. ఉన్నత విద్య కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన పేద విద్యార్థులకు ఆశ్రయం కోసం హాస్టళ్లను నిర్మించేందుకు భూమి కేటాయించడంలో అర్థం ఉంది కానీ.. ఇలా కుల సంఘాలకు కేటాయింపును సమర్థించలేమని పేర్కొంది. అసలు ఆ కులసంఘాలు ఆయా కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఎలా నిర్ణయించారని ప్రశ్నించింది.

## అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ బాధ్యుల పర్యటన

- భోపాల్‌లో రెండురోజుల శిక్షణ అనంతరం పరిశీలన
- ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు వెయ్యి మంది రాక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌లలో ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు చెందిన బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు, ఇన్‌చార్జిలు పర్యటించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం వెయ్యి మంది దాకా (ఏడెనిమిది వందల మంది ఇతర రాష్ట్రాల వారే) ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. వారం, పది రోజుల పాటు నిర్వహించే పర్యటనల్లో భాగంగా బుధవారం చాలామంది ఇక్కడికి చేరుకున్నారు. పోలింగ్ బూత్‌స్థాయిల్లో చేపడుతున్న కార్యక్రమాలు, బూత్ కమిటీల ఏర్పాటు, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి, సమస్యలు తదితర అంశాలపై వారు జాతీయ నాయకత్వానికి నివేదికలు సమర్పించే అవకాశాలున్నట్టు పార్టీవర్గాల సమాచారం. తాజాగా సోమ, మంగళవారాల్లో భోపాల్‌లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 'మేరా బూత్ సబ్‌సే మజ్బూత్'లో భాగంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రం నుంచి కూడా దాదాపు మూడువందల మంది శిక్షణకు హాజరయ్యారు. వీరంతా వారం, పది రోజుల పాటు తమకు అప్పగించిన రాష్ట్రాల్లోని పోలింగ్ బూత్‌లకు చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలిస్తారు. వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల దాకా దశలవారీగా నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా తొలుత పోలింగ్‌బూత్‌స్థాయిలో.. ఆ తర్వాత అసెంబ్లీ, లోక్‌సభ, జిల్లాల వారీగా ఈ కసరత్తు నిర్వహిస్తారు. ఇతర రాష్ట్రాల్లో పార్టీకోసం అంకితభావంతో పనిచేసే నాయకులు, కార్యకర్తలను ఈ విధుల కోసం పార్టీ నాయకత్వం ప్రత్యేకంగా ఎంపిక చేసింది. ఇందుకోసంప్రధానంగా తెలంగాణకు పొరుగునున్న ఆంధ్ర, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరి తదితర రాష్ట్రాల నుంచి కార్యకర్తలను ఎంపిక చేసినట్టు పార్టీవర్గాల సమాచారం.

# ఆర్‌ఆర్‌ఆర్ చుట్టూ రింగ్ రైల్

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయించిందని వెల్లడించారు. దీనితోపాటు 'రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి ప్రత్యేక సహాయ పథకం'లో భాగంగా కేంద్రం 2020-21 నుంచి 2023-24 వరకు తెలంగాణ రాష్ట్రానికి రూ.5,221.92 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు.

**ఎన్‌సీడీసీ కోసం భూమి ఇవ్వండి**

అత్యాధునిక వ్యాధి నిర్ధారణ సౌకర్యాలతో కూడిన 'నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్సీడీసీ)' కేంద్రాన్ని తెలంగాణలో ఏర్పాటు చేయటానికి కేంద్రం గతంలోనే ఆమోదం తెలిపిందని కిషన్‌రెడ్డి వెల్లడించారు. కానీ జీనోమ్ వ్యాలీలో ఈ కేంద్రం ఏర్పాటుకోసం అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు బదలాయించలేదని చెప్పారు. ఇది రాష్ట్రానికి ఎంతో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు అని.. ఇలాంటి వాటిని ఎంత త్వరగా పూర్తిచేసుకుంటే రాష్ట్ర ప్రజలకు అంత ఎక్కువ మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్‌కు మరో లేఖ రాయనున్నట్టు తెలిపారు. దేశంలో పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు సెప్టెంబర్‌లో ఢిల్లీలో గ్లోబల్ టూరిజం ఇన్వెస్టర్స్ సదస్సు నిర్వహించనున్నట్టు వివరించారు.

# వరి @ రూ.3,010

**కేసముద్రం మార్కెట్‌లో రికార్డుస్థాయి ధర పలికిన వరిధాన్యం**

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ధాన్యానికి (ఆర్‌ఎన్‌ఆర్ పాతరకం) రికార్డుస్థాయిలో ధర రూ.3,010లు పలికింది. ఈ సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ధాన్యానికి అత్యధికంగా ధర పలకడం ఇదే తొలిసారి. మద్దతు ధర రూ.2,060 ఉండగా, మద్దతుకు మించే ధర రావడం విశేషం. కాగా, మార్కెట్‌కు బుధవారం 1,778 బస్తాల ధాన్యం అమ్మకానికి రాగా, గరిష్ట ధర రూ.3,010, కనిష్ట ధర రూ.2,219 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## 7న హైదరాబాద్‌కు నడ్డా, బీఎల్ సంతోష్

సాక్షి, హైదరాబాద్: వచ్చేనెల 8న నిర్వహించనున్న 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధానకార్యదర్శుల భేటీకోసం జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సంస్థాగత ప్రధానకార్యదర్శి బీఎల్ సంతోష్ 7వ తేదీ రాత్రి హైదరాబాద్‌కు రానున్నారు. ఈ భేటీకోసం సన్నాహక సమావేశం నగరంలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగింది. సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి, ఏపీ బీజేపీ నేత పురందేశ్వరి, తెలంగాణ బీజేపీ కోశాధికారి శాంతికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా॥జి.మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. 8న జరిగే సమావేశ సమన్వయ బాధ్యతలను పురందేశ్వరికి అప్పగించినట్టు సమాచారం. వివిధ రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలతోపాటు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ భేటీలో చర్చించనున్నారు.


## అన్ని రంగాల్లో తెలంగాణ నంబర్ వన్

**తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది: మంత్రి హరీశ్‌రావు**

సాక్షి, హైదరాబాద్: మొన్నటిదాకా బీఆర్‌ఎస్‌కు బలమే లేదు అన్నవాళ్లు... ఇప్పుడు సీఎం కేసీఆర్ మహారాష్ట్ర పర్యటన తర్వాత ఉలిక్కిపడి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉందన్నారు. 'ఏ కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రంతో పోల్చినా మనం అగ్రభాగాన ఉన్నాం. తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది అనే స్థాయికి చేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే. తెలంగాణ తరహా పథకాలు కావాలని దేశవ్యాప్తంగా కోరుతున్నారు. మేము మహారాష్ట్రకు వెళ్లినప్పుడు తెలంగాణ పోలీసులకు ఇస్తున్న ఇంటెన్సివ్‌ల గురించి అక్కడి పోలీసులు అడిగి తెలుసుకున్నారు. మాకూ ఇలాంటివి కావాలన్నారు'అని హరీశ్‌రావు అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక సమస్యలకు సీఎం కేసీఆర్ శాశ్వత పరిష్కారం ఇచ్చారన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా రాష్ట్రంలో రెండో స్థానం కోసమేనని దుయ్యబట్టారు. దేశంలో అదానీ బలోపేతం కావాలంటే మోదీకి ఓటేయాలని వ్యాఖ్యానించారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో అదానీ బాగుపడ్డాడు తప్ప.. ఏ రంగంలో గుణాత్మక మార్పు వచ్చిందో చెప్పగలరా? అని బీజేపీని నిలదీశారు.

## గౌరవం లేని చోట ఎలా ఉండగలను?

- టికెట్ ఇవ్వకుంటే అధిష్టానంతో అమీతుమీ: తీగల కృష్ణారెడ్డి
- ఇప్పటికే ఇద్దరు పోయారు... అదే దారిలో మరికొందరు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ఆత్మీయ సభలకు ఆహ్వానం లేదు. దశాబ్ది వేడుకలకు దూరం పెట్టారు. ఆత్మగౌరవాన్ని చంపుకొని పని చేయాల్సిన అవసరమేంటి? గౌరవం లేని చోట ఉండలేను. ఎన్నికల్లో పోటీకి టికెట్ ఇస్తే సరి. లేదంటే అధిష్టానంతో అమీ..తుమే'అని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి చెప్పారు. ఆయన బుధవారం 'సాక్షి'తో మాట్లాడుతూ.. వయసురీత్యా తనకు ఇవే చివరి ఎన్నికలని, ఈసారి మహేశ్వరం నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని స్పష్టంచేశారు. 'సీఎం కేసీఆర్‌కు సమకాలికుడిని. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ పిలుపుమేరకు టీడీపీని వీడి.. టీఆర్‌ఎస్‌లో చేరాను. 2018లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయాను. అంతమాత్రాన పక్కన పెడతారా? కాంగ్రెస్‌లో గెలుపొందిన సబితా ఇంద్రారెడ్డిని పార్టీలో చేర్చుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది. ఇతర పార్టీల్లో గెలుపొందిన వాళ్లను అక్కున చేర్చుకుని, పార్టీలోని సీనియర్లకు సముచిత స్థానం కల్పించకుండా అగౌరవపర్చడం ఎంత వరకు సమంజసం. ఇప్పటికే ఇద్దరు సీనియర్ కీలక నేతలు పార్టీని వీడారు. అదే దారిలో మరికొంత మంది ఉన్నారు'అని తీగల చెప్పారు.

## కౌశిక్ ఓ సైకో.. శాడిస్ట్: ఈటల రాజేందర్



రఘునాథపల్లి/కాజీపేట రూరల్: ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఓ సైకో.. శాడిస్ట్ అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తీవ్ర వాఖ్యలు చేశారు. బుధవారం ఆయన జనగామ జిల్లా రఘునాథపల్లి, కాజీపేటలో విలేకరులతో మాట్లాడారు. హుజూరాబాద్ ప్రజలపై ఓ సైకోను కేసీఆర్ ఎమ్మెల్సీగా పెట్టారని విమర్శించారు. కౌశిక్ వైఖరి.. తనను దుర్భాషలాడడంతోపాటు సుపారీ గ్యాంగ్‌లకు డబ్బులిచ్చాం.. ఎప్పుడో ఒకప్పుడు చంపేస్తామని బెదిరించేంత స్థాయికి చేరిందన్నారు. హుజురాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తా, జమ్మికుంటలోని గాంధీ చౌరస్తాలో చెప్పులు మెడలో వేసి తిప్పుతామని ఈటల హెచ్చరించారు. ఈ సైకోకు ఇంత బలం రావడానికి పదవి ఇవ్వడమే కాదు.. ఈటలను ఇబ్బంది పెట్టాలన్న కేసీఆర్ సూచనలూ కారణమని పేర్కొన్నారు. తన హత్యకు కుట్రపై విచారణ బాధ్యతలను ఐపీఎస్ అధికారికి కేటీఆర్ అప్పగించినట్లు ప్రసార మాధ్యమాల్లో చూశానని, ప్రజలకు రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. గ్యాంగ్‌స్టర్ నయీం, సాంబశివుడిని చంపినప్పుడు.. నీకు కూడా కుక్క చావు తప్పదన్నానని.. అప్పుడు తనను కూడా చంపుతానని బెదిరించాడని తెలిపారు. ఆనాడు భయపడని తాను ఇప్పుడెందుకు భయపడతానని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ సైకో చేష్టలు భరించలేకనే తనపై హత్య కుట్రను బయటపెట్టాల్సి వచ్చిందని ఈటల పేర్కొన్నారు.

## బీజేపీలో ఆదరణ లేక ఈటల అసంతృప్తి

**బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు**



మానకొండూర్: హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఏదో ఊహించుకుని బీజేపీలోకి వెళ్లారని, అక్కడ ఆదరణ లేకపోవడంతో తిరిగి ఏ పార్టీలోకి వెళ్లాలో తెలియక శామీర్‌పేట చౌరస్తాలో నిలబడ్డారని బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఎద్దేవా చేశారు. ఆయన కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని తన నివాసంలో జెడ్పీ చైర్మన్ కనుమల్ల విజయతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. పాడి కౌశిక్ రెడ్డికి.. సీఎం కేసీఆర్ రూ.20 కోట్లు సుపారి ఇచ్చి ఈటలను హత్య చేయిస్తారన్న ఈటల జమున ఆరోపణలు నిరాధారమైనవని తెలిపారు. హత్య చేయిస్తారని తెలిసినప్పుడు పోలీస్‌స్టేషన్‌లో ఎందుకు ఫిర్యాదు చేయలేదని ఆయన ప్రశ్నించారు. జెడ్పీ చైర్మన్ విజయ మాట్లాడుతూ ఈటలకు రాజకీయ జీవితం ఇచ్చిందే కేసీఆర్ అని స్పష్టం చేశారు.



మంచి భర్త ఎప్పుడూ రాత్రిపూట (అందరికంటే) ముందు పడుకోడు: ఉదయం అందరికంటే చివర మేల్కొనడు.

– హానొరే డె బాల్జాక్



సాక్షి

గురువారం, 29 జూన్ 2023

# ప్రశ్నల పీక నొక్కకండి!

ప్రశ్నిస్తే... వేధిస్తారా? అవును. సోషల్ మీడియా తెర చాటున నిలబడి దొంగ పేర్లతో బాణాలు వేసే విచ్చలవిడి వీరత్వం పెరుగుతున్న కొద్దీ అదే ఖాయమవుతోంది. గత వారం అమెరికా పర్యటనలో ఉన్న భారత ప్రధానిని వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు సాక్షిగా ఇబ్బందికరమైన ప్రశ్న వేయడమే పాకిస్తానీ అమెరికన్ జర్నలిస్ట్ సబ్రినా సిద్దిఖీ చేసిన పాపమైంది. భారత్‌లో మైనారిటీల హక్కుల సంగతి అడిగిన ఆమెపై ట్రోలింగ్ తీరు అచ్చం అలాగే ఉంది. చివరకు వైట్‌హౌస్ ప్రతినిధి ఈ ట్రోలింగ్‌లు 'అంగీకారయోగ్యం కాదు' అని ఖండించాల్సి వచ్చింది. ప్రజాస్వామ్య సూత్రాలకే విరుద్ధమని హితవు చెప్పాల్సొచ్చిందంటే తీవ్రత అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్ నుంచి అమెరికా దాకా అంతటా జర్నలిస్టులకు ఎదురవుతున్న ట్రోలింగ్‌భూతంపై పోరు అత్యవసరమని ఇది గుర్తుచేస్తోంది.

మోదీని ప్రశ్నించిన సబ్రినా సిద్దిఖీ అనుభవమున్న జర్నలిస్ట్. తల్లితండ్రులు పాకిస్తానీలైనా, ఆమె పుట్టింది అమెరికాలోనే. దీర్ఘకాలంగా అమెరికా అధ్యక్షులు, వైట్‌హౌస్ వ్యవహారాలను నివేదిస్తూ, విలేఖరిగా తనదైన ముద్ర వేశారు. 'హఫింగ్టన్ పోస్ట్', 'బ్లూమ్‌బెర్గ్', 'గార్డియన్' లాంటి ప్రసిద్ధ సంస్థల్లో తన పాళీకి పదునుపెట్టుకున్నారామె. సాధారణంగా ఎన్నడూ అప్పటికప్పుడు అడిగే ప్రశ్నలకు జవాబివ్వాల్సిన విలేఖరుల సమావేశంలో పాల్గొనని మోదీ వైట్‌హౌస్ ఒత్తిడి మేరకు బైడెన్‌తో కలసి విలేఖరుల ముందుకు రావాల్సి వచ్చింది. ఇద్దరూ చెరి రెండు ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన ఆ భేటీలో 'వాల్ స్ట్రీట్ జర్నల్' ప్రతినిధిగా సబ్రినా మోదీని వేసింది ఒక ప్రశ్నే. 'ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారత్‌లో మతపరమైన మైనారిటీలపై ప్రభుత్వ దుర్విచక్షణ సాగుతోందనీ, విమర్శకుల నోరు మూయిస్తున్నారనీ మానవ హక్కుల సంస్థలంటున్నాయి. మైనారిటీల హక్కులకై మీ సర్కారేం చేయనుంది' అన్నది స్థూలంగా ప్రశ్న.

ఇరుకున పెట్టే ప్రశ్న వేసినా, భారత్‌లో అలాంటిదేమీ లేదంటూ ప్రధాని బలంగానే తన వాణి వినిపించారు. అయినా సరే, ఆయనను అలాంటి ప్రశ్న వేయడం వీరభక్తులకు నచ్చలేదు. ఫలితమే – అంతర్జాలంలో సబినాపై అమానుష దాడి. ఆమె పాకిస్తానీ అనీ, ముస్లిమ్ అనీ, డిజిటల్ యుగపు నిరసనల 'టూల్‌కిట్ గ్యాంగ్'లో భాగమనీ దుర్భాషలాడారు. ఇలాంటి ట్రోలింగ్ ప్రైవేట్ మూకల్నీ, సాంకేతిక జ్ఞానంతో కావాల్సిన సందేశాలు పంపే ఇంటర్నెట్ బాట్ల విధానాన్నీ ఇవాళ పాలక వ్యవస్థలన్నీ పెంచిపోషిస్తున్న మాట నిష్ఠురసత్యం. మోదీని ప్రశ్నించిన జర్నలిస్టును వేధిస్తున్నది పాలకపక్ష ప్రైవేట్ సైన్యమే అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నది అందుకే. ధైర్యంగా ప్రశ్నించడంలో జర్నలిస్టుగా ఆమె తన బాధ్యత నిర్వహిస్తే, సోషల్ మీడియా వేదికగా విషం చిమ్మడం విస్తుపరుస్తోంది. వెనకెవరూ లేనిదే ఇంతగా వేధింపులకు దిగరనేది తర్కబద్ధమే. 'ఈ పని మీ ప్రైవేట్ ట్రోల్ సేనలది కాదా? వారిపై చర్యలు తీసుకుంటారా?' అని బీజేపీపై కాంగ్రెస్ విరుచుకుపడింది.

మీడియా ప్రజాస్వామికీకరణకు సోషల్‌మీడియా ఉపకరించింది ఎంత నిజమో, వేదికలు పెరిగి, చేతిలో ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ అడ్డుకట్ట లేని అంతర్జాలంలో అడ్డమైన అభిప్రాయాలనూ వదిలి, భావకాలుష్యం పెంచుతున్నదీ అంతే నిజం. దాని విపరిణామమే ఇప్పుడు ప్రపంచమంతటా చూస్తున్నది. మెజారిటీ ఆలోచనకు భిన్నాభిప్రాయం ఉన్నవారెవరినీ సోకాల్డ్ ప్రజాస్వామ్య వేదికలు ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లలో ఎక్కడా మననివ్వక పోవడం నిత్యం చూస్తున్నదే. సాధారణ సమూహాల నుంచి పాలక పక్షాల దాకా అందరికీ ఈ ట్రోలింగ్ ఓ ఆనవాయితీ. ప్రత్యర్థి పీకనొక్కే పదునైన ఆయుధం. ఈ వర్తమాన వైపరీత్యానికి బాధితులే – అమెరికాలో సబ్రినా అయినా, హైదరాబాద్‌లో చందు తులసి అయినా! ఇందులో భావప్రకటన స్వేచ్ఛ ఒక్కటే కాదు... బెదిరింపులు, దూషణలతో భయభ్రాంతుల్ని చేసి, మానసికంగా హింసించే మానవ హక్కుల ఉల్లంఘన కోణమూ ఉంది.

సాక్షాత్తూ ఓ కేంద్ర మంత్రి సబ్రినా తరహాలో తమ పాలనపై ప్రశ్నలు వేస్తున్న వారందరినీ ఇప్పటికే 'పాత్రికేయ వేశ్యలు' (ప్రెస్టిట్యూట్స్) అనడం చూశాం. అది ఏ స్థాయి అసహనమో అర్థం చేసుకున్నాం. పాలకులు సైతం ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రజాస్వామ్యంలో పాత్రికేయుల పని ప్రశ్నించడమే! ప్రజల పక్షాన నిలిచి ప్రశ్నిస్తేనే అది నేరమన్నంత అసహనం ఏ పాలనకైనా మంచిది కాదు. వేసిన ప్రశ్నలో, చేసిన విమర్శలో నిజం లేదనుకుంటే, ఆ సంగతి ససాక్ష్యంగా చెప్పవచ్చు. నలుగురికీ తెలిసేలా నిరూపణలు చూపవచ్చు. అంతేకానీ, అభిప్రాయం కలిగివుండడమే నేరమన్నట్టు ప్రవర్తిస్తే అన్యాయం. కానీ, వాట్సప్ యూనివర్సిటీలు పంచుతున్న, పెంచుతున్న అజ్ఞానాంధకారం సాక్షిగా దేశంలో ఈతరహా వేధింపులు అన్ని స్థాయుల్లో పెరిగిపోవడమే విషాదం.

భగవద్గీత సైతం తెలుసుకొనేందుకు 'పరిప్రశ్న' వేయమనే చెబుతోంది. కానీ, ప్రశ్నించడమే నేరమనే ధోరణిలోకి మన దిగజారడం కలవరపెడుతోంది. ఈ ట్రోలింగ్ ముఠా తెలిసో తెలియకో... 'విమర్శకుల నోరు మూయిస్తున్నారట' అన్న సబ్రినా వాదననే నిజంచేసింది. అలాగే, లింగ వివక్షతో రాజకీయాల్లో మహిళలపై ట్రోలింగ్ మరీ ఎక్కువనీ, న్యూజిలాండ్ ప్రధాని నుంచి మన దేశపు నేతల దాకా అందరూ బాధితులేననీ రెండేళ్ళ పరిశోధనతో ఈ ఫిబ్రవరిలో విడుదలైన అధ్యయనం తేల్చడం గమనార్హం. అధికార భావజాలాన్ని వ్యతిరేకిస్తే మీపై, పిల్లలపై అత్యాచారం చేస్తామనే ఈ బరితెగింపు వేధింపుల్ని అరికట్టే కఠినమైన సైబర్ చట్టాలు కావాలి. ప్రభుత్వాలూ చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలి. ఎందుకంటే, గొంతు విప్పడానికే భయపడాల్సిన పరిస్థితిని ఎక్కడ, ఎవరు, ఎందుకు సృష్టించినా అది సమర్థనీయం కాదు. సహించాల్సింది కానే కాదు. అది ప్రజాస్వామ్యం అసలే కాదు!

# తిరుగుబాటు టీ కప్పులో తుపానా?

విశ్లేషణ



గుర్జీత్ సింగ్

**రష్యాలో వాగ్నర్ గ్రూపు తిరుగుబాటు ఎక్కువసేపు కొనసాగలేదు కానీ, ఉన్నతాధికార వర్గాల్లో ఒకింత అలజడినైతే సృష్టించింది. యుద్ధానికి కావాల్సిన ఆయుధాలను రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ నిరాకరించడమే ఈ తిరుగుబాటుకు కారణమని అంచనా. ఉక్రెయిన్‌లో వాగ్నర్ గ్రూపు సభ్యులు చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి ఉండొచ్చు. నెపం రక్షణ మంత్రిత్వ శాఖపై నెట్టడం మంచి వ్యూహం. అయితే ఈ తిరుగుబాటు వల్ల ఉక్రెయిన్ యుద్ధాన్ని మరింత నిశితంగా పరిశీలించాల్సిన పరిస్థితి రష్యాకు ఏర్పడింది. వాగ్నర్ గ్రూపు లాంటి కిరాయి దళాలు రష్యా సాధించిన విజయాల్లో కొన్నింటికి కారణమైతే కావొచ్చు కానీ, అంతిమంగా ఇవి అధికార వ్యవస్థను బలహీన పరిచేవే!**

వాగ్నర్ తిరుగుబాటు ఉక్రెయిన్‌పై పోరు విషయంలో రష్యా తన పరిస్థితిని పునఃసమీక్షించుకునేందుకు పురిగొల్పవచ్చు.

రష్యా రక్షణ మంత్రిత్వ శాఖపై వాగ్నర్ గ్రూపు తిరుగుబాటు ఎక్కువసేపు కొనసాగలేదు కానీ, రష్యా ఉన్నతాధికార వర్గాల్లో ఒకింత అలజడినైతే సృష్టించింది. తిరుగుబాటుకు మాత్రమే కాకుండా... అంతే వేగంగా అది సమసిపోయేందుకు కారణాలేమిటన్న దానిపై పెద్ద ఎత్తున ఊహాగానాలు సాగుతున్నాయి. కొన్ని తప్పుడు అంచనాల వల్ల జరిగిందా? లేదా పనిగట్టుకుని కుట్రపూరితంగా వెలుగులోకి వచ్చిన విప్లవమా? వాగ్నర్ కమాండర్ యెవ్గెనీ ప్రిగోజిన్, రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇప్పటికీ దోస్తులేనా?

ఉక్రెయిన్‌పై యుద్ధంలో పైచేయి సాధించలేకపోవడంతో ఆఫ్రికా కార్యకలాపాల్లో నిమగ్నమైన వాగ్నర్ మూకలను రష్యా రప్పించాల్సి వచ్చింది. అందరితో మంచి సంబంధాలు కలిగి ఉండటమే కాకుండా, బాగా డబ్బున్న కిరాయి సైనికుడైన ప్రిగోజిన్ సారథ్యంలో నడుస్తున్న వాగ్నర్ గ్రూపు 2014లో ఉక్రెయిన్ నుంచి క్రిమియాను లాక్కోవడంలో రష్యాకు బాగా ఉపయోగపడింది. ప్రపంచానికి దీని గురించి తెలిసింది కూడా అప్పుడే. ఆ వెంటనే అమెరికా వాగ్నర్ గ్రూపు, ప్రిగోజిన్‌లపై ఆంక్షలు ప్రకటించింది.

ఆ తర్వాత వాగ్నర్ గ్రూపు దాదాపు ఇరవై దేశాల్లో రష్యా ప్రయోజనాలను కాపుకాస్తూ వచ్చింది. అయితే, మొజాంబిక్‌లోని కాబో డెలగాడోలో చొరబాటుదారులను అణచడంలో విఫలమైంది. చివరకు అక్కడ రువాండా దళాలు శాంతి భద్రతలను పునఃస్థాపించాయి. లిబియా, సూడాన్, మాలి, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, ఇలా పలు దేశాల్లో వాగ్నర్ గ్రూపు చురుకుగా పని చేసింది. అప్పటికే అక్కడున్న ఫ్రెంచి దళాలను తరిమేయడం లేదా అంతర్గత కుమ్ములాటల్లో ఒక పక్షం వహించడం వాగ్నర్ గ్రూపు చేసిన పనులు. ప్రధాన లక్ష్యం మాత్రం రష్యా మద్దతిచ్చిన సంస్థలకు దన్నుగా నిలవడం. ఈ పనులకు ప్రతిఫలంగా వాగ్నర్ గ్రూపునకు రష్యా ఆయుధాల సరఫరా జరుగుతుంది. బంగారం ఇతర సహజ వనరుల వెలికితీతకు సంబంధించిన వాటిల్లో మినహాయింపులు లభిస్తాయి. ఈ నేపథ్యంలోనే వాగ్నర్ గ్రూపును ఉక్రెయిన్‌పై యుద్ధానికి దింపింది రష్యా. ఫలితంగా ఆఫ్రికా దేశాల్లో ఈ గ్రూపు కార్యకలాపాలు ఆగిపోయాయి. ఉక్రెయిన్ బఖ్‌ముట్ నగరంలో వాగ్నర్ గ్రూపు యుద్ధ సామర్థ్యానికి పుతిన్ ప్రశంసలు కూడా లభించాయి.



## తిరుగుబాటుకు కారణాలేమిటి?

బఖ్‌ముట్ ప్రాంతంలో యుద్ధానికి కావాల్సిన ఆయుధాలను ఇచ్చేందుకు రష్యా నిరాకరించడమే ప్రిగోజిన్ తిరుగుబాటుకు కారణమని కొంతమంది విశ్లేషకుల అంచనా. బఖ్‌ముట్‌లో వాగ్నర్ గ్రూపు సభ్యులు చాలామంది ప్రాణాలు కోల్పోయారు. ఇది కాస్తా వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి ఉండవచ్చు. నెపం రష్యా రక్షణ మంత్రిత్వ శాఖపై నెట్టేందుకు ప్రయత్నించడం మంచి వ్యూహం. రష్యా రక్షణ మంత్రి సెర్గి షోయిగూ, చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ జనరల్ వాలెరీ గెరాసిమోవ్‌లపై కూడా ప్రిగోజిన్ అసంతృప్తితో ఉన్నారు. రష్యా దళాల్లో వాగ్నర్ గ్రూపును ఏకం చేయడంలో వీరు కీలకపాత్ర పోషించారు. వాగ్నర్ గ్రూపు సైనికులు రక్షణ మంత్రిత్వ శాఖతో కాంట్రాక్టులు కుదుర్చుకోవాలని పట్టుపట్టింది కూడా ఈ ఇద్దరే. ఈ కాంట్రాక్టులే కుదిరితే వాగ్నర్ గ్రూపు కేవలం ఆఫ్రికా కార్యకలాపాలకు పరిమితం కావాల్సి వచ్చేది. అయితే ప్రిగోజిన్ మిలిటరీ స్థావరమైన రొస్తోవ్‌ను చేజిక్కించుకునే విషయంలో దాదాపు విజయం సాధించాడు. ఆ వెంటనే తన తిరుగుబాటును బహిరంగం చేసేశాడు. అంటే, ఉక్రెయిన్ యుద్ధం విషయంలో రష్యా పరిస్థితిలో ఏదో తేడా ఉందన్నమాట. ఇందుకు తగ్గట్టుగానే రష్యా రక్షణ మంత్రిత్వ శాఖలో సమూల ప్రక్షాళన జరగాలని కోరుతున్న వారూ కొందరు ఉండటం గమనార్హం.

రష్యా భద్రతా సంస్థ 'ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్' (ఎఫ్ఎస్‌బీ అంటారు. కేజీబీ వారసత్వం) ప్రిగోజిన్ వైపు కొంత మొగ్గు చూపుతున్నట్లు కొన్ని కథనాలు ఉన్నాయి. ఈ లెక్కన చూస్తే రక్షణ మంత్రిత్వ శాఖ ఉన్నత వర్గాల్లో మార్పులను ఎఫ్ఎస్‌బీ కూడా కాంక్షిస్తూండవచ్చు. తద్వారా అటు మంత్రిత్వ శాఖ, ఇటు ఎఫ్ఎస్‌బీ రెండూ సమన్వయంతో పనిచేసే అవకాశం ఏర్పడుతుంది.

## యుద్ధం... ఇకపై ఎలా?

వాగ్నర్ గ్రూపు నాయకత్వం ప్రధానంగా సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంది. రష్యాను నియంత్రించేంత సత్తా అనుమానమే. కాకపోతే కొన్ని అంశాల్లో కీలకమైన ప్రభావం చూపగలదు. ఇందుకు తగ్గట్టుగానే తిరుగుబాటు సందర్భంగా వాగ్నర్ ప్రకటనలు వారి సత్తాకు మించి ఉన్నట్లు స్పష్టమైంది. పైగా ఈ తిరుగుబాటు వారి శక్తిని కాకుండా నిస్పృహను ప్రదర్శించినట్లు అయ్యింది.

ఈ దశ నుంచి ఉక్రెయిన్‌పై యుద్ధం ఎలా సాగబోతోందనడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకూ ప్రిగోజిన్ రక్షణ మంత్రిత్వ శాఖను బహిరంగంగానే విమర్శిస్తే ఇతరులు నిశ్శబ్దంగా తమ అసంతృప్తిని వెళ్లగక్కి ఉంటారు. యుద్ధం సాఫీగా కొనసాగితే భవిష్యత్తులో ఇలా బహిరంగ కీచులాటలైతే ఉండవు.

వచ్చే ఏడాది మార్చిలో రష్యా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ లోపుగానే ఉక్రెయిన్ పై పైచేయి సాధించడం పుతిన్‌కు చాలా అవసరం. ఇప్పటికే యుద్ధంలో పదహారు మంది జనరళ్లు మరణించారు లేదా పదవుల నుంచి తప్పించబడ్డారు. జనరళ్ల స్థాయిలో ఈ స్థాయి వేట్లు ఒక రికార్డనే చెప్పాలి. తాజాగా రక్షణ మంత్రి, చీఫ్ ఆఫ్ ద జనరల్ స్టాఫ్‌లపై వేటు వేస్తారా? అదే జరిగితే తిరుగుబాటుదారుల లక్ష్యం నెరవేరినట్లు అవుతుంది.

ఇప్పుడు ఉక్రెయిన్ యుద్ధాన్ని మరింత నిశితంగా పరిశీలించాల్సిన పరిస్థితి రష్యాకు ఏర్పడింది. వాగ్నర్ ఉదంతం నుంచి పాఠాలు కూడా నేర్చుకోవాలి. ఇలాంటి ప్రత్యేక దళాలు రష్యా సాధించిన విజయాల్లో కొన్నింటికి కారణమైతే కావచ్చు కానీ, అంతిమంగా ఇవి అధికార వ్యవస్థను బలహీన పరిచేవే. కాబట్టి వీటిపై మరింత కఠినమైన నియంత్రణ అవసరమవుతుంది. రానున్న కొన్ని నెలల్లో రష్యా సైనిక దళం పుతిన్ రాజకీయ ఆకాంక్షలకు తగ్గట్టుగా మెరుగైన ప్రదర్శన కనపరచగలదా అన్నది కూడా ఒక ప్రశ్న. ఉన్నతస్థాయిలో మార్పులు చేస్తే వ్యూహాలు, పద్ధతులకు మార్పులు, చేర్పులు అనివార్యమవుతాయి. ఎఫ్ఎస్‌బీ, రక్షణ మంత్రిత్వ శాఖలు సమన్వయంతో పని చేయడం ఇప్పుడు పుతిన్‌కు అవసరం. వాగ్నర్ గ్రూపు సైనికుల్లో అధికులు ఇప్పటికీ రక్షణ శాఖతో ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశ ముంది. ఎంతైనా ఇవి ఠంచనుగా డబ్బులు తీసుకుంటూ పనిచేసే కిరాయి సైన్యాలే కదా? కానీ వీరు సాధారణ సైనికుల మాదిరిగా క్రమశిక్షణతో వ్యవహరించగలరా?

ఆఫ్రికా దేశాల్లో రష్యా ప్రయోజనాలు కాపాడే ప్రాజెక్టులతో అటు రక్షణ శాఖకూ, ఇటు వాగ్నర్ గ్రూపునకూ ఆర్థిక దన్ను ఇచ్చే సామర్థ్యం ప్రిగోజిన్‌కు ఉంది. అయితే రక్షణ శాఖ ఈ నిధులను దుర్వినియోగం చేస్తోందన్నది ప్రిగోజిన్ ఆరోపణ. ఇప్పుడు ప్రిగోజిన్ బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటున్నారు. వాగ్నర్ గ్రూపు మానవ నష్టాన్ని చవిచూసింది. మిగిలిన వాళ్ల సమర్థంగా పని చేయాలంటే ఏం చేయాలన్నది ఆసక్తికరంగా మారింది. ఏమైనప్పటికీ రానున్న ఎనిమిది నెలల్లో వాగ్నర్ గ్రూపు తన వారిని, రష్యా సైనికుల కార్యాచరణకు అనుగుణంగా పనిచేసేలా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఉక్రెయిన్ కూడా తన ప్రతిదాడులను కొనసాగిస్తూనే ఉంది. రష్యా దీటుగానే తట్టుకుంటోంది కూడా. కానీ ప్రిగోజిన్ సృష్టించిన ప్రకంపనలు కాస్తా రష్యా వ్యవస్థలోని లోటుపాట్లను ఎత్తి చూపినట్లు అయ్యింది.

వ్యాసకర్త మాజీ రాయబారి

('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### నాయకుడికి గౌరవం



పీవీ నరసింహారావుజీ జయంతి సందర్భంగా ఆయన్ని స్మరించుకుంటున్నాను. ఆయన దీర్ఘదృష్టి గల నాయకత్వం, భారత అభివృద్ధి పట్ల నిబద్ధత ఎన్నదగినవి. దేశ ప్రగతిలో ఆయన వెలకట్టలేని తోడ్పాటును మనం గౌరవించుకుందాం.

– నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి

### అది సాధారణమే



భారతీయుల్లో 71 శాతం మంది మాంసం తింటారు. మాంసం తినడాన్ని భయం, పశ్చాత్తాపం లాంటి భావనలతో ముడిపెట్టడమంటే, మాంసాహారులు ఆటవికులు అని సూచిస్తున్నట్టు. భారత మూలవాసులను అణచడానికి అదే దీర్ఘకాలిక ఆయుధం అయింది.

– అద్వైద్, చరిత్రకారుడు

### ఇంత సింపులా?



నిన్న ఒకరిని కలవడానికి వెళ్లాను. నా ఫోన్ డేటా సరిగ్గా పనిచేయకపోవడంతో వాళ్ల వైఫై కోసం ప్రయత్నించాను. దానికి పాస్‌వర్డ్ ఉంది. సరే ఏదో ఒకటి చూద్దామని 12345678 కొట్టాను. కనెక్ట్ అయింది.

– అరుణ్ బోత్రా, పోలీస్ అధికారి

### అర్థం కావొద్దా?



హిందీ సినిమాల్లోకి నెమ్మదిగా జొరబడుతున్న పంజాబీ పాటలకు సబ్‌టైటిల్స్ వేయడం బాలీవుడ్ ఎందుకు మొదలుపెట్టదు? భారతదేశవ్యాప్తంగా అందరికీ పంజాబీ అర్థం అవుతుందని వాళ్లు ఎందుకు అనుకుంటున్నారు? – పునీరీ మెల్‌బోర్న్‌కర్, పరిశోధకురాలు

### వాడుకో!



దేవుడు లేని చైనా... హిందువులకు విగ్రహాలు, ముస్లింలకు జపమాలలు తయారుచేస్తోంది. డబ్బు సంపాదించడంలో చైనా ఎంతైనా తెలివైనది.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

# ఆదర్శమూర్తికి జోహార్లు!

రాజ్యసభ మాజీ సభ్యులు, భారత చైనా మిత్రమండలి జాతీయ నాయకులు సోలిపేట రామ చంద్రారెడ్డి మరణం పట్ల ఓపీడీఆర్ తీవ్ర సంతాపాన్ని తెలియ చేస్తున్నది. అధికార రాజకీయాలలో ఉంటూ కూడా అత్యున్నతమైన రాజకీయ, మానవీయ విలువలకు కట్టుబడి ఆదర్శవంతమైన జీవితం గడిపిన నాయకుడు సోలిపేట.

జీవితాంతం ప్రజాస్వామ్య విలువల కోసం తపించి పాటుపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ విఫలమయ్యిందనీ, అది వెర్రితలలు వేస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి హానికరంగా మారిందనీ భావించి గత పదిహేను సంవత్సరాలుగా అధికార పార్టీల రాజకీయాలకు దూరమయ్యారు. అదే సమయంలో ప్రజా విప్లవ రాజకీయాలకు సన్నిహితంగా వచ్చి ప్రజలతో మమేకమయ్యారు. ఈ దేశంలో ప్రజాస్వామ్యం కుర్చీ కొట్లాటలకూ, ఓట్ల రాజకీయాలకూ పరిమితమైపోయిందనీ, నిజమైన ప్రజా రాజ్యం నెలకొనలేదనీ భావించేవారు. ప్రజలకు, ముఖ్యంగా బడుగు బలహీన పేద వర్గాల ప్రజలకు కుల మతాల కతీతంగా అన్ని ప్రజాతంత్ర హక్కులు అమలు కావాలని పోరాడారు. దేశంలో పెరిగిపోతున్న మతాధిక్య రాజకీయాలను నిరసించారు. పోడు రైతులకు గిరిజన, గిరిజనేతరులన్న భేదం లేకుండా... సాగుపై ఆధారపడి బతుకుతున్న వారందరికీ ఆ భూమిపై యాజమాన్య హక్కు, పట్టాలు లభించాలని గొంతెత్తి నినదించారు.



సోలిపేట రామ చంద్రారెడ్డి

ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) కార్యక్రమాలతో కలిసి నడిచారు. సంస్థ నిర్వహించిన కొన్ని నిజ నిర్ధారణ కమిటీలకు సారథ్యం వహించారు. సంస్థ మసీదుపురంలో జరిపిన రాష్ట్ర మహా సభల నుండి 2023లో హుస్నాబాదులో జరిగిన 'గ్రామీణ పేదల సంఘం' మహా సభల వరకు పాల్గొని ఉత్తేజకరమైన సందేశాలు ఇచ్చిన నేత. వయసును, అనారోగ్యాన్ని లెక్కచేయకుండా యువకులకు స్ఫూర్తి నిచ్చిన తేజో మూర్తి.

సోషలిజం, కమ్యూనిజం పట్ల విద్యార్థి జీవితంలోనే ఆకర్షితులై చివరివరకు ఆ దీప్తిని నిలబెట్టుకున్న నాయకుడాయన. పేద ప్రజల సంఘాల నాయకులకు, సభ్యులకు ఆత్మీయంగా అండదండలు అందించిన ఈ జనప్రియ నేతకు మా విప్లవ జోహార్లు. వారి ఆశయాలను సఫలం చేయటానికి ప్రతిన పూనుదాం.

– డా॥ జతిన్ కుమార్, ఉపాధ్యక్షులు; డి. విజయేందర్, ప్రధాన కార్యదర్శి; ఓపీడీఆర్, తెలంగాణ

(జూన్ 27న సోలిపేట రామచంద్రారెడ్డి తుది శ్వాస విడిచారు)

సారాంశం

సరికొండ చలపతి

# నేలమ్మకు వెల పెరుగుతోందట..

ముందుగా శంకరమంచి సత్యం గారి అమరావతి కథల్లో ఓ గొప్ప కథ ఇది... అమాయక రైతు కథ..

సిద్ధయ్యకు పొలంలో ఒక మెరుస్తున్న రాయి దొరుకుతుంది. అది గమనించిన ఒక రత్నాల వ్యాపారి ముత్యాలు 'ఎంతకిస్తావ్.. కొంటా' – అని సిద్ధయ్యను అడిగితే, సిద్ధయ్యకు దాని విలువ తెలియక రాయికి బదులుగా పొగాకు తీసుకొని సంబరపడతాడు.

సిద్ధయ్య దగ్గర ముత్యాలు కొన్నది మామూలు రాయి కాదు, వజ్రం. ఈ వార్త ఆ నోటా ఈ నోటా పాకి ఆ ఊరి పెద్దమనిషి దాకా వెళ్తుంది. అంతటి విలువైనది నా దగ్గర లేకపోవడం ఏంటి అని ముత్యాలు దగ్గర పది లక్షలు పెట్టి కొనుక్కుని, అది ముత్యాలుకు ఎలా వచ్చిందో మరో పది లక్షలు ఇచ్చి తెలుసుకుంటాడు. వెంటనే ఆ పెద్దమనిషి సిద్ధయ్య పొలానికి వెళ్లి ఆయన అర ఎకరం పొలంలో ఉన్న విలువైన రాళ్లు తీసుకొని, ఆ పొలం బదులుగా పదెకరాల మాన్యం, బండెడు పొగాకు సిద్ధయ్యకి ఇస్తాడు.

అమాయక సిద్ధయ్యకు అంతులేని ఆనందం, వీళ్లేంటి పిచ్చోళ్లలాగా రాళ్ల కోసం ఇలా ఆరాటపడుతున్నారు అని నవ్వుకుంటూ జీవితాంతం చుట్టలు కాల్చుకుంటూ, ఆ పదెకరాల పొలం పండించుకుంటూ ఉన్నదాంట్లో నలుగురికి తిండి పెడుతూ హాయిగా బతికేసి, తృప్తిగా వెళ్లిపోతాడు.

**అచ్చంగా రైతు ఇలాగే ఉంటాడు. స్వచ్ఛమైన, అమాయకమైన రైతును చూపే కథ ఇది.. సిరి – శాంతి.**

......

తెలంగాణలో పొలం ధరలు బాగా పెరుగుతున్నాయి.. అని తరచూ మన సీఎం చెబుతుంటారు. మనకూ ఇంపుగానే వినిపిస్తుంది. మన ఆర్థికాభివృద్ధికి ఇది సూచనా, లేక పల్లెలకు, పొలాలకు పారుతున్న రియల్‌ఎస్టేట్ ధోరణికి అద్దమా అన్న చర్చ పక్కన పెట్టినా.. **ఇది వ్యవసాయానికి, రైతుకు ఉపయోగపడే ధోరణేనా అన్న కోణంలో చర్చ జరగాల్సిందే.**



...........

ఇది చూడండి..తెలంగాణలోనే ఓ ఊరు. ఐదారేళ్ల క్రితం ఆ ఊరు రైతు తనకు ఉన్న ఎకరా పొలాన్ని పిల్లాడి చదువు కోసం 50 వేల రూపాయలకు అమ్ముకున్నాడు. అప్పటికి అదే మంచి రేటు. అదృష్టవశాత్తు కొడుకు చదువు పూర్తయ్యింది. హైదరాబాద్‌లో కొలువులో కుదురుకున్నాడు. కాసిన్ని డబ్బులు కూడగట్టుకున్నాడు. పొలంపై ఆశ చావక ఇప్పుడు మళ్లీ తన ఊరిలోనే ఓ అర ఎకరమైనా కొందామని ప్రయత్నిస్తే.. నేల అందని ఆకాశమైంది. ఇప్పుడక్కడ ఎకరం అక్షరాలా 5 లక్షలు. ఇప్పుడా రైతు హైదరాబాద్‌లో అడ్డామీద కూలీ. **ఈయనే కాదు. ఎవరైనా నేల మీద ప్రేమ , వ్యవసాయం మీద అనురక్తి ఉన్న రైతు తన ఊరిలోనే మరో ఎకరం కొని వ్యవసాయం చేసే పరిస్థితి ఉందా..?**

పెరిగిన భూముల ధర రైతుకు మేలు చేస్తోందా.. కీడు చేస్తోందా?. – ఆలోచించాల్సిన విషయం.

.........

తండ్రీ కొడుకులు ఓ పొలం గట్టున నిలబడి ఉన్నారు. కొడుకు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ జాబ్ చేసి బాగానే వెనకేస్తున్నాడు. అమెరికా వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు. తండ్రి సర్కారు టీచర్‌గా పనిచేసి వరంగల్‌లో ఉంటున్నాడు. ఆయన పుట్టిన ఊరులోనే కొడుకు ఐదెకరాలు కొని చుట్టూ కంచె వేస్తున్నాడు. ఆ సందర్భంలోనే ఈ సంభాషణ.

'మనం వ్యవసాయం చేయలేం. నాకు ఓపిక లేదు. నీకు టైం లేదు. కొని ఏం చేస్తావ్.' – తండ్రి అడిగాడు.

'వ్యవసాయం ఎందుకు చేయడం.. భూమి ధర ఇంకా బాగా పెరిగితే అమ్ముకుందాం. మరో చోట పెట్టుబడి పెడదాం... అంతే..' – కొడుకు సమాధానం, '..అంటే.. షేర్ మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్‌లాగా అన్నమాట..', దానికి కొడుకు నవ్వి 'అవును..' అన్నాడు.

**ఇప్పుడా వూరిలో, పచ్చని వరి స్థానంలో అక్కడక్కడా తెల్లని కడీలు, కంచెలు కనిపిస్తాయి**

ఈ పరిస్థితి వ్యవసాయానికి ఎంతవరకు ఉపయోగం..? – ఆలోచించాల్సిన సందర్భం.

సాగు భూములు కొనే వారు వ్యవసాయమే చెయ్యాలి అనే నిబంధనలు కొన్ని యూరప్ దేశాల్లో కనిపిస్తాయి. అన్నం పెట్టే పంట పొలం అంగడి సరుకవుతున్న వేళ మనమూ కూడా పరిశీలించాల్సిన అంశమే ఇది.

.................

– పిల్లల పెళ్లిళ్లు, చదువులు లాంటి రైతు ఆర్థిక అవసరాలు.. సాగునుంచి ఎక్కువ ఆదాయం రాని పరిస్థితిని ఆసరాగా తీసుకుని.. పెరుగుతున్న ధరలను ఆశగా చూపి.. సాగు భూమికి రైతును దూరం చేసే దిశగా ఈ ట్రెండ్ వెళ్లడం లేదా?

– రైతులను కూలీలుగా, వాచ్‌మన్‌లుగా, కౌలుదారులుగా మార్చడం లేదా...?

– పెరుగుతున్న భూముల ధరలు రైతుకో, సాగుకో ఉపయోగపడాలి కదా, అదే జరుగుతున్నదా?

'భూముల ధరలు పెరుగుతున్నాయి.. ఇక్కడ కొని అక్కడ మరింత కొనుక్కోవచ్చు ..' అని ఆనందపడే ప్రతి సందర్భంలో మనం వేసుకోవాల్సిన ప్రశ్నలివే.

## ఇతర దేశాల్లో భూములిలా..

ఎంతో అభివృద్ధి చెందిన, భారీ తలసరి ఆదాయం కలిగిన జర్మనీ, స్పెయిన్, ఫ్రాన్స్ వంటి చోట్ల కూడా భూముల ధరలు అతి తక్కువగా ఉండటం గమనార్హం.

– కొందరి చేతుల్లోకే భూములు వెళ్లకుండా నియంత్రణలు, కచ్చితంగా వ్యవసాయం చేస్తామనే హామీ ఇస్తేనే రిజిస్ట్రేషన్లు, పన్ను మినహాయింపులు వంటివి రైతులకు భూముల ధరలు అందుబాటులో ఉండేందుకు కారణమవుతున్నాయి.

– యూరప్ ఖండంలోనే అత్యంత అభివృద్ధి చెందిన జర్మనీలో వ్యవసాయ భూమి ధర సగటున ఎకరానికి రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల మధ్యే ఉండటం గమనార్హం. చిత్రమేంటంటే.. ఆ దేశంలో స్థానికులుగానీ, విదేశీయులుగానీ పెద్దగా ఎలాంటి నియంత్రణలు లేకుండానే భూములు కొనడం, అమ్మడం చేయవచ్చు. వ్యవసాయం చేస్తే భూములపై పన్నులు కూడా చాలా తక్కువ.

– అయితే కొన్ని ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ నిబంధనలు అమల్లో ఉంటాయి. అక్కడ వ్యవసాయ భూములు కొనుగోలు చేసేవారు.. వాటిలో 20 ఏళ్లపాటు వ్యవసాయమే చేయాలి. రియల్ ఎస్టేట్, ఇతర అవసరాలకు వినియోగించడానికి వీల్లేదు. దీనితో భూముల ధరలు నియంత్రణలో ఉంటాయి.

– నెదర్లాండ్స్‌లో వ్యవసాయ భూమి ధర సగటున ఎకరానికి రూ.22 లక్షల వరకు ఉంటుంది. ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనడం, అమ్మడం చేయవచ్చు. సదరు భూమిలో కనీసం పదేళ్లపాటు వ్యవసాయం చేస్తామని రాతపూర్వకంగా హామీ ఇస్తే.. కొనుగోలుపై పన్ను మినహాయింపు కూడా ఉంటుంది.

– అభివృద్ధి చెందిన దేశాల్లో కీలకమైన స్పెయిన్‌లో ఎకరం వ్యవసాయ భూమి ధర కాస్త అటూ ఇటూగా రూ.6 లక్షలే. ఆ దేశ ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు.. కొత్తగా భూములు కొన్నవారికి ఎనిమిదేళ్లపాటు వివిధ రకాలుగా సాయం చేస్తుంది. 50 శాతం సబ్సిడీతో పంటల బీమా అమలు చేస్తోంది.

– ఫ్రాన్స్‌లో అయితే ఎకరం వ్యవసాయ భూమి ధర సగటున రెండు, మూడు లక్షల రూపాయలే. కానీ ఇక్కడ 'సేఫర్' పేరిట ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఏజెన్సీ పర్యవేక్షణలోనే భూముల కొనుగోళ్లు, అమ్మకాల లావాదేవీలన్నీ జరుగుతాయి. గంపగుత్తగా కొనుగోళ్లు, కొందరి చేతుల్లోకే భూములన్నీ వెళ్లిపోకుండా.. అధికారులు చర్యలు తీసుకుంటారు. దీనితో భూములకు డిమాండ్ తక్కువ. వ్యవసాయం చేయాలనుకునేవారు తక్కువ ధరకే కొనుగోలు చేసుకోవచ్చు.

– దక్షిణాఫ్రికాలో ఎకరం ధర కొంచెం అటూఇటూగా లక్ష రూపాయలే. కొందరి చేతుల్లోనే ఎక్కువ భూములు ఉండకుండా నియంత్రణలు అమల్లో ఉన్నాయి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లపై పన్నులు ఉండవు.

– కామెరూన్‌లో ఎకరం వ్యవసాయ భూమి రూ.25 వేలు మాత్రమే. కానీ అక్కడ భూములపై పూర్తిగా ప్రభుత్వ నియంత్రణ ఉంటుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.10.34 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** స్వాతి ప.1.12 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** సా.6.48 నుండి 8.25 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.53 నుండి 10.44 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** తె.4.30 నుండి 6.07 వరకు (తెల్లవారితే శుక్రవారం), తొలి ఏకాదశి (శయన ఏకాదశి); **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.34.

## ఉప సర్పంచ్ కిడ్నాప్.. ప్రజాకోర్టులో హతం

- మరో గ్రామస్తుడిని హతమార్చిన మావోయిస్టులు
- ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో ఘటన

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా బుర్కపాల్ పంచాయతీ ఉపసర్పంచ్ మడివి గంగతో పాటు మరో 14 మంది గ్రామస్తులను మావోయిస్టులు పదిహేను రోజుల క్రితం కిడ్నాప్ చేశారు. బుధవారం ప్రజాకోర్టు నిర్వహించి గంగతో పాటు గ్రామస్తుడు కవ్వాసి సుక్కను హతమార్చారు. ఉపసర్పంచ్, గ్రామస్తులను కిడ్నాప్ చేసిన నాటి నుంచి స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అందరినీ సురక్షితంగా విడుదల చేయించేందుకు మాజీ మావోయిస్టులు, ప్రజా సంఘాల ప్రతినిధులు యత్నించారు. మరోపక్క పోలీసులు కూడా అప్రమత్తమై వారిని విడిపించేందుకు ప్రయత్నాలు చేశారు. ఉపసర్పంచ్‌తో పాటు గ్రామస్తులకు ఎలాంటి హాని తలపెట్టకుండా విడుదల చేయాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మావోయిస్టులకు విజ్ఞప్తి చేసింది. ఇంతలోనే బుధవారం దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రజాకోర్టు నిర్వహించిన మావోయిస్టులు... పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటూ గంగతో పాటు సుక్కను హతమార్చారు.

## రెక్కీ నిర్వహించేందుకు వచ్చి చిక్కిన మావోయిస్టులు

- ఐదుగురు మిలీషియా సభ్యుల అరెస్టు

ఏటూరునాగారం: పోలీసులను చంపేందుకు రెక్కీ నిర్వహించడానికి వచ్చిన ఐదుగురు మావోయిస్టు మిలీషియా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ములుగు జిల్లా మంగపేట మండలం కోమటిపల్లి వద్ద ఈ ఘటన జరిగింది. అరెస్టు చేసిన ఐదుగురిని పోలీసులు ఏటూరునాగారం సర్కిల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సీఐ మండల రాజు మీడియాకు వివరాలను వెల్లడించారు. మంగపేట పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఐదుగురు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసు బృందం అప్రమత్తమై వారిని పట్టుకుని విచారించగా.. మావోయిస్టు మిలీషియా సభ్యులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూరు బ్లాక్ పాలంపల్లి గ్రామానికి చెందిన మాడవి బీమా, కల్మ జోగా, కల్మ మాస, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లికి చెందిన మడప సతీష్, ఇదే మండలానికి చెందిన ఎట్టి చలపతిగా తెలిసింది. మాడవి బీమా, కల్మ జోగ, కల్మ మాసలకు మావోయిస్టు కీలక నేతలు.. పేలుడు పదార్థాలు కార్డెక్స్‌వైరు, డిటోనేటర్లు, ఎలక్ట్రిక్‌వైర్లు, బ్యాటరీలు, ప్రెజర్ కుక్కర్‌లను ఇచ్చి వాటిని పోలీసుల కదలికలు ఎక్కువగా ఉన్న ఏరియాలో అమర్చాలని ఆదేశించారు. ఈ ముగ్గురు స్థానికులు కాకపోవడంతో మండలానికి చెందిన మడప సతీష్, ఎట్టి చలపతిలు సహకరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ఐదుగురు వాహనాలపై వచ్చి రెక్కీ నిర్వహిస్తుండగా.. పోలీసులకు పట్టుబడినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి పేలుడు పదార్థాలు, రెండు ద్విచక్రవాహనాలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారిని పట్టుకున్న మంగపేట ఎస్సై తాహెర్‌బాబు, మరో ఎస్సై రవికుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.



# బియ్యం ఇవ్వలేం!

**కర్ణాటక, తమిళనాడుకు బియ్యం పంపడంపై రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ స్పష్టీకరణ!**

- రాష్ట్ర మిల్లర్లను నమ్ముకుంటే ఇబ్బందులు తప్పవని భావించిన కమిషనర్
- గోదాముల్లో ఉన్న బియ్యం, మిల్లర్లు బకాయి ఉన్న బియ్యం సేకరించాలన్న చైర్మన్
- సాధ్యం కాదన్న అనిల్‌కుమార్..సీఎంతో భేటీలోనూ స్పష్టీకరణ
- ఎఫ్‌సీఐతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకోనున్న ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ రాష్ట్రం ఎదిగిందని ఓవైపు పాలకులు చెబుతుంటే.. మరోవైపు పక్క రాష్ట్రాలు తమ అవసరార్థం కొనుగోలు చేస్తామన్న బియ్యం కూడా అందించలేక అధికార యంత్రాంగం సతమతమవుతోంది. కర్ణాటకలో ఎన్నికల హామీ అయిన 'అన్న భాగ్య పథకం 'కింద రేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికి అదనంగా 5 కిలోలు ఇచ్చేందుకు ఆ రాష్ట్రంలో బియ్యం అందుబాటులో లేవు. అలాగే తమిళనాడుకు కూడా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా ఇచ్చేందుకు బియ్యం అవసరమయ్యాయి. దీంతో ఈ రెండు రాష్ట్రాల పౌరసరఫరాల సంస్థలూ తెలంగాణను సంప్రదించాయి. దీంతో పౌరసరఫరాల సంస్థ గోడౌన్‌లలో మూలుగుతున్న బియ్యం నిల్వలను, మిల్లులు బకాయి పడిన లక్షల టన్నుల బియ్యాన్ని సేకరించి ఈ రెండు రాష్ట్రాలకు పంపించాలని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్.. సంస్థ ఎండీ, కమిషనర్ అనిల్‌కుమార్‌కు సూచించారు. అయితే బియ్యం పంపడం సాధ్యం కాదంటూ కమిషనర్ చేతులెత్తేసినట్లు సమాచారం. ఇటీవల సీఎం కేసీఆర్ నిర్వహించిన పౌరసరఫరాల సంస్థ సమీక్ష సమావేశంలోనూ ఆయన ఈ విషయం స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో మంత్రులు గంగుల, హరీశ్‌రావు, సీఎస్ సమావేశమై దీనిపై చర్చించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిసింది.

**33 లక్షల మెట్రిక్ టన్నులు కావాలన్న రెండు రాష్ట్రాలు:** కర్ణాటకకు నెలకు 2.18 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీల) బియ్యం అవసరం ఉందంటూ ఆ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల సంస్థ ఎండీ ఈ నెల 3న అనిల్‌కుమార్‌కు లేఖ రాశారు. ఈ లెక్కన సంవత్సరానికి 27 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం. అలాగే తమిళనాడు నుంచి కూడా ఈ నెల 23న ఒక లేఖ అందింది. రాష్ట్ర పీడీఎస్ అవసరాల కోసం 4 ఎల్‌ఎంటీల బాయిల్డ్ రైస్, 2 ఎల్‌ఎంటీల ముడి బియ్యం అవసరం అని ఆ రాష్ట్రం కోరింది.

**రాష్ట్ర మిల్లర్ల నిర్వాకంతోనే వెనకడుగు?**

తెలంగాణలో ఏటా సగటున కోటిన్నర మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లింగ్‌కు వస్తోంది. ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే వచ్చే 67 శాతం బియ్యం లెక్కన ఏటా సుమారు కోటి మెట్రిక్ టన్నుల బియ్యం వస్తుంది. ఇందులో ఎఫ్‌సీఐకి 50 ఎల్‌ఎంటీ అప్పగించినా, మరో 50 ఎల్‌ఎంటీ వరకు స్టేట్ పూల్ కింద రాష్ట్రం వద్దనే ఉంటుంది. అయితే మిల్లర్లు నాణ్యమైన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోవడం, రోజుకు కనీసం 8 నుంచి 10 వేల మెట్రిక్ టన్నుల మేర కూడా ఎఫ్‌సీఐకి అప్పగించకపోవడం వంటి కారణాలతో ఒక సీజన్ ధాన్యం సీఎంఆర్‌గా ఎఫ్‌సీఐ గోడౌన్‌లకు చేరుకునేందుకు 18 నెలల వరకు పడుతోంది. ఈ పరిస్థితుల్లో మిల్లర్ల మీద నమ్మకంతో పక్క రాష్ట్రాలకు విక్రయించే ఒప్పందాలు చేసుకుంటే ఇబ్బందులు తప్పవని కమిషనర్ భావిస్తున్నట్లు సమాచారం. మిల్లర్లు 2021–22 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 4.5 ఎల్‌ఎంటీ బియ్యం ఇవ్వాల్సి ఉంది. 2019–20, 21 బాపతు బియ్యం 1.25 ఎల్‌ఎంటీలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బియ్యాన్ని 25 శాతం అదనపు జరిమానాతో వసూలు చేసినా, అది పౌరసరఫరాల సంస్థ ద్వారా పీడీఎస్‌కు తరలుతుంది. ఈ నేపథ్యంలో ఎఫ్‌సీఐకి ఇచ్చే బియ్యంలో కోత పెట్టడం ద్వారా ఇతర రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు అవకాశాలున్నాయని కొందరు అధికారులు చెబుతున్నారు. అలాగే మిల్లర్లపై ఒత్తిడి పెంచి ఏ సీజన్ బియ్యం ఆ సీజన్‌లో మిల్లింగ్ చేయిస్తే పక్క రాష్ట్రాలకు విక్రయించడం కష్టం కాదని ఓ రిటైర్డ్ అధికారి వ్యాఖ్యానించారు.

### బియ్యానికి బదులు డబ్బులు

**అన్న భాగ్య పథకంపై కర్ణాటక నిర్ణయం**

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒకటైన అన్న భాగ్య పథకం అమలుకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ పథకం ప్రకారం దారిద్ర్య రేఖకి దిగువన ఉన్న కుటుంబాలకు అయిదు కేజీలు అదనంగా బియ్యం ఇవ్వాల్సి ఉంది.జూలై 1 నుంచి ఈ పథకం అమలు చేయాల్సి ఉండగా బియ్యం సేకరణలో ఇబ్బందులు తలెత్తడంతో బియ్యానికి బదులుగా డబ్బులు ఇవ్వాలని నిర్ణయించింది. బుధవారం జరిగిన కర్ణాటక రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కేజీ బియ్యానికి రూ.34 చొప్పున 5 కేజీలకయ్యే ధర మొత్తం వారి ఖాతాల్లో వేయనున్నారు. ఈ విషయాన్ని కర్ణాటక ఆహార, పౌర సరఫరా శాఖ మంత్రి కె.హెచ్. మునియప్ప విలేకరులకు వెల్లడించారు."రాష్ట్ర అవసరాలకు సరిపడా బియ్యాన్ని ఇవ్వడానికి ఏ సంస్థ ముందుకు రాలేదు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రకారం కేజీ బియ్యం ధర రూ.34. అవసరమైన బియ్యం ప్రభుత్వం సేకరించే వరకు అర్హులైన లబ్ధిదారులందరికీ బియ్యానికి బదులుగా డబ్బులు ఇస్తాం" అని వివరించారు. ఒక కార్డులో ఒకే వ్యక్తి ఉంటే రూ.170, ఇద్దరు ఉంటే రూ.340, ఒకవేళ అయిదుగురు సభ్యులుంటే వారి ఖాతాలో రూ.850 వేస్తామని మంత్రి వివరించారు.

## పెట్టుబడిదారులకు మిల్లింగ్‌లో విస్తృత అవకాశాలు

- మంత్రి గంగుల వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెరిగిన ధాన్యం దిగుబడికి అనుగుణంగా మిల్లింగ్ పరిశ్రమలో విస్తృత అవకాశాలున్నాయని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ చెప్పారు. ఇందులోభాగంగానే ప్రభుత్వమే సొంతంగా రైస్ మిల్లులను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారన్నారు. మంత్రి బుధవారం పౌరసరఫరాల కమిషనర్ అనిల్‌కుమార్, ఎస్‌పీపీజెడ్ అధికారులు, జపాన్ సటాకె కార్పొరేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఏటా మూడు కోట్ల టన్నులకు పైగా ఉత్పత్తవుతున్న ధాన్యాన్ని మిల్లింగ్ చేయడానికి రాష్ట్రంలో చాలా అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అందుకే రూ.రెండువేల కోట్లతో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మిల్లులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మిల్లింగ్ పరిశ్రమలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ధాన్యం మిల్లింగ్‌తో పాటు ఉప ఉత్పత్తులైన రైస్ బ్రాన్ ఆయిల్, నూక తదితరాలు ప్రాసెసింగ్ చేసేందుకు ప్రత్యేక జోన్‌లను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం సటాకే, సైలో తదితర ప్రపంచస్థాయి కంపెనీల ప్రతినిధులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సటాకె కార్పొరేషన్, ఇతర కంపెనీల ప్రతినిధులు తమ కంపెనీల సాంకేతికతను మంత్రికి వివరించారు, గంటకు 20 నుంచి 1,200 టన్నుల మిల్లింగ్ కెపాసిటీ తమ సొంతమని వారు చెప్పారు. దీనిపై త్వరలోనే పూర్తిస్థాయి నివేదికను ముఖ్యమంత్రికి సమర్పిస్తామని గంగుల తెలిపారు. ప్రభుత్వం మిల్లులను ఏర్పాటు చేయడంతోపాటు స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లలో ప్రత్యేకంగా రూ.100కోట్లకు పైగా పెట్టుబడి పెట్టినవారికి ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. కాగా, పౌరసరఫరాల శాఖలో ప్రజలకు సేవల్ని మరింత కచ్చితంగా, పారదర్శకంగా అందించేందుకు టెక్నాలజీ సంబంధిత అంశాలపై గంగుల ప్రత్యేకంగా సమీక్షించారు, రైతుల వద్ద ధాన్యం కొనుగోలు మొదలు బియ్యం పంపిణీ వరకు వివిధ దశల్లో వృధా లేకుండా సాంకేతికతను అప్‌గ్రేడేషన్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు టెక్నాలజీ అప్‌గ్రేడేషన్, నెట్‌వర్కింగ్, శాటిలైట్ టెక్నాలజీలో పనిచేస్తున్న మలోల ఇన్నోవేషన్స్, సీఎస్ఎం, ఐబీఐ, ప్లానెట్ ఎం తదితర సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

## 'సీతమ్మ సాగర్'ను సందర్శించిన ఎన్‌జీటీ కమిటీ



అమ్మగారిపల్లిలో సమావేశమైన కమిటీ సభ్యులు

అశ్వాపురం(కొత్తగూడెం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో ప్రభుత్వం నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ బ్యారేజ్ పనులను జాతీయ హరిత ట్రిబ్యునల్ ద్విసభ్య కమిటీ బుధవారం సందర్శించింది. పర్యావరణ అనుమతి లేకుండా పనులు చేపడుతున్నారంటూ దుమ్ముగూడెం మండలానికి చెందిన నిర్వాసితులు తెల్లం నరేశ్, లక్ష్మీనారాయణ ఎన్‌జీటీకి ఫిర్యాదు చేశారు. దీంతో పనులు నిలిపివేయాలని ఎన్‌జీటీ మార్చి 23న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఆదేశాలను ధిక్కరించి పనులు కొనసాగిస్తున్నారని పిటిషనర్లు ఫొటోలు, వీడియోల ఆధారాలతో మరోసారి ఫిర్యాదు చేశారు. ఎన్‌జీటీ ఆగ్రహం వ్యక్తం చేయడంతో జలవనరుల శాఖ అధికారులు పనులు తాత్కాలికంగా నిలిపేశారు. కాగా, పనుల పరిశీలనకు ట్రిబ్యునల్ ఇద్దరు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో కమిటీ సభ్యులు పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ప్రాంతీయ సంచాలకుడు కె.తరుణ్, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డు సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామంలో ఎల్‌అండ్‌టీ సంస్థ కార్యాలయంలో పిటిషనర్లు, జలవనరుల శాఖ అధికారులతో చర్చించారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ...తాము పరిశీలించిన అంశాలు, పిటిషనర్లు, అధికారులు చెప్పిన వివరాలపై ఎన్‌జీటీకి నివేదిక అందజేస్తామని తెలిపారు. వారి వెంట జలవనరుల శాఖ సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వరరెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి, పిటిషనర్ తెల్లం నరేశ్ ఉన్నారు.

## కాల్చిన కొడవలితో దాడి

- భార్యపై భర్త హత్యాయత్నం
- ఆస్పత్రికి తరలింపు, పరిస్థితి విషమం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కొడవలితో భార్యపై భర్త హత్యాయత్నం చేసిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం జరిగింది. కాల్చిన కొడవలితో దాడి చేయడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఒగ్గు నిర్మల(35), మల్లేశ్ దంపతుల మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. హమాలీ పనిచేసే మల్లేశ్.. వచ్చిన డబ్బులతో మద్యం తాగి రోజూ భార్యను కొడుతున్నాడు. బుధవారం ఉదయం బయటకు వెళ్లి ఇంటికొచ్చిన మల్లేశ్.. కొడవలిని కాల్చి పెట్టుకున్నాడు. పిల్లలు పాఠశాలకు వెళ్లగా నిర్మల ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇదే అదనుగా భావించిన మల్లేశ్ కాల్చిన కొడవలితో నిర్మల మెడ వెనుక భాగంలో పొడిచాడు. ఆమె కేకలు వేయడంతో ఇరుగుపొరుగు రావడం చూసి మల్లేశ్ పరారయ్యాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స చేసి కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. కొడవలిని కాల్చడంతో శరీరం లోపలి భాగాలకు తీవ్ర గాయాలు అయ్యి ఉండొచ్చని వైద్యులు అనుమానిస్తున్నారు. కొడవలిని మెడ నుంచి తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. పరిస్థితి విషమంగానే ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. మల్లేశ్.. పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

### పీవీకి ఘన నివాళి



దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని పీవీ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులతో కలసి నివాళులర్పిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రావణ్‌కుమార్

## విద్యా నైపుణ్యాలు పెంపొందించేందుకు 'టీచ్ ఫర్ చేంజ్' : మంచు లక్ష్మీప్రసన్న



సమావేశంలో మాట్లాడుతున్న మంచు లక్ష్మి. పక్కన కలెక్టర్ క్రాంతి

గద్వాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు 'టీచ్ ఫర్ చేంజ్'సంస్థను ప్రారంభించినట్టు సంస్థ వ్యవస్థాపకురాలు, సినీనటి మంచు లక్ష్మీ ప్రసన్న వెల్లడించారు. ఇందుకోసం జిల్లాలో 30 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి చేయూత అందిస్తామని తెలిపారు. ఆమె బుధవారం కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిశారు. అనంతరం జిల్లాలో 'టీచ్ ఫర్ చేంజ్'కార్యక్రమాల నిర్వహణపై విద్యాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంచు లక్ష్మి మాట్లాడుతూ సరికొత్త బోధన విధానంతో పాటు సులువుగా ఆంగ్లం నేర్చుకునేలా విషయ నిపుణుల ద్వారా రూపొందించిన బోధన పద్ధతులను అందిస్తామని తెలిపారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఆంగ్ల బోధన ఉంటుందని చెప్పారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ 'టీచ్ ఫర్ చేంజ్' సంస్థ జిల్లాలో 30 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసుకుని చేయూతనిచ్చేందుకు ముందుకు రావటం సంతోషకరమన్నారు.

## అత్యాధునికంగా పోలీసు భవనాలు: కోలేటి

సాక్షి, హైదరాబాద్: నాణ్యతలో ఏ విధమైన రాజీ లేకుండా అత్యాధునిక సౌకర్యాలతో పోలీసు భవనాలను కార్పొరేట్ కార్యాలయాలుగా నిర్మిస్తున్నామని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ తెలిపారు. తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలో రూ.704.50 కోట్ల వ్యయంతో జిల్లా పోలీస్ కార్యాలయాలు, పోలీస్ కమిషనరేట్లు, పోలీస్ స్టేషన్ల భవనాలు, ఇతర నిర్మాణాలను చేపట్టామన్నారు. ఆయన బుధవారం హైదరాబాద్‌లో కార్పొరేషన్ ఎండీ రాజీవ్ రతన్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 90 పోలీస్ స్టేషన్లలో ఫ్రంట్ ఆఫీస్ నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక డిజైన్లతో పోలీస్ స్టేషన్లను నిర్మించామని దామోదర్ చెప్పారు.

## సీఎం దృష్టికి ఇళ్ల స్థలాల అంశం

- డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి మంత్రి హరీశ్ హామీ



సాక్షి, హైదరాబాద్: పాత్రికేయుల ఇళ్ల స్థలాల కేటాయింపు అంశాన్ని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు హామీ ఇచ్చారు. పాత్రికేయుల ఇళ్ల స్థలాల మంజూరు కోసం బుధవారం కోఠిలోని వైద్య, ఆరోగ్య కమిషనరేట్ కార్యాలయంలో డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) అధ్యక్షుడు బొల్లోజు రవి, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ బృందం మంత్రి హరీశ్‌రావును కలిసింది. ఖమ్మం జిల్లాతో పాటు వివిధ జిల్లాల్లో పాత్రికేయుల స్థలాల కోసం ప్రభుత్వం భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాత్రికేయుల ఇళ్ల స్థలాల విషయమై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న పాత్రికేయులకు ఇళ్ల స్థలాల మంజూరు అంశాన్ని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో డీజేహెచ్ఎస్ కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు రామకృష్ణ, జి.ప్రతాప్‌రెడ్డి, ప్రతినిధులు కె.విక్రమ్‌రెడ్డి, గౌటే దేవేందర్, ప్రతిభాదేవి, సురేశ్ బాబు, ప్రియకుమార్, భుజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దివంగత మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి

సాక్షి, హైదరాబాద్/ రాంగోపాల్‌పేట్: మాజీ ప్రధాని, దివంగత పీవీ నరసింహారావు 102వ జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. నెక్లెస్‌రోడ్డులోని పీవీ ఘాట్‌లో మంత్రులు మహమూద్ అలీ, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, శంకర్ నాయక్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, టీఎస్ఐడీసీ చైర్మన్ ఎస్.వేణుగోపాలచారి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, నాయకులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, చింతల రామచంద్రారెడ్డి, లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ, బీజేపీ రాష్ట్ర నాయకులు పీవీ కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. కాగా, బసవతారకం కేన్సర్ ఆస్పత్రి చౌరస్తాలో ఉన్న పీవీ విగ్రహానికి ఆయన తనయురాలు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**అసెంబ్లీలో...**

పీవీ జయంతి వేడుకలను అసెంబ్లీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, అసెంబ్లీ చీఫ్ విన య్‌భాస్కర్, పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ వాణీదేవి, ఎమ్మెల్సీ రమణ కలిసి నివాళులర్పించారు.

**పీవీకి భారతరత్న ఇవ్వాలి: మంత్రి తలసాని**

తెలంగాణలోని మారుమూల ప్రాంతంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి ప్రధాని స్థాయికి చేరుకున్న పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వాలని మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు.



పీవీకి నివాళులు అర్పిస్తున్న మంత్రి తలసాని

**ఎన్నికలప్పుడే కేసీఆర్‌కు మహనీయులు గుర్తుకొస్తారు: బండి**

ఎన్నికల సమయాల్లో మాత్రమే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మహనీయులు గుర్తుకు వస్తారని ఆ తర్వాత వారిని పట్టించుకోరని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. పీవీకి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పీవీ నరసింహారావు జయంతి పేరుతో కేసీఆర్ హడావిడి చేసి బ్రాహ్మణుల ఓట్లు చీల్చేందుకు యత్నించారని అన్నారు.



నివాళులు అర్పిస్తున్న బండి సంజయ్

ఎన్నికల తర్వాత పీవీకి నివాళులు అర్పించే సమయం కూడా దొరకడం లేదంటే కేసీఆర్ మోసాన్ని బ్రాహ్మణ సమాజం గుర్తుంచుకోవాలన్నారు.

**గాంధీభవన్‌లో పీవీకి నివాళి**

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా కాంగ్రెస్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, టి.కుమార్‌రావు, మహేశ్‌కుమార్‌గౌడ్, అనిల్‌కుమార్ యాదవ్, వినోద్‌కుమార్, కల్వ సుజాత, ఎస్.పి. క్రాంతికుమార్ తదితరులు నివాళులర్పించారు.

### దార్శనికుడు పీవీ: కేసీఆర్

దేశాన్ని క్లిష్ట సమయంలో కాపాడిన తెలంగాణ ముద్దుబిడ్డ, పీవీ నర్సింహారావు అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కొనియాడారు. నాడు పీవీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలాలే నేడు దేశ ప్రజల అనుభవంలోకి వచ్చాయని స్పష్టం చేశారు. పూర్వ భారత ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతి సందర్భంగా బుధవారం ఆయన సేవలను స్మరించుకున్నారు. స్థితప్రజ్ఞతతో భారతదేశాన్ని ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిపేందుకు పునాది వేసిన దార్శనికుడు, తనదైన శైలిలో రాజనీతిని, పాలనా దక్షతను ప్రదర్శిస్తూ.. దేశానికి మౌనంగా మేలు చేసిన భారత ప్రధాని పీవీ నర్సింహారావు అని కేసీఆర్ ప్రస్తుతించారు.

## క్లుప్తంగా...

### ఎస్సీ కొలీజియంలో ఇద్దరు కొత్త న్యాయమూర్తులు


జస్టిస్‌ గవాయ్‌


జస్టిస్‌ సూర్యకాంత్‌

న్యూఢిల్లీ: సుప్రీం కోర్టు కొలీజియంలో మార్పులు చోటు చేసుకున్నాయి. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ డివై చంద్రచూడ్‌ ఆధ్వర్యంలో అయిదుగురు న్యాయమూర్తులుండే కొలీజియంలో కొత్తగా జస్టిస్‌ బి.ఆర్‌. గవాయ్‌, జస్టిస్‌ సూర్యకాంత్‌ సభ్యులుగా వచ్చి చేరారు. సుప్రీం కోర్టు వేసవి కాలం సెలవుల సమయంలో కొలీజియంలో సభ్యులుగా ఉన్న జస్టిస్‌ కె.ఎం. జోసెఫ్‌, జస్టిస్‌ అజయ్‌ రస్తోగి పదవీ విరమణ చేశారు. జూన్‌ 16, 17 తేదీల్లో ఇరువురు న్యాయమూర్తులు వరుసగా రిటైర్‌ కావడంతో కొత్త సభ్యుల్ని చేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. కొలీజియంలో మార్పులు చేర్పులు చేసిన తర్వాత ప్రధాన న్యాయమూర్తితో పాటు జస్టిస్‌ సంజయ్‌ కిషన్‌ కౌల్‌, జస్టిస్‌ సంజీవ్‌ ఖన్నా, జస్టిస్‌ బిఆర్‌ గవాయ్‌, జస్టిస్‌ సూర్యకాంత్‌ ఉన్నారు.

### ఉక్రెయిన్‌ రెస్టారెంట్‌పై రష్యా క్షిపణి దాడి

**11 మంది మృతి**

కీవ్‌: తూర్పు ఉక్రెయిన్‌లో పాపులర్‌ పిజ్జా రెస్టారెంట్‌పై రష్యా జరిపిన క్షిపణి దాడిలో 11 మంది మరణించారు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఈ దాడిలో మరో 61 మందికి గాయాలయ్యాయి. ఇటీవల కాలంలో ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన దాడుల్లో ఇదే పెద్దది. అయితే ఈ క్షిపణి రెస్టారెంట్‌ వైపు వెళ్లేలా ప్రయోగించడానికి ఉక్రెయిన్‌కు చెందిన ఒక వ్యక్తి రష్యా మిలటరీకి సాయం చేశాడన్న ఆరోపణలపై ఉక్రెయిన్‌ అధికారులు ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నారు. రష్యాలో ప్రైవేటు సైన్యం వాగ్నర్‌ సంస్థ చీఫ్‌ ప్రిగోజిన్‌ తిరుగుబాటు తర్వాత రాజకీయంగా, మిలటరీ పరంగా అంతర్గత సంక్షోభం ఉన్నప్పటికీ ఆ దేశం ఉక్రెయిన్‌పై ఇంకా దాడులు కొనసాగిస్తూనే ఉంది.

### పీవీకి ప్రధాని నివాళి

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ప్రధాని నరేంద్ర మోదీ నివాళి అర్పించారు. '' పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన్ను స్మరించుకుంటున్నాను. దూరదృష్టి కలిగిన ఆయన నాయకత్వం, దేశ అభివృద్ధి పట్ల ప్రదర్శించిన నిబద్ధత ప్రశంసనీయం. దేశ ప్రగతికి పీవీ అందించిన అమూల్యమైన తోడ్పాటు గౌరవించుకొంటున్నాం'' అని ప్రధాని మోదీ బుధవారం ట్వీట్‌ చేశారు.

# విభిన్నం, వినూత్నం.. చంద్రయాన్‌-3

చంద్రయాన్‌-2 వైఫల్యం నుంచి పాఠాలు నేర్చుకున్న 'ఇస్రో' సైంటిస్టులు

- తాజా ప్రయోగంలో పలు కీలక మార్పులు
- జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్‌ భద్రంగా దిగడానికి తగిన ఏర్పాట్లు
- ప్రయోగం సఫలమైతే భారత అంతరిక్ష పరిశోధనల్లో కీలక మలుపు



చల్లని వెన్నెలను ఇచ్చే చందమామను మనం చూసేది కేవలం ఒకవైపే. కంటికి కనిపించని అవతలి భాగంలో ఏముందో తెలుసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొన్ని దేశాలు కొంతవరకు విజయం సాధించాయి. అంతరిక్ష నౌకలను క్షేమంగా పంపించాయి. చంద్రుడి ఉపరితలంపై ఆయా అంతరిక్ష నౌకలు కాలుమోపాయి. ఈ జాబితాలో చేరాలని భారత్‌ సైతం ఉవ్విళ్లూరుతోంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్‌-3 ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. వచ్చే నెలలో జరిగే ఈ ప్రయోగం కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సైంటిస్టులు తుది ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. చంద్రుడిపైకి రోవర్‌ను పంపించి, అక్కడి వాతావరణ, భౌగోళిక పరిస్థితులను తెలుసుకోవడ మే ఈ మిషన్‌ లక్ష్యం. చంద్రయాన్‌-3 స్పేస్‌క్రాఫ్ట్‌ను జీఎస్‌ఎల్‌వీ-ఎంకే-3 రాకెట్‌ ద్వారా చందమామపైకి పంపించనున్నారు. చంద్రయాన్‌-3 మిషన్‌ను కచ్చితంగా సఫలం చేయాలని, చంద్రుడిపై ప్రయో గాల్లో మనదైన ముద్ర వేయాలని ఇస్రో సైంటిస్టులు అహోరాత్రులూ శ్రమిస్తున్నారు. భవిష్యత్తులో మనుషులను చంద్రుడిపైకి పంపించడానికి ఈ ప్రయోగం కీలకం అవుతుందనడంలో సందేహం లేదు.

**మీకు గుర్తుందా?** చంద్రయాన్‌-2 ప్రయోగం దేశ ప్రజలకు చేదు జ్ఞాపకాలను మిగిల్చింది. విక్రమ్‌ ల్యాండర్‌, ప్రజ్ఞాన్‌ రోవర్‌, ఆర్బిటార్‌తో వెళ్లిన చంద్రయాన్‌-2 స్పేస్‌క్రాఫ్ట్‌ చంద్రుడి ఉపరితలంపై క్షేమంగా దిగలేకపోయింది. సాంకేతిక లోపం తలెత్తడంతో 2019 సెప్టెంబర్‌ 6న క్రాష్‌ ల్యాండ్‌ అయ్యింది. ప్రయోగం విఫలం కావడంతో అప్పటి ఇస్రో చైర్మన్‌ కె.శివన్‌ ప్రధాని మోదీ సమక్షంలో కన్నీరు పెట్టుకున్నారు. దేశ ప్రజలంతా సానుభూతి ప్రదర్శించారు. చంద్రయాన్‌-2తో పోలిస్తే చంద్రయాన్‌-3 ప్రయోగం చాలా విభిన్నంగా, వినూత్నంగా ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. రెండింటి మధ్య ఎన్నో వ్యత్యాసాలు ఉన్నాయని అంటున్నారు.

### జూలై 13న చంద్రయాన్‌-3 ప్రయోగం!

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్‌-3 ప్రయోగానికి రంగం సిద్ధమైంది. జూలై 13న మధ్యాహ్నం 2.30 గంటలకు ఆంధ్ర ప్రదేశ్‌ రాష్ట్రం నెల్లూరు జిల్లా శ్రీహరికోట లోని సతీష్‌ ధావన్‌ స్పేస్‌ సెంటర్‌(షార్‌) నుంచి ఈ ప్రయోగం ప్రారంభించనున్నట్లు సీనియర్‌ శాస్త్రవేత్త ఒకరు బుధవారం చెప్పా రు. అయితే, ప్రయోగ తేదీని ఇంకా ఖరారు చేయలేదని ఇస్రో చైర్మన్‌ ఎస్‌.సోమనాథ్‌ అన్నారు. జూలై12 నుంచి 19వ తేదీల మధ్య ఏదో ఒక రోజు ప్రయోగం చేపట్టే అవకాశముందని వివరించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.615 కోట్లు కేటాయించింది. చంద్రయాన్‌-1 ప్రయోగం 2008 అక్టోబర్‌22న, చంద్రయాన్‌-2 ప్రయోగం 2019 జూలై 22న ప్రయోగం నిర్వహించారు. చంద్రయాన్‌-1 విజయవంతమైంది. జాబిల్లి ఉపరితలంపై నీడ జాడ లను గుర్తించింది. చంద్రుడి చుట్టూ తిరుగుతూ 312 రోజులపాటు సేవలందించింది.

### అవేమిటో తెలుసుకుందాం...

- చంద్రయాన్‌-2లో జీఎస్‌ఎల్‌వీ ఎంకే-3 రాకెట్‌ ఉపయోగించారు. చంద్రయాన్‌-3 లోనూ ఇలాంటి రాకెట్‌ను వాడుతున్నారు. చంద్రయాన్‌-2 రాకెట్‌లో ల్యాండర్‌, రోవర్‌, ఆర్బిటార్‌ ఉన్నాయి. మూడో ప్రయోగంలో ల్యాండర్‌, రోవర్‌ మాత్రమే ఉంటాయి. చంద్రయాన్‌-2లో భాగంగా ప్రయోగించిన ఆర్బిటార్‌ను ఈ తాజా ప్రయోగంలోనూ ఉపయోగించుకుంటారు. ఈ ఆర్బిటార్‌ ప్రస్తుతం చంద్రుడి కక్ష్యలో క్షేమంగా ఉంది. సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికి, ఉపరితలంపై మ్యాపింగ్‌ కోసం ఆర్బిటార్‌ను వాడుకుంటారు.
- చంద్రయాన్‌-2 వైఫల్యం నుంచి సైంటిస్టులు పాఠాలు నేర్చుకున్నారు. అందుకే చంద్రయాన్‌-3లో కొన్ని మార్పులు చేశారు.



- ఆర్బిటార్‌, మిషన్‌ కంట్రోల్‌ సెంటర్‌తో సమన్వయం చేసుకుంటూ పనిచేసే ల్యాండర్‌ హజార్డ్‌ డిటెక్షన్‌ అండ్‌ అవాయిడెన్స్‌ కెమెరా చంద్రయాన్‌-2లో కేవలం ఒక్కటే ఉంది. చంద్రయాన్‌-3లో ఇలాంటివి రెండు కెమెరాలు అమర్చుతున్నారు. చంద్రుడిపై ల్యాండర్‌ భద్రంగా దిగడానికి ఇవి ఉపకరిస్తాయి.
- చంద్రయాన్‌-2లో 9 కీలక పరికరాలు ఉన్నాయి. ఇవి చంద్రుడి కక్ష్యలో ఇంకా చక్కగా పనిచేస్తూనే ఉన్నాయి. చంద్రయాన్‌-3 ప్రొపల్షన్‌ మాడ్యూల్‌లో కేవలం స్పెక్ట్రో-పోలారీమెట్రీ ఆఫ్‌ హ్యాబిటబుల్‌ ప్లానెట్‌ ఎర్త్‌(ఎస్‌హెచ్‌పీఈ) అనే పేలోడ్‌ కూడా ఉంటుంది. ఇతర గ్రహాలపై మానవ నివాస యోగ్యమైన ప్రదేశాల అన్వేషణకు అవసరమైన సమాచారాన్ని ఈ పరికరం అందజేస్తుంది.
- చంద్రయాన్‌-3లో ల్యాండర్‌తోపాటు లేజర్‌ రెట్రోరిఫ్లెక్టర్‌ అరే(ఎల్‌ఆర్‌ఏ)ను సైతం పంపించబోతున్నారు. జాబిల్లిపై పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఇది తోడ్పడుతుంది. తాజా ప్రయోగం విజయవంతం కావడం ఖాయమని సైంటిస్టులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అంతా అనుకున్నట్లు జరిగితే ఈ ప్రయోగం భారత అంతరిక్ష పరిశోధనల్లో ఒక కీలకమైన మైలురాయి కానుంది.

**- సాక్షి, నేషనల్‌ డెస్క్‌**

## అమెరికా హెచ్‌1బీ వీసాతో కెనడాలో ఉద్యోగం



టొరంటో: అమెరికాలో హెచ్‌1బీ వీసా వినియోగదారులు ఇక కెనడాలో కూడా ఉద్యోగాలు చేసుకోవచ్చు. ఈ మేరకు కెనడా ప్రభుత్వం బంపర్‌ ఆఫర్‌ ప్రకటించింది. మొత్తం 10 వేల మంది ఉద్యోగాలు చేయడం కోసం ఓపెన్‌ వర్క్‌ పర్మిట్‌కు ఏర్పాట్లు చేస్తోంది. దీంతో అమెరికాలో భారతీయ టెక్కీలకు కూడా లబ్ధి చేకూరుతుంది. అమెరికాలో దిగ్గజ కంపెనీలు ఉద్యోగాల్లో కోత విధిస్తూ ఉండడంతో దానిని తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాల్లో కెనడా ఉంది. అమెరికాలో ఉద్యోగాలు కోల్పోయిన నిపుణులైన టెక్కీలను ఆకర్షించి సాంకేతిక రంగంలో ప్రపంచంలో అగ్రగామిగా ఎదగాలని చూస్తోంది. ''అమెరికాలో హెచ్‌1బీ వీసా కలిగి ఉన్న వారు 10 వేల మంది వరకు జూలై 16లోగా కెనడాకు రావడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక్కడే ఉద్యోగాలు చేయొచ్చు. వారి కుటుంబ సభ్యులు చదువుకోవడం , పని చేయడానికి కూడా అనుమతులిస్తాం'' అని కెనడా వలసలు, పౌరసత్వ సేవల మంత్రి సియాన్‌ ఫ్రాజర్‌ చెప్పారు. తాము ఎన్నో లక్ష్యాలను ఏర్పాటు చేసుకున్నామని, దానికి తగ్గట్టుగానే ఇమ్మిగ్రేషన్‌ టెక్‌ టాలెంట్‌ స్ట్రాటజీని అనుసరిస్తున్నట్టుగా చెప్పారు. సాంకేతికంగా వైవిధ్యభరితమైన పురోగతి సాధించి టెక్‌ జెయింట్‌గా ఎదగాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం కింద హెచ్‌1బీ వీసా వినియోగదారులకు మూడేళ్ల పాటు ఓపెన్‌ వర్క్‌ పర్మిట్‌ లభిస్తుంది. వారి జీవిత భాగస్వామి ఉద్యోగం లేదా చదువుకోవడం వంటివి చేయొచ్చు. అమెరికాలో భారత్‌, చైనాకు చెందిన వేలాది మంది టెక్కీలను టెక్‌ కంపెనీలు ప్రతీ ఏటా ఉద్యోగాల్లోకి తీసుకుంటాయి. ప్రస్తుతం అమెరికా మార్కెట్‌ సరిగా లేకపోవడంతో లేఆఫ్‌లు ఎక్కువగా ఉన్నాయి. గత ఏడాది నవంబర్‌ నుంచి దాదాపుగా 2 లక్షల మంది టెక్కీలు అమెరికాలో ఉద్యోగాలు కోల్పోయారు. ఇప్పుడు అలాంటి వారందరికీ కెనడాలో మంచి అవకాశాలు దొరికే చాన్స్‌ వచ్చింది.

## ఉమ్మడి పౌర స్మృతిపై 8.5 లక్షల ప్రతిస్పందనలు

**లా కమిషన్‌ చైర్మన్‌ జస్టిస్‌ రితూ రాజ్‌ అవస్థీ**

న్యూఢిల్లీ: ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ)పై ఇప్పటి దాకా ప్రజల నుంచి 8.5 లక్షల ప్రతిస్పందనలు తమకు అందాయని లా కమిషన్‌ చైర్మన్‌ జస్టిస్‌ రితూ రాజ్‌ అవస్థీ బుధవారం చెప్పారు. యూసీసీపై అభిప్రాయాలు తెలియజేయాలని రెండు వారాల క్రితం లా కమిషన్‌ కోరిన సంగతి తెలిసిందే. యూసీసీపై రాజకీయ పక్షాలు, మత సంస్థలు, ప్రజల నుంచి రకరకాల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలోకి వస్తే యూసీసీని అమలు చేస్తామని బీజేపీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. ఒక దేశంలో రెండు రకాల చట్టాలు ఉండడం సమంజసం కాదని తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఉమ్మడి పౌర స్మృతికి ఆమ్‌ ఆద్మీ పార్టీ(ఆప్‌) మద్దతు పలికింది. అయితే, ఏకాభిప్రాయంతోనే యూసీసీని అమలు చేయాలని సూచించింది.

**యూసీసీకి మతం రంగు పులమొద్దు: రాజ్‌నాథ్‌ సింగ్‌**

జోద్‌పూర్‌: దేశంలో ఉమ్మడిపౌర స్మృతి(యూసీసీ) అమలు గురించి కేంద్ర ప్రభుత్వం మాట్లాడినప్పుడల్లా ప్రతిపక్షాలు మతం కోణాన్ని తెరపైకి తీసుకొస్తున్నాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌ ఆరోపించారు. సమాజాన్ని చీల్చే రాజకీయాలు చేయొద్దని విపక్షాలకు హితవు పలికారు. యూసీసీకి మతం రంగు పులమొద్దని సూచించారు. రాజ్యాంగం ప్రకారమే ముందుకెళ్తున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఆయన బుధవారం రాజస్తాన్‌లో ఓ కార్యక్రమంలో ప్రసంగించారు. మహిళల గౌరవాన్ని కాపాడే విషయంలో మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో, అంకితభావంతో పని చేస్తోందన్నారు.

## జూలై మూడోవారం నుంచి పార్లమెంటు సమావేశాలు!



న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై మూడో వారంలో ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. పాత పార్లమెంటు భవనంలో సమావేశాలు మొదలై మధ్యలో నూతన పార్లమెంటుకు మారుతాయని విశ్వసనీయవర్గాల సమాచారం. నూతన పార్లమెంటు భవనాన్ని ప్రధాని నరేంద్ర మోదీ మే 28న ప్రారంభించిన విషయం తెలిసిందే. నెలరోజుల పాటు జరిగే వర్షాకాల సమావేశాల్లో దాదాపు 20 సిట్టింగ్‌లు ఉంటాయని సమాచారం. స్వాతంత్య్ర దినోత్సవానికి ముందే సమావేశాలు ముగుస్తాయి. ఢిల్లీలో అధికారులపై అజమాయిషీ కేంద్రానికే ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ తెచ్చిన విషయం తెలిసిందే. వర్షాకాల సమావేశాల్లో ఈ ఆర్డినెన్స్‌ స్థానంలో బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి.

# చెరకు ధర క్వింటాల్‌కు రూ.315

**ఎఫ్‌ఆర్‌పీ రూ.10 చొప్పున పెంపు ● కేంద్ర ప్రభుత్వం వెల్లడి**

న్యూఢిల్లీ: చెరకు పంటకు ఫెయిర్‌ అండ్‌ రెమ్యూనరేటివ్‌ ప్రైస్‌(ఎఫ్‌ఆర్‌పీ)ను క్వింటాల్‌కు రూ.10 చొప్పున పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. దీంతో ఈ ఏడాది అక్టోబర్‌ నుంచి ప్రారంభమయ్యే 2023-24 సీజన్‌లో సంవత్సరంలో క్వింటాల్‌ చెరకు ధర రూ.315కు పెరిగింది. చక్కెర మిల్లులు రైతులకు క్వింటాల్‌కు కనీసం రూ.315 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలపై కేంద్ర కేబినెట్‌ సమావేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగింది. ఎఫ్‌ఆర్‌పీని పెంచుతూ ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. 2022-23లో క్వింటాల్‌ చెరకు ఎఫ్‌ఆర్‌పీ రూ.305 ఉండగా, ఈసారి రూ.315 కానుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్‌ ఠాకూర్‌ తెలిపారు. వ్యవసాయం, అన్నదాతల సంక్షేమానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రైతన్నలకు మన ప్రధానమంత్రి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కమిషన్‌ ఫర్‌ అగ్రికల్చర్‌ కాస్ట్స్‌ అండ్‌ ప్రైసెస్‌(సీఏసీపీ) సిఫార్సుల ఆధారంగా చెరకు ఎఫ్‌ఆర్‌పీని ఖరారు చేస్తుంటారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను సైతం పరిగణనలోకి తీసుకుంటారు. 2014-15 సీజన్‌లో చెరకు ఎఫ్‌ఆర్‌పీ క్వింటాల్‌కు రూ.210 ఉండేది. 2013-14లో చక్కెర మిల్లులు రూ.57,104 కోట్ల విలువైన చెరకు పంటను కొనుగోలు చేశాయి. 2022-23లో రూ.1,11,366 కోట్ల విలువైన 3,353 లక్షల టన్నుల చెరకును సేకరించాయి. ఇండియాలో దాదాపు 5 కోట్ల మంది రైతులు చెరకు సాగు చేస్తున్నారు. చక్కెర మిల్లుల్లో దాదాపు 5 లక్షల మంది ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారు.

**నేషనల్‌ రీసెర్చ్‌ ఫౌండేషన్‌ ఏర్పాటు!**

దేశంలో సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ రంగంలో పరిశోధనలకు మరింత ఊతం ఇవ్వడమే లక్ష్యంగా నేషనల్‌ రీసెర్చ్‌ ఫౌండేషన్‌(ఎన్‌ఆర్‌ఎఫ్‌) ఏర్పాటుకు సంబంధించిన బిల్లుపై కేంద్ర మంత్రివర్గం ఆమోదం ముద్రవేసింది. ప్రధాని మోదీ అధ్యక్షత బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్‌ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అనురాగ్‌ ఠాకూర్‌ బుధవారం వెల్లడించారు.



కేబినెట్‌ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రులు మన్‌సుఖ్‌ మాండవీయ, అనురాగ్‌ ఠాకూర్‌

నేషనల్‌ రీసెర్చ్‌ ఫౌండేషన్‌ బిల్లు-2023ను త్వరలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 'సైన్స్‌ అండ్‌ ఇంజనీరింగ్‌ రీసెర్చ్‌ బోర్డు చట్టం-2008' స్థానంలో ఈ బిల్లును తీసుకొన్నట్లు వివరించారు. 2027-28 దాకా పరిశోధనల కోసం రూ.50,000 కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఇందులో రూ.14,000 కోట్లను వచ్చే ఐదేళ్లలో ప్రభుత్వమే ప్రత్యక్షంగా ఖర్చు చేస్తుందన్నారు. మిగతా రూ.36,000 కోట్లను ప్రైవేట్‌ రంగ సంస్థలు, అంతర్జాతీయ పరిశోధక సంస్థల నుంచి సేకరిస్తామన్నారు. ఎన్‌ఆర్‌ఎఫ్‌ పాలక మండలికి ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తారని, ఇందులో 15 నుంచి 25 మంది నిపుణులు, పరిశోధకులు సభ్యులుగా ఉంటారని అనురాగ్‌ ఠాకూర్‌ చెప్పారు. ప్రభుత్వ ముఖ్య శాస్త్రీయ సలహాదారు నేతృత్వంలో కార్యనిర్వాహక మండలి సైతం పని చేస్తుందన్నారు.

### 'పీఎం-ప్రణామ్‌'కు ఆమోదం

ప్రత్యామ్నాయ ఎరువుల వాడకాన్ని పెంచడం, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ఉద్దేశించిన 'పీఎం-ప్రణామ్‌' కొత్త పథకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అలాగే యూరియా సబ్సిడీ పథకాన్ని మరో మూడేళ్లపాటు కొనసాగించాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.3.68 లక్షల కోట్లు ఖర్చు చేయనుంది. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడానికి రూ.1,451 కోట్ల రాయితీ ఇచ్చేందుకు ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన కేబినెట్‌ కమిటీ నిర్ణయం తీసుకుంది. అలాగే దేశంలో సల్ఫర్‌-కోటెడ్‌ యూరియా(యూరియా గోల్డ్‌)ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. నేలలో సల్ఫర్‌ లోపాన్ని సరిచేయడానికి ఈ యూరియా తోడ్పడుతుంది. నేల సారాన్ని కాపాడుకోవడమే 'పీఎం-ప్రణామ్‌' లక్ష్యమని కేంద్రం వెల్లడించింది.

## యూపీలో భీమ్‌ ఆర్మీ అధినేత చంద్రశేఖర్‌ ఆజాద్‌పై కాల్పులు




షహరాన్‌పూర్‌: ప్రముఖ దళిత నాయకుడు, భీమ్‌ ఆర్మీ అధినేత, ఆజాద్‌ సమాజ్‌ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్‌ ఆజాద్‌(36)పై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఆయన గాయపడ్డారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని డాక్టర్లు చెప్పారు. ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రం షహరాన్‌పూర్‌ జిల్లాలోని దేవ్‌బంద్‌ పట్టణంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆజాద్‌పై కాల్పులు జరిగాయని పోలీసులు బుధవారం చెప్పారు. కారులో ఉండగానే గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై తుపాకీతో కాల్పులు జరిపి పారిపోయారని చెప్పారు. చంద్రశేఖర్‌ ఆజాద్‌ కడుపులోకి ఓ తూటా దూసుకెళ్లిందని అన్నారు. దుండగులు ప్రయాణించిన వాహనంపై హరియాణా రిజిస్ట్రేషన్‌ నెంబర్‌ ఉందని వెల్లడించారు. వారిని గుర్తించి, అదుపులోకి తీసుకొనేందుకు ముమ్మరంగా గాలింపు చేపట్టామన్నారు. చంద్రశేఖర్‌ ఆజాద్‌పై కాల్పుల ఘటన పట్ల ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్‌ యాదవ్‌ ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో శాంతి భద్రతలు నానాటికీ క్షీణిస్తున్నాయని, ప్రజలకు రక్షణ లేకుండాపోయిందని విమర్శించారు.

## రైల్వేలో ఖాళీల సంఖ్య 2.74 లక్షలు

**ప్రయాణికుల భద్రతకు సంబంధించి 1.75 లక్షల పోస్టులు ఖాళీ**

న్యూఢిల్లీ: రైల్వేలో 2.74 లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని సమాచార హక్కు చట్టం కింద వెల్లడైంది. ఇందులో ప్రయాణికుల భద్రతకు సంబంధించిన ఖాళీలే 1.75 లక్షల వరకు ఉన్నాయని రైల్వే శాఖ స్పష్టం చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన సామాజిక కార్యకర్త చంద్రశేఖర్‌ గౌర్‌ సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద అడిగిన ప్రశ్నలకు రైల్వే శాఖ వివరంగా సమాధానమిచ్చింది. రైల్వే శాఖలో మొత్తంగా 2,74,580 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిసింది. ఇందులో భద్రత కేటగిరీకి సంబంధించిన ఖాళీలు 1,77,924గా ఉన్నాయి. జూన్‌ 1 తేదీ నాటికి నాన్‌ గెజిటెడ్‌ గ్రూప్‌ సిలో 2,74,580 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు రైల్వే శాఖ చెప్పింది. ఇక రైల్వేల భద్రతకు సంబంధించి 9.82 లక్షల పోస్టులు ఖాళీగా ఉంటే 8.04 లక్షల భర్తీ చేసినట్టు వివరించింది. భద్రత కేటగిరీలో లోకో పైలెట్లు, ట్రాక్‌ తనిఖీలు చేసే వ్యక్తులు, పాయింట్స్‌మెన్‌, ఎలక్ట్రీషియన్లు, ఇంజనీర్లు, సిగ్నల్‌ అసిస్టెంట్లు, ఇంజనీర్లు, ట్రైన్‌ మేనేజర్లు, స్టేషన్‌ మాస్టర్లు, టికెట్‌ కలెక్టర్‌ వంటి పోస్టులు ఉన్నాయి. ఒడిశాలో బాలాసోర్‌ వద్ద ఘోరమైన రైలు ప్రమాదం నేపథ్యంలో ఆర్‌టీఐ కింద పోస్టుల ఖాళీలపై ఆర్‌టీఐ కింద ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## యూసీసీని వ్యతిరేకిస్తాం

**లా కమిషన్‌కు సమర్పించాల్సిన నివేదికపై ముస్లిం లా బోర్డు కసరత్తు**

లక్నో: ఒకే దేశం ఒకే చట్టం ఆవశ్యకతపై ప్రధానమంత్రి మంత్రి నరేంద్ర మోదీ బహిరంగంగానే వ్యాఖ్యానించడంతో ఆల్‌ ఇండియా ముస్లిం పర్సనల్‌ లా బోర్డు మంగళవారం రాత్రికి రాత్రి సమావేశమైంది. ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టుగా స్పష్టం చేసింది. వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా చర్చించిన బోర్డు సభ్యులు యూసీసీకి వ్యతిరేకంగా న్యాయపరమైన పోరాటంపై వ్యూహ రచన చేయనున్నట్టు చెప్పారు. ఈ అంశంలో ఏర్పాటు చేసిన 22వ లా కమిషన్‌కు సమర్పించాల్సిన ముసాయిదా పత్రంపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్టుగా ఏఐఎంపీఎల్‌బీ సభ్యుడు ఖలీద్‌ రషీద్‌ వెల్లడించారు. న్యాయ కమిషన్‌ ఎదుట అభ్యంతరాలను వెల్లడించడానికి చివరి తేదీ జూలై 14 అని, అందుకే దీనిపై విస్తృతంగా చర్చించామన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉండే యూసీసీని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. భారత్‌లో ఎన్నో మతాలు, సంస్కృతులకు ఉన్నాయని ఉమ్మడి పౌరచట్టాన్ని తీసుకువస్తే ముస్లింలతో పాటు హిందువులు, క్రిస్టియన్లు, జైనులు, పార్సీలు, యూదులు ఇలా అందరిపై ప్రభావం చూపిస్తుందన్నారు.

## అమిత్‌ మాలవీయాపై కర్ణాటకలో కేసు నమోదు

బెంగళూరు/న్యూఢిల్లీ: బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్‌ మాలవీయాపై కర్ణాటక పోలీసులు ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేశారు. కర్ణాటక కాంగ్రెస్‌ నేత రమేశ్‌ బాబు ఫిర్యాదు మేరకు మాలవీయాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు బుధవారం వెల్లడించారు. కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌ గాంధీని అభ్యంతరకరంగా చిత్రీకరిస్తూ సోషల్‌ మీడియాలో మాలవీయా ఓ వీడియోను పోస్టు చేశారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రమేశ్‌ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టడం, విద్వేషాలు రగిలించడమే మాలవీయా ఉద్దేశమని ఆరోపించారు. ఇదిలా ఉండగా, తనపై కర్ణాటకలో కేసు నమోదు కావడంపై మాలవీయా ట్విట్టర్‌లో ప్రతిస్పందించారు. విదేశీ శక్తుల చేతుల్లో రాహుల్‌ గాంధీ ఓ పావు అని విమర్శించారు. మాలవీయాపై కేసు పెట్టడాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్‌ నేత స్మృతి ఇరానీ తప్పుపట్టారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు.



అమెరికాలోని నార్త్‌ కరోలినా రాష్ట్రంలోని చార్లొటే విమానాశ్రయంలో డెల్టా ఎయిర్‌వేస్‌కు చెందిన విమానం బుధవారం ముందు చక్రం తెరుచుకోకుండానే అత్యవసరంగా ల్యాండ్‌ అయింది. పైలెట్‌ విమానాన్ని సురక్షితంగా దించడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నారని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

# మరో రఫేల్‌ అవుతుందా?

**అమెరికాతో డ్రోన్ల ఒప్పందంపై కాంగ్రెస్‌ అనుమానాలు**

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో ఇరు దేశాల మధ్య కుదిరిన 31 ఎంక్యూ-9బీ ప్రిడేటర్‌ డ్రోన్ల ఒప్పందంపై కాంగ్రెస్‌ సందేహాలు వ్యక్తం చేసింది. వేలాది కోట్ల రూపాయల ఈ ఒప్పందం పారదర్శకంగా జరగలేదని ఆరోపించింది. కేంద్రం అత్యధిక ధరకి ఈ డ్రోన్లను కొనుగోలు చేస్తోందని కాంగ్రెస్‌ అధికార ప్రతినిధి పవన్‌ ఖేరా బుధవారం విలేకరుల సమావేశంలో అనుమానం వ్యక్తం చేశారు. దేశ భద్రతకు సంబంధించిన ఈ డ్రోన్ల ఒప్పందంలో ఎన్నో అనుమానాలు తలెత్తుతున్నాయని అన్నారు. ''దేశభద్రతను ప్రమాదంలో పడేయడం మోదీ ప్రభుత్వానికి సర్వసాధారణం. రఫేల్‌ ఒప్పందంలో కూడా ఇదే చూశాము. 126 రఫేల్‌ యుద్ధ విమానాలకు బదులుగా మోదీ ప్రభుత్వం 36 మాత్రమే కొనుగోలు చేసింది. సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపుని కూడా హెచ్‌ఏఎల్‌కు నిరాకరించడమూ మనం చూశాం. డిఫెన్స్‌ అక్విజిషన్‌ కమిటీ, త్రివిధ బలగాలు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పికీ ఏకపక్ష నిర్ణయాలు ఎన్నో జరిగాయి. ఇప్పటికీ రఫేల్‌ కుంభకోణంపై ఫ్రాన్స్‌ పరిశీలనలో ఉంది'' అని పవన్‌ ఆరోపించారు. మరో రక్షణ స్కామ్‌లో మనం పడకూడదన్నారు.

**ఎందుకంత ధర?**

అమెరికాలో జనరల్‌ ఆటమిక్స్‌ సంస్థ రీపర్‌ డ్రోన్ల ఒక్కొక్కటి రూ.812 కోట్లకు విక్రయిస్తోందని, భారత్‌ 31 డ్రోన్లకు ఒప్పందం కుదుర్చుకుందని అంటే మొత్తంగా 25,200 కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తుందని పవన్‌ అన్నారు. ఇప్పుడు పెడుతున్న దాంట్లో 10-20 శాతం ఖర్చుతో డీఆర్‌డీఓకి డ్రోన్లను అభివృద్ధి చేసే సామర్థ్యం ఉందన్నారు. మరెందుకు అంత డబ్బు ఖర్చు పెట్టి ఆ డ్రోన్లు కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రశ్నించారు. 2017లో ఈ డ్రోన్లను తొలుత తయారు చేశారని, ఇప్పుడు సాంకేతికత బాగా పెరిగిందని లేటెస్ట్‌ టెక్నాలజీ ఆయుధాలను ఎందుకు కొనుగోలు చేయడం లేదని పవన్‌ నిలదీశారు.

## నిరుపేదలు, మధ్యతరగతిని మర్చిపోయిన కేంద్రం: రాహుల్‌

న్యూఢిల్లీ: నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో కాంగ్రెస్‌ నాయకుడు రాహుల్‌ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. నిరుపేదలు, మధ్యతరగతిని మోదీ సర్కార్‌ మర్చిపోయిందన్నారు. పెట్టుబడిదారుల సంపద పెంచడంలో మునిగిపోయిన కేంద్రం మధ్యతరగతి కుటుంబాలను విస్మరిస్తోందన్నారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మరల్చడానికి బీజేపీ వేసే ఎత్తుల్ని సాగనివ్వమని రాహుల్‌ బుధవారం ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. ''టమాటా కేజీ రూ.140, కాలీఫ్లవర్‌ కేజీ రూ.80, కంది పప్పు కేజీ రూ.148, గ్యాస్‌ సిలిండర్‌ రూ.1100 పై మాటే. ధరలు ఇలా పెంచుకుంటూ పోతూ పెట్టుబడుదారుల ఆస్తుల్ని పెంచుతోంది. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తూ వారి ప్రయోజనాలనే విస్మరిస్తోంది'' అని ట్వీట్‌ చేశారు. దేశంలో నిరుద్యోగ యువత పెరిగిపోతున్నారని అన్నారు.

# సాక్షి హైదరాబాద్

గురువారం । 29 । జూన్ । 2023




**'ఖాకీ' వెనుక ఖాకీలెవరో?**
ఆదాయపు పన్ను శాఖ మాజీ అదనపు కమిషనర్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి శామ్యూల్ ప్రసాద్ ఇంట్లో చోటు చేసుకున్న భారీ చోరీ కేసులో ఓ ఎస్సై పాత్ర రూఢీ అయింది. -8లో



**ఆరోగ్య తెలంగాణ కోసం కృషి**
ఆరోగ్య తెలంగాణ కోసం కృషి చేస్తున్నట్లు మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆపరేషన్ థియేటర్, ట్రాన్స్ జెండర్ క్లినిక్‌ను ప్రారంభించారు. -8లో

**క్రిప్టో ట్రేడింగ్ పేరుతో కుచ్చుటోపీ**



ఆస్ట్రేలియాలోని క్రిప్టో కంపెనీలో ట్రేడింగ్ చేస్తే ఇక్కడ వచ్చే లాభాల కంటే వంద రెట్లు అధికమైన లాభాలు వస్తాయని ఆశతో వేర్వేరు చోట్ల ముగ్గురు నగర వాసులు నిండా మునిగిన ఉదంతం వెలుగుచూసింది. -8లో

## న్యూస్‌రీల్

### బక్రీద్ ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గాలు, మసీదులు

సాక్షి, సిటీబ్యూరో: బక్రీద్ పర్వదినాన్ని గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ప్రత్యేక ప్రార్థనల కోసం రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఈద్గాల్లో ఏర్పాట్లు చేసింది. బుధవారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మహ్మద్ మసీవుల్లా ఖాన్ నేతృత్వంలో ఆయా శాఖల అధికారులతో ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జీహెచ్ఎంసీ సిబ్బంది ఖుర్బానీ వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, మరోవైపు ఖుర్బానీ ఇచ్చే వారు రోడ్లపై వ్యర్థాలు, కళేబరాలు పారబోయ వద్దని ఆదేశించారు. అనంతరం చైర్మన్, సీఈవోతో పాటు అధికారులు మీరాలం, మాదన్నపేట్ ఈద్గాలకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. ఈద్గాలు, మసీదుల కమిటీలు నేటి ఉదయం 6:05 నుంచి 10 గంటల వరకు బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల సమయాన్ని ఖరారు చేశాయి.

### రూ.85 లక్షల విలువైన డైమండ్ రింగ్ మాయం

బంజారాహిల్స్: దంత చికిత్స కోసం వచ్చిన ఓ యువతికి చెందిన రూ.85 లక్షల విలువైన డైమండ్ ఉంగరం మాయమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఓ యువతి మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఎఫ్ఎంఎస్ ఇంటర్నేషనల్ డెంటల్ క్లినిక్‌కు దంత చికిత్స కోసం వచ్చారు. చికిత్స సమయంలో తన వేలికి ఉన్న డైమండ్ రింగ్‌ను పక్కన పెట్టి చికిత్స అనంతరం మర్చిపోయి ఇంటికి వెళ్లిపోయారు. ఇంట్లో కొద్దిసేపటికి తాను ఉంగరం మర్చిపోయాననే విషయం తెలుసుకొని వెంటనే ఆస్పత్రికి వచ్చి వాకబు చేయగా దొరకలేదు. దీంతో బాధితురాలి మామ నరేంద్ర కుమార్ అగర్వాల్ తన కోడలికి చెందిన రూ. 85 లక్షల విలువ చేసే డైమండ్ రింగ్ చోరీకి గురైందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అనుమానితులను విచారణ చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలంలో మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నారు.

### వార్డు కార్యాలయాలను తనిఖీ చేయాలి: మేయర్

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల ప్రారంభించిన వార్డు కార్యాలయాలను రెగ్యులర్‌గా తనిఖీలు చేయాలని మేయర్ విజయలక్ష్మి జోనల్ కమిషనర్లకు సూచించారు. మంత్రి కేటీఆర్ ఆలోచనలకనుగుణంగా ఏర్పాటైన వార్డు కార్యాలయాల ద్వారా ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ యంత్రాంగం వెళ్లాలనేది లక్ష్యమన్నారు. ప్రజలు ఏ వేదిక ద్వారా ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కారమయ్యాక సైతం ర్యాండమ్‌గా ఫోన్లు చేసి పరిష్కారమైనదీ, లేనిదీ కూడా తెలుసుకోవాలని సూచించారు.

### సమ్మిళిత వృద్ధిపై దృష్టి సారిస్తాం

మంత్రి జగదీశ్‌రెడ్డి



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

మాదాపూర్: తెలంగాణ ప్రభుత్వం 90 ఏళ్ల అభివృద్ధిని తొమ్మిదేళ్లలో చేసి చూపించిందని మంత్రి జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ టెక్నాలజీ ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. దేశంలోనే ఏ రాష్ట్రం సాధించలేని విజయాలు తెలంగాణ సాధిస్తోందన్నారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిళిత వృద్ధిపై రాష్ట్రం దృష్టి సారిస్తోందన్నారు. అన్ని రంగాల్లోనూ ఆవిష్కరణలు అవసరమన్నారు. వినూత్న ఆలోచనలు పెంపొందించాలని సూచించారు. ఎక్స్‌పోలో దాదాపు 150కిపైగా స్టాల్స్ అందుబాటులో ఉన్నాయి. ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల అందుబాటులో ఉంటుంది. ప్రవేశం ఉచితం. కార్యక్రమంలో ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రటరీ, విష్ణువర్ధన్‌రెడ్డి, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సి.తారా సత్యవతి, ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య, టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎక్స్‌పోలో నమూనా ప్రదర్శన

## బోనాల ఉత్సవాలకు రూ.250 కోట్లు

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

చార్మినార్: బోనాల జాతర ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్లు ఖర్చు చేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించడానికి ఇప్పటికే తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి బుధవారం సాలార్‌జంగ్ మ్యూజియంలో భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్, నిర్వాహకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేవాలయాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం కింద రూ.15 కోట్లు కేటాయించిందన్నారు. వచ్చే నెల 16, 17 తేదీల్లో జరిగే బోనాల జాతర ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జులై 17న పాతబస్తీలో నిర్వహించే ఘట స్థాపన సామూహిక ఊరేగింపు కోసం భక్తులు వేలాదిగా పాతబస్తీకి తరలి వస్తారని.. అందుకే ఊరేగింపును సకాలంలో ప్రారంభించి ముగించాలని మంత్రి తలసాని ఉత్సవ నిర్వాహకులను సూచించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ నామా సామ్రాట్ అశోక్, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ అబ్దుల్ రెహ్మాన్, టూరిజం మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్, ప్రతినిధులు గాజుల అంజయ్య, రాకేష్ తివారీ, మధుసూదన్ యాదవ్, మధుసూదన్ గౌడ్, హంసరాజ్, బుల్లెట్ శ్రీధర్, గాజుల రాహుల్, మహేష్ పాల్గొన్నారు.

## 18 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం



మేయర్ విజయలక్ష్మి

సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేటు సంస్థ నిర్మాణ, నిర్వహణలతో వివిధ ప్రాంతాల్లో 23 ఫ్రెష్‌రూమ్స్ ఏర్పాటు సహా 18 అంశాలకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించిన మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. బక్రీద్ పర్వదినం సందర్భంగా మసీదులు శుభ్రం చేయడంతోపాటు, రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

**స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందిన వాటిలో ముఖ్యాంశాలు..**

- సనత్‌నగర్ దాసారం బస్తీలో నిర్మించేందుకు గతంలో తీర్మానించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను అక్కడ కాకుండా రామ్‌గోపాల్‌పేటలోని పాన్‌బజార్‌లో జీహెచ్ఎంసీకి చెందిన స్థలంలో నిర్మించేందుకు ఆమోదం. అంచనా వ్యయం రూ. 6 కోట్ల నుంచి రూ. 4.90 కోట్లకు తగ్గింపు.
- వివిధ ప్రాంతాల రోడ్ల విస్తరణ కోసం అవసరమైన ఆస్తుల సేకరణ కోసం ఆమోదం.
- మదీనాగూడ మండలంలోని ఈర్ల చెరువు రీచ్2లో 330 మీటర్లనుంచి 720 మీటర్ల వరకు డ్రైనేజీ మళ్లింపు కోసం రూ. 2.78 కోట్ల అంచనా వ్యయంతో షార్ట్‌టెండర్ పిలిచేందుకు ఆమోదం.
- ఖైరతాబాద్‌లో శిథిలావస్థలోని పాత వార్డు ఆఫీస్ భవనాన్ని కూల్చివేసి కొత్తగా జీ ప్లస్ 4 అంతస్తుల్లో మోడల్ వార్డు ఆఫీస్ భవన నిర్మాణానికి ఆమోదం.
- ఎల్లారెడ్డిగూడలో పీజేఆర్ కమ్యూనిటీ హాల్‌భవనం ఆధునికీకరణ పనులకు ఆమోదం. అంచనా వ్యయం రూ.5.50 కోట్లు.



లోకేశ్ కుమార్

## బల్దియా బాస్ ఎవరో?

**కమిషనర్ లోకేశ్‌కుమార్ బదిలీ**

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కమిషనర్ డీఎస్ లోకేశ్‌కుమార్ అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా వెళ్లనుండటంతో కొత్త కమిషనర్ ఎవరన్నది చర్చనీయాంశంగా మారింది. లోకేశ్‌కుమార్ జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి మూడున్నరేళ్లు దాటింది. మరో రెండు నెలలైతే నాలుగేళ్లు పూర్తయ్యేవి. రాష్ట్ర అసెంబ్లీకి మరో నాలుగైదు నెలల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో బదిలీలు అనివార్యంగా మారాయి. కొత్త కమిషనర్‌గా ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన రావు, ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ శశాంక పేర్లు వినిపిస్తున్నాయి. వీరితో పాటు గతంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా పని చేసిన హరిచందన పేరు కూడా ప్రచారంలో ఉంది. ఏ పేర్లు వినబడినప్పటికీ, అన్నీ ఊహాగానాలే తప్ప నియామకం జరిగేంతదాకా చెప్పలేమని ప్రభుత్వ తీరు తెలిసిన వారు చెబుతున్నారు.

**లోకేశ్ రూటే వేరు..**

జీహెచ్ఎంసీ చరిత్రలోనే అత్యధిక కాలం కమిషనర్‌గా ఉన్న డీఎస్ లోకేశ్‌కుమార్ తన పనేమిటో తాను.. అన్నట్లుగా పనులు చేసుకుంటూ పోయారు. బయట హడావుడి, హంగామా లేకుండా అంతర్గతంగా పనులు చేయించడంలో తనదైన ముద్ర వేశారు. తరచూ ఫోన్ కాన్ఫరెన్స్‌లు, గూగుల్ మీట్ వంటి వాటితో ఎప్పటికప్పుడు పనులు చేయించేవారు. ఖర్చులు విపరీతంగా పెరిగిపోయినా జీహెచ్ఎంసీలో నెలనెలా జీతాలకు ఇబ్బందులెదురైనప్పటికీ, నయానో భయానో ట్యాక్స్ సిబ్బందితో, ఇతరత్రా పన్నుల వసూళ్లు జరిగేలా చూసేవారు. ఎస్సార్‌డీపీతో సహా వివిధ ప్రాజెక్టుల పనులు కుంటుపడకుండా చేయగలిగారు. ఎవరెన్ని విమర్శలు చేసినా, క్షేత్రస్థాయిలో తిరగరనే ఆరోపణలున్నా పట్టించుకునేవారు కాదు. ఎలాంటి హడావుడి లేకుండానే నగరంలో క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశీలించేవారు. ప్రభుత్వం నుంచి, పైఅధికారుల నుంచి అందిన ఆదేశాలకనుగుణంగా పనులు చేసేవారని చెబుతారు. ఎలాంటి సమాచారం, ప్రచారం లేకుండానే నిశ్శబ్దంగా తాను చేయాల్సిన పనులేవో చేసుకుంటూపోయేవారు.

## అహ్మదాబాద్‌కు ఖదీజ

**టోలిచౌకి యువతిని అదుపులోకి తీసుకున్న గుజరాత్ ఏటీఎస్**

- సుమేరా టీమ్‌తో కలిసి సరిహద్దులు దాటడానికి సన్నాహాలు
- ఖురాసన్ వరకు వెళ్లి పోరాటం చేయాలని వీరి పథకం
- ఈమె తండ్రి కూడా గతంలో ఉగ్రవాద సంబంధ కేసులో జైలుకు



ఖదీజ

సాక్షి, సిటీబ్యూరో: గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్న టోలిచౌకికి చెందిన విద్యార్థిని మహ్మద్ ఖదీజను (19) బుధవారం అహ్మదాబాద్ తరలించారు. గోదావరిఖనిలోని శ్రీనగర్ కాలనీలో ఈమెతో పాటు తండ్రి జావీద్‌నీ అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తీసుకువచ్చిన విషయం విదితమే. అహ్మదాబాద్‌లో నమోదైన ఇస్లామిక్ స్టేట్ ఇన్ ఖురాసన్ ప్రావెన్స్ (ఐఎస్‌కేపీ) కేసులో ఖదీజతో పాటు కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన మెడికల్ షాపు యజమానినీ సాక్షులుగా పరిగణించి వాంగ్మూలాలు నమోదు చేశారు. ఖదీజకు ఉగ్రవాద కుట్రలో పాత్ర ఉన్నట్లు తేలడంతో బుధవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఖదీజతో పాటు ఆమె తండ్రినీ విమానంలో అహ్మదాబాద్ తరలించారు. వీరిద్దరినీ మరోసారి విచారించిన తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నారు.

**సోషల్ మీడియాలో పరిచయాలతో..**



సుమేరా బాను

- విదేశాల్లో ఉన్న హ్యాండ్లర్ అబు హంజాలా ఆదేశాల మేరకు పని చేస్తూ, ఐఎస్‌కేపీ కీలక పాత్ర పోషించిన సూరత్ మహిళ సుమేరా బాను మాలిక్‌తో పాటు శ్రీనగర్‌కు చెందిన నలుగురు యువకులు అఫ్గానిస్థాన్–పాకిస్థాన్–ఇరాన్‌ల్లో విస్తరించి ఉన్న ఖురాసన్ ప్రావెన్స్‌కు వెళ్లాలని భావించారు. అక్కడ ఇస్లామిక్ రాజ్య స్థాపన కోసం పోరాడాలని కుట్ర పన్నారు. వీరందరికీ సోషల్ మీడియా ద్వారానే ఒకరితో ఒకరికి పరిచయాలు ఏర్పడ్డాయి. సమేరా హైదరాబాద్‌కు రావాలని భావించి తనకు టీచర్ ఉద్యోగం కావాలంటూ కాలాపత్తర్ వాసిని కోరిందని తేలింది. దీంతో మంగళవారం సిటీకి వచ్చిన ఏటీఎస్ టీమ్ ఇతడి నుంచి వాంగ్మూలం నమోదు చేసి అవసరమైన అహ్మదాబాద్ రావాలని సూచించింది. అదే సమయంలో టోలిచౌకిలోని ఖదీజ ఇంటికీ ఓ బృందం వెళ్లింది.
- బక్రీద్ పండుగ జరుపుకోవడానికి ఈమె తన తండ్రితో కలిసి గోదావరిఖని వెళ్లినట్లు కుటుంబీకులు చెప్పారు. దీంతో అక్కడకు వెళ్లిన అధికారులు ఇరువురినీ సిటీకి తీసుకువచ్చారు. సుమేరా తనతో సంప్రదింపులు జరిపిన మాట వాస్తవమే అని, అయితే కేవలం కొన్ని మతపరమైన అంశాలు చర్చించేదని ఖదీజ ఏటీఎస్ అధికారులకు చెప్పింది. ఇది నిజమని భావించిన ప్రత్యేక బృందం ఆమెను సాక్షిగా పరిగణిస్తూ మంగళవారం మధ్యాహ్నం ఆమె నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. అహ్మదాబాద్‌లోని ఏటీఎస్ కస్టడీలో ఉన్న సుమేరా బాను ఈమెకు సంబంధించిన కీలకాంశాలను మంగళవారం రాత్రి బయటపెట్టింది. ఇద్దరం కలిసి ఆన్‌లైన్ ద్వారానే దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతను ఉగ్రవాదం వైపు మళ్లించాలని, ఖురాసన్‌కు వెళ్లి పోరాడాలని భావించామని వెల్లడించింది.
- తమ నెట్‌వర్క్ విస్తరణకు ఖదీజ కూడా సహకరించిందని బయటపెట్టింది. ఈ అంశాలపై సమాచారం అందుకున్న నగరంలోని ఏటీఎస్ బృందం బుధవారం మరోసారి ఖదీజతో పాటు జావీద్‌ను అదుపులోకి తీసుకుని అహ్మదాబాద్ తరలించింది. అమీర్‌పేటలోని తన తండ్రి పని చేస్తున్న కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఖదీజ శిక్షణ తీసుకుంటోంది. ఆ సంస్థలో ఉన్న కంప్యూటర్ ద్వారానూ ఈమె సుమేరాతో పాటు ఇతరులతో సంప్రదింపులు జరిపినట్లు బయటపెట్టింది. అహ్మదాబాద్‌లో అరెస్టు అయిన వారితో పాటు మరికొందరు ఉగ్రవాద సానుభూతిపరులు నగరానికి వచ్చి అమీర్‌పేటలోని ఇనిస్టిట్యూట్ సమీపంలో ఈమెను కలిసినట్లు ఏటీఎస్ గుర్తించింది.
- దీంతో మరో బృందం ఖదీజ శిక్షణ పొందుతున్న ఇనిస్టిట్యూట్‌లో సోదాలు చేసి ఆమె వినియోగించిన కంప్యూటర్ స్వాధీనం చేసుకుంది. సదరు ఇనిస్టిట్యూట్‌తో పాటు ఆ చుట్టుపక్కల ఉన్న మరో నాలుగు సంస్థలకు సంబంధించిన సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫీడ్‌ను సంగ్రహించింది. దీన్ని విశ్లేషించడం ద్వారా ఖదీజను కలిసిన వారిని గుర్తించడానికి ప్రయత్నాలు చేయనుంది. రంగంలోకి దిగిన రాష్ట్ర నిఘా వర్గాలు ఖదీజ నగరంలో ఇంకా ఎవరినైనా ఐఎస్‌కేపీ వైపు మళ్లించిందా? ఎవరెవరితో సంప్రదింపులు జరిపింది? తదితర అంశాలు ఆరా తీస్తున్నాయి.

**గణేష్ టెంపుల్ కుట్ర కేసులో జావీద్..**



జావీద్

సికింద్రాబాద్‌లోని గణేష్ టెంపుల్ పేల్చివేతతో పాటు అక్కడకు వచ్చే విదేశీ భక్తులను హతమార్చడానికి పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా (ఎల్ఈటీ) 2004లో కుట్ర పన్నింది. దీన్ని ఛేదించిన హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అనేక మంది ఉగ్రవాదులను అరెస్టు చేశారు. వీరిలో అప్పట్లో కంప్యూటర్ విద్య స్టూడెంట్‌గా ఉన్న జావీద్ కూడా ఒకడు. ఈ కేసులో ఇతడికి కండిషన్డ్ బెయిల్ లభించింది. ఆ షరతుల ప్రకారం అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదు. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తు చేస్తున్న సీఐడీ అధికారులు నిందితులపై లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ చేశారు. 2008లో ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా దుబాయ్ వెళ్లడానికి ప్రయత్నించిన జావీద్ శంషాబాద్ విమానాశ్రయంలో పట్టుబడి మరోసారి జైలుకు వెళ్లాడు. ప్రస్తుతం గణేష్ టెంపుల్ పేల్చివేత కుట్ర కేసు కోర్టు విచారణలో ఉంది.

## వరద ముప్పుపై మేలుకోండి



- వర్షాకాల సమస్యలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయండి
- కాంగ్రెస్ కార్పొరేటర్ల డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాల సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు ప్రత్యేకంగా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ కార్పొరేటర్లు రజిత పరమేశ్వర్‌రెడ్డి (ఉప్పల్), విజయారెడ్డి (ఖైరతాబాద్), రాజశేఖర్‌రెడ్డి (లింగోజిగూడ) డిమాండ్ చేశారు. ఈమేరకు మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ డీఎస్ లోకేశ్‌కుమార్‌కు వినతిపత్రాలు సమర్పించారు. నాలాల వద్ద ప్రమాదకర పరిస్థితులు గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. భారీ వర్షాలొచ్చినప్పుడు అధికార యంత్రాంగం తగిన విధంగా స్పందించడంతోపాటు వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరమని, అందుకు తగిన విధానాలు రూపొందించాలని కోరారు. ప్రజలు నాలాల్లో వ్యర్థాలు వేయకుండా తగిన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. నగరంలో ఎక్కడ, ఎప్పుడు నాలాలు పొంగుతాయో తెలియని పరిస్థితులున్నాయన్నారు. నాలాల అభివృద్ధి కోసం వెయ్యికోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం పనులు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో వెల్లడించాలన్నారు. ప్రతిసారీ వరదముప్పు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రులు, అధికారులు చెబుతున్నా పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయన్నారు. ప్రజల నుంచి పన్నుల రూపేణా కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నప్పటికీ, ప్రజల ప్రాణాలకు భద్రత ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. వాటర్ లాగింగ్ ప్రాంతాలు గుర్తిస్తున్నామని చెబుతున్న మంత్రి కేటీఆర్ వాటిని ఎప్పుడు పరిష్కరిస్తారో చెప్పాలన్నారు. ఎస్ఎన్‌డీపీ పనులు చాలావరకు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. వీటి పరిష్కారానికి సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## డ్రగ్స్ విక్రయించినా.. సరఫరా చేసినా 10 ఏళ్ల జైలు

**సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ సూపరింటెండెంట్ మురళీ కృష్ణ**





సదస్సులో మాట్లాడుతున్న మురళీ కృష్ణ

హఫీజ్‌పేట్: మాదక ద్రవ్యాలు విక్రయించినా.. సరఫరా చేసినా కనీసం 10 ఏళ్ల జైలు శిక్ష పడుతుందని సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ సూపరింటెండెంట్ మురళీ కృష్ణ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం కొండాపూర్‌లోని శరత్ సిటీ మాల్‌లో గ్రాన్యూల్స్ ఇండియా, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ సంయుక్తాధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' పేరుతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన ఆలోచనల నుంచే ఆరోగ్యకర జీవితం పుడుతుందని, మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలను అర్థం చేసుకోవాలన్నారు. మత్తు మందులకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రాన్యూల్స్ చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ ముఖేష్ సురాణా, గ్రాన్యూల్స్ సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ దీప్తి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## 4న నగరానికి రాష్ట్రపతి



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వచ్చే నెల 4న హైదరాబాద్‌కు రానున్నారు. నగరంలోని గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించే అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ హరీష్ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను సమీక్షించారు. రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. రాష్ట్రపతి పర్యటన జరిగే మార్గాలలో రోడ్ల మరమ్మతులు, బారికేడింగ్ చేపట్టాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య బృందాలను నియమించడం, తగు పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, లోపాలు లేకుండా చూడాలని, ప్రొటోకాల్‌ను అనుసరించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ చంద్రకళ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్ రావు, రోడ్లు భవనాల శాఖ అధికారి శ్రవణ్ ప్రకాష్, క్షత్రియ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, మెంబర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సిటీలో వండర్ 'కిడ్'

**సందడి చేసిన చిన్నారి రైటర్ 'ఆన్య గార్గ్'**

- సాహితీ పిపాసే రచయిత్రిగా మార్చిందని వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: అసాధారణమైన రచనా ప్రతిభతో సాహిత్య రంగంలో ఏడేళ్లకే అద్భుతమైన రైటర్‌గా పేరుగాంచి, అతి పిన్న వయసులోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కెక్కిన 'ఆన్య గార్గ్' నగరంలో సందడి చేసింది. 'ఐసీ మ్యాజిక్' ధారావాహికతో సాహిత్య ప్రపంచంలో ఎన్నో ప్రశంసలను అందుకున్న ఈ బాలిక బుధవారం జూబ్లీహిల్స్ రోడ్ నంబర్– 45లోని చబ్బీ చో రెస్టారెంట్ వేదికగా ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంది. సమావేశానికి ఆన్య గార్గ్ తన తల్లి పూజ గార్గ్, తాత అజయ్ కుమార్ అగర్వాల్‌తో కలిసి వచ్చింది. ఈ సందర్భంగా ఆన్య మాట్లాడుతూ.. ఫాంటసీ నవలలు చదవాలనే ఇష్టమే పుస్తకాలు రాయడానికి ప్రేరేపించిందని తెలిపింది. ఎనిమిది పుస్తకాల ఈ సిరీస్ విశేషమైన విజయాన్ని సాధించడం తన సాహిత్య భవిష్యత్‌కు మరింత ప్రోత్సాహాన్ని అందించిందని చెప్పింది. ఈ జోనర్‌లో 80కి పైగా పుస్తకాలను చదివానని, ఇందులో భాగంగానే తానే స్వయంగా కథలను ఊహించుకుని రాయాలనే ఆలోచన వచ్చిందని పేర్కొంది. తనకంటూ ఆదర్శం ఎవరూ లేరని, తన దినచర్య కూడా అందరిలానే ఉంటుందని, కాకపోతే పుస్తకాలపై ఎక్కువ సమయం వెచ్చిస్తానని, ఊహాజనితమైన పుస్తకాలని ఇష్టపడతానంది. తొమ్మిదేళ్ల తన కూతురు ప్రస్తుతం 4 వ తరగతి చదువుతోందని, కోవిడ్ సమయంలో అలవాటైన పుస్తక పఠనం ఆమెకు ఒక ఎడిక్షన్‌లా మారిందని తల్లి పూజ గార్గ్ తెలిపింది. కూతురు వ్యాపకం ఇలాంటి అద్భుత పుస్తకాలు రాసే దిశగా వెళ్తుందని ఊహించలేదన్నారు. తన మొదటి విడత 'ఐసీ మ్యాజిక్ – ఓషన్ ఫెయిరీస్' రచన అమెజాన్‌లో అత్యంత ఎక్కువగా అమ్ముడుపోయిన అగ్రస్థానానికి చేరుకోవడం మరచిపోలేని అనుభూతి అని పేర్కొన్నారు.

# ఆరోగ్య తెలంగాణ కోసం ప్రభుత్వం కృషి

- మంత్రి మహమూద్ అలీ
- ఉస్మానియా ఆస్పత్రిలో గ్యాస్ట్రో ఆపరేషన్ థియేటర్, ట్రాన్స్‌జెండర్, పెయిన్ క్లినిక్‌లు ప్రారంభం


ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మహమూద్ అలీ

అఫ్జల్‌గంజ్: ఆరోగ్య తెలంగాణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఉస్మానియా ఆస్పత్రి ప్రాంగణంలోని ఆపరేషన్ థియేటర్ బ్లాకులో నూతనంగా నిర్మించిన సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం ఆపరేషన్ థియేటర్, ఓపీ భవనంలో ట్రాన్స్ జెండర్ క్లినిక్, పెయిన్ క్లినిక్‌లను బుధవారం ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ గౌంటి శంకర్ యాదవ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతీ హోళికేరి, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రం ఏర్పడ్డ తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్యరంగానికి ప్రత్యేక స్థానం కల్పించారని, నగరం నాలుగు వైపులా వైద్యశాలలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. వందేళ్లకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన ఉస్మానియా ఆస్పత్రి భవనం పూర్తిగా శిథిలమైపోవడంతో ముఖ్యమంత్రి స్వయంగా ఆస్పత్రిని సందర్శించారని, భవనం వారసత్వ కట్టడాల జాబితాలో ఉండడంతో నూతన భవన నిర్మాణం పనులు ప్రారంభించలేకపోయారని తెలిపారు. ఈ ఎన్నికలకు ముందే ఉస్మానియా నూతన భవనం నిర్మాణం శంకుస్థాపన జరుగుతుందని మహమూద్ అలీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఉస్మానియాలో నిష్ణాతులైన వైద్య నిపుణులు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. 'నా చిన్నతనంలో ప్రమాదవశాత్తు కిందపడటంతో కాలికి గాయం అయ్యింది. మా నాన్న కట్టు కట్టించినా నయం కాలేదు. శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు సూచించడంతో ఉస్మానియాలో చేర్పించారు. రెండు నెలలు ఇక్కడే ఉండి చికిత్స చేయించుకున్నా' అని తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అంతకుముందు ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ మహమ్మద్ రఫీ.. మంత్రి చెయ్యికి దట్టి కట్టి స్వాగతం పలికారు.


వైద్య పరీక్షలు చేయించుకున్న మహమూద్ అలీ



## అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యం

మంత్రి హరీశ్‌రావు

గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందించేందుకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని వైద్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. బుధవారం ఆయన మెహిదీపట్నంలోని సరోజినీ కంటి ఆసుపత్రిలో మంత్రి మహమూద్ అలీతో కలిసి ఫాకో మెషిన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమం ప్రపంచంలోనే మొట్టమొదటిది అన్నారు. అంధత్వ రహిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫాకో యంత్రాలతో మరింత మెరుగైన కంటి శస్త్ర చికిత్సలు చేసే వీలు ఉంటుందని, కాటరాక్ట్ సర్జరీల నిర్వహణలో ఫాకో మెషిన్‌లు కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ మెరాజ్, సరోజినిదేవి కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజలింగం, ఆర్ఎంవో డాక్టర్ నజాఫీ తదితరులు పాల్గొన్నారు.

# 'ఖాకీ' వెనుక ఖాకీలెవరో?

మాజీ ఐఆర్ఎస్ అధికారి ఇంట్లో చోరీ కేసులో శివారు ఎస్ఐ పాత్ర రూఢీ

- ఇప్పటికే అనేక ఆధారాలు సేకరించిన పోలీసులు
- అయినప్పటికీ అరెస్టు చేసే విషయంలో వెనుకడుగు
- 'సాక్షి' కథనంతో హడావుడిగా అదనపు కస్టడీ విచారణ


శామ్యూల్


సురేందర్

సాక్షి, సిటీబ్యూరో: ఆదాయపు పన్ను శాఖ మాజీ అదనపు కమిషనర్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి శామ్యూల్ ప్రసాద్ ఇంట్లో చోటు చేసుకున్న భారీ చోరీ కేసులో సైబరాబాద్ కమిషనరేట్‌లో పని చేస్తున్న ఎస్సై పాత్ర రూఢీ అయింది. దీనికి సంబంధించిన అనేక ఆధారాలనూ ముషీరాబాద్ పోలీసులు సేకరించారు. అయితే ఇప్పటికీ సదరు ఎస్ఐని అరెస్టు చేయడంలో మాత్రం తాత్సారం ప్రదర్శిస్తున్నారు. ఈ వ్యవహారంలో కొందరు ఖాకీలే ఆ ఎస్ఐకి దన్నుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో ఉలిక్కిపడిన అధికారులు ఇప్పటికే అరెస్టు అయిన మరో నిందితుడిని అదనపు కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో పోలీసుల వ్యవహారశైలిపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### ఉద్దేశపూర్వకంగానే వ్యవహారం నడిపాడు...

ముషీరాబాద్‌లో నివసిస్తున్న శామ్యూల్‌కు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ఆస్తులు ఉన్నాయి. వీటిలో షాద్‌నగర్‌లో ఉన్న 10 ఎకరాలు కూడా ఒకటి. మేడ్చల్ జోన్‌లో ఉన్న ఓ ఠాణాలో విధులు నిర్వర్తిస్తున్న 2012 బ్యాచ్‌కు చెందిన సదరు ఎస్ఐ కొన్నాళ్ల క్రితం దీనిలోంచి మూడు ఎకరాలు ఖరీదు చేశాడు. శామ్యూల్ నుంచి ఎకరం రూ.30 లక్షల చొప్పున కొన్న ఇతడు కొన్నాళ్లకు రూ.కోటి చొప్పున విక్రయించి భారీ లాభం పొందాడు. శామ్యూల్‌కు ఉన్న మిగిలిన ఆస్తులకు సంబంధించిన పత్రాలు కాజేయాలని, వాటి ద్వారా ఆ స్థిరాస్తులు కాజేయాలని పథకం వేశాడు. నిజాంపేటకు చెందిన రియల్టర్ సురేందర్‌తో కలిసి పథకం వేసి రంగంలోకి దిగాడు. అతడి ద్వారానే తనకు తెలిసిన మహిళలు ఆయన ఇంట్లో పనికి పెట్టించాడు. ఈమె నుంచి వివరాలు సంగ్రహిస్తూ అదును చూసుకుని గత నెల 31న సురేందర్‌తో శామ్యూల్‌కు మత్తుమందు ఇప్పించి, ఆయన అల్మారాలోని ఆస్తి పత్రాలు, నగదు, బంగారం తదితరాలు చోరీ చేయించాడు.

### సురేందర్ కోసం 'హెబియస్' వేయించాడు...

వీటిలో వివిధ ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, లింక్ డాక్యుమెంట్లతో కలిపి దాదాపు 500 పత్రాలు, 90 తులాల బంగారాన్ని సురేందర్ సదరు ఎస్ఐకి అప్పగించాడు. ఈ బంగారాన్ని ఆ ఎస్ఐ మేడ్చల్‌లోని ఓ బంగారం దుకాణంలో కుదువ పెట్టించాడు. ఆస్తి పత్రాలను కోదాడ సమీపంలోని తన స్వగ్రామంలోని ఇంట్లో దాచాడు. భారీ చోరీపై ఈ నెల 14న శామ్యూల్ ముషీరాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజ్ ఆధారంగా పోలీసులు సురేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతగాడు సదరు ఎస్ఐ పాత్రను బయటపెట్టడంతో పోలీసులు ఆయన పని చేస్తున్న ఠాణా వద్దకు నిందితుడిని తీసుకువెళ్లారు. పోలీసులను అక్కడే ఉండమని లోపలకు వెళ్లి వచ్చిన సురేందర్ ప్లేట్ ఫిరాయించాడు. మీరు బెదిరించడంతోనే ఎస్ఐ పేరు చెప్పానని, ఆయన పాత్ర లేదని అన్నాడు. సురేందర్‌ను లోతుగా విచారించకూడదనే ఉద్దేశంతో సదరు ఎస్ఐ మరో పథకం వేశాడు. అతడి కుటుంబీకుల ద్వారా హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయించాడు.

### అన్నీ తెలిసినా, ఆధారాలు ఉన్నా...

ఈ నెల 18న సురేందర్‌ను అరెస్టు చేసిన పోలీసులు ఎస్ఐని విచారణకు రమ్మన్నారు. ఏం ఆధారాలు ఉన్నాయని నన్ను పిలుస్తున్నారంటూ బెదిరించాడు. దీంతో కూపీ లాగిన అధికారులు సురేందర్‌తో పాటు బంగారం తాకట్టు పెట్టుకున్న దుకాణ యజమానితో ఎస్ఐ మాట్లాడిన ఫోన్ కాల్స్ వివరాలు, ఆడియోలు సేకరించారు. ఉన్నతాధికారులు, అతడి బ్యాచ్‌మేట్స్ ద్వారా ఒత్తిడి చేయడంతో శామ్యూల్ ఇంటి నుంచి చోరీ అయిన డాక్యుమెంట్లనూ ముషీరాబాద్ పోలీసులకు అప్పగించాడు. ఇన్ని ఆధారాలు ఉన్నప్పటికీ ఎస్ఐ అంశాన్ని గోప్యంగా ఉంచేలా కొందరు అధికారులు ప్రయత్నించారు. సురేందర్‌ను మూడు రోజులు కస్టడీలోకి తీసుకుని విచారించినా అతడి వాంగ్మూలంలో ఎస్ఐ పేరు నమోదు చేయకుండా తప్పించే ప్రయత్నాలు జరిగాయి. 'మాజీ ఐఆర్ఎస్ ఇంట్లో చోరీ కేసులో ఖాకీ!' శీర్షికతో మంగళవారం 'సాక్షి' ప్రచురించిన కథనంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు. హడావుడిగా సురేందర్‌ను మరో మూడు రోజుల అదనపు కస్టడీకి తీసుకున్నారు. అతడి వాంగ్మూలాలనూ మారుస్తూ ఎస్ఐ వ్యవహారాన్ని జోడిస్తున్నారని తెలిసింది.



## రాష్ట్రంలో కల్లుగీత వృత్తిని కాపాడాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కుల వృత్తులకు మనుగడ లేకుండా పోయిందని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. లక్షల కుటుంబాలు ఆధారపడిన కల్లు గీత వృత్తిని కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం టీటీడీపీ అనుబంధ 'తెలుగు నాడు కల్లుగీత కార్మిక సంఘం' రాష్ట్ర అధ్యక్షుడిగా గజేంద్రగౌడ్, ఇతర కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రావుల మాట్లాడుతూ కులవృత్తులకు బీఆర్ఎస్ ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందని విమర్శించారు. గీత కార్మికులకు చెట్లు పెంచుకోవడానికి ఎక్కడ స్థలం లేదని, ప్రభుత్వమే చెట్ల పెంచుకోవడానికి భూమి ఇచ్చి ఆదుకోవాలన్నారు. మిషన్ల ద్వారా చెట్లు ఎక్కే యంత్రాలను తీసుకొచ్చి గీత కార్మికులకు చేయూతనిచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలుగు నాడు గీత కార్మిక సంఘం ఆవిర్భావ అధ్యక్షుడు స్వామి గౌడ్, జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, జాతీయ అధికార ప్రతినిధి టి.జ్యోత్స్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కిలి ఐలయ్య, తెలుగు మహిళ అధ్యక్షురాలు భవనం షకీలా రెడ్డి పాల్గొన్నారు.

## క్రియేటివ్ మల్టీ మీడియాకు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజశేఖర్ బుగ్గవీటి

బంజారాహిల్స్: దేశంలోనే అతిపెద్ద అత్యుత్తమ డిజిటల్ మీడియా ఎడ్యుకేషనల్ గ్రూప్ క్రియేటివ్ మల్టీ మీడియా ప్రతిష్టాత్మకమైన అడ్వకేట్ ఫర్ యానిమేషన్ ఎడ్యుకేషనల్ అవార్డు సొంతం చేసుకుంది. యానిమేషన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహిస్తున్న ఎడ్యుస్ పార్క్ సమ్మిట్ అండ్ అవార్డ్స్‌లో భాగంగా ఈ పురస్కారాన్ని క్రియేటివ్ మల్టీ మీడియాకు ఎంపికైన ఒదని సంస్థ వ్యవస్థాపకుడు సీఈవో రాజశేఖర్ బుగ్గవీటి వెల్లడించారు. కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఉజ్వల్ అనుచౌదరి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నామన్నారు. యానిమేషన్ వీఎఫ్ఎక్స్ గేమింగ్ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి దాన్ని నేటి తరానికి అందజేస్తున్న సంస్థల కృషికి గుర్తింపుగా ఎడ్యుస్పార్క్ గత రెండేళ్లుగా ఈ అవార్డులను అందజేస్తున్నది. ఈ అవార్డు యానిమేషన విద్యను దేశంలో ప్రమోట్ చేయడంలో తమ బాధ్యతను మరింత పెంచిందని రాజశేఖర్ తెలిపారు.

# క్రిప్టో ట్రేడింగ్ పేరుతో కుచ్చుటోపీ

- రూ.91 లక్షలు కోల్పోయిన ముగ్గురు నగరవాసులు
- వేర్వేరుగా సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు

హిమాయత్‌నగర్: ఆస్ట్రేలియాలోని క్రిప్టో కంపెనీలో ట్రేడింగ్ చేస్తే ఇక్కడ వచ్చే లాభాల కంటే వంద రెట్లు అధికమైన లాభాలు వస్తాయని స్నేహితుడు ఇచ్చిన సూచనతో ముందుకెళ్లాడు నగర వాసి ఒకరు. అక్కడి కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లతో వాట్సప్ కాల్ మాట్లాడించడంతో నగర వాసికి మరింత నమ్మకం ఏర్పడింది. రెండేళ్ల క్రితం ఇలా పరిచయం కావడంతో తొలుత రూ.25 వేలతో ట్రేడింగ్ ప్రారంభించాడు. దీనికి రివార్డ్‌తో కూడిన లాభాలు వచ్చాయంటూ కొంత డబ్బు అకౌంట్‌కు జమ చేయడంతో నమ్మకం బలపడింది. ఇలా రెండేళ్ల వ్యవధిలో దాదాపు రూ.52 లక్షలు ట్రేడింగ్ చేసి నష్టపోయానని, ఒక్క రూపాయి లాభం ఇవ్వకపోగా పెట్టుబడి పెట్టిన రూ.52 లక్షలను సైతం ఇవ్వకుండా ఫ్రీజ్ చేశారంటూ బాధితుడు బుధవారం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలసి ఫిర్యాదు చేశాడు. 'హెచ్5 ది హైపర్ ఫండ్స్ డాట్ నెట్' కంపెనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు చైర్మన్ అంటూ శ్యాంలీ, ఎండీ అంటూ రాన్‌జాల్యాలు నగర వాసితో మాట్లాడారు. రూ.25 వేల తర్వాత ఒకటేసారి రూ.2 లక్షలు పెట్టగా దీనికి కూడా లాభాలు వచ్చాయని కొంత డబ్బు ఇచ్చారు. దీంతో రూ.20 లక్షలు ట్రేడింగ్ కోసం మరోసారి పెట్టాడు. ఆ తర్వాత ×హెచ్5 ది హైపర్ వెర్స్ డాట్ నెట్× గా కంపెనీ పేరు మార్చామని చెప్పి రూ.20 లక్షలు తీసుకున్నారు. ఫైనల్‌గా ×హైపర్ నేషన్×గా కంపెనీ పేరు మార్చామని మరో రూ.10 లక్షలు పెట్టించారు. ఇలా రూ.52 లక్షలు పెట్టించి ఒక్క రూపాయి లాభం ఇవ్వలేదు. మరిన్ని పెట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ చెప్పారు.

### గేమింగ్ పేరుతో రూ.12 లక్షలు

మరో వ్యక్తిని గేమింగ్ ద్వారా డబ్బు సంపాదించొచ్చంటూ నేరగాళ్లు వల వేశారు. 'యాప్ జిటానీ' అనే గేమింగ్ యాప్‌లో కొన్ని గేమ్స్ ఆడిపించారు. ఆ తర్వాత క్రిప్టో కరెన్సీలో ట్రేడింగ్ చేయాలని సూచించారు. గేమింగ్‌లో కొంత డబ్బు రావడంతో ఆశపడ్డ నగర వాసి పలు దఫాలుగా రూ.12 లక్షలు పెట్టుబడి పెట్టగా..లాభం ఇవ్వకుండా మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్‌క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో వ్యక్తికి టెలిగ్రామ్ ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్లు ఇన్వెస్ట్‌మెంట్ చేయాలంటూ ప్రోత్సహించారు. తొలుత నమ్మకం కోసం లాభాలు ఇచ్చి ఆపై పలు దఫాలుగా రూ.27 లక్షలు దోచుకున్నారు. ఇలా ఒక్కరోజు వేర్వేరు ఘటనల్లో రూ.91 లక్షలను ముగ్గురు బాధితులు కోల్పోయారు.

## పక్షవాతం వచ్చిందని వదిలేసిన భార్య

రాచకొండ సీపీకి ఫిర్యాదు చేసిన భర్త


డీఎస్ చౌహాన్‌ను వేడుకుంటున్న కిషన్

సాక్షి, సిటీబ్యూరో: గతంలో ఆటోడ్రైవర్‌గా పనిచేసి, నాలుగేళ్ల క్రితం వచ్చిన పక్షవాతం వల్ల ఇంటికే పరిమితమై ఇబ్బందులు పడుతున్న సంస్థాన్ నారాయణపురంకు చెందిన కిషన్ అనే బాధితుడు గురువారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయానికి వచ్చారు. పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. చాంబర్ నుంచి బయటికి వచ్చిన సీపీ స్వయంగా బాధితుడు పిటిషన్‌ను స్వీకరించారు. పక్షవాతం వల్ల ఇంటికే పరిమితమైన తనను భార్య వదిలేసిందని, తన సంరక్షణ చూసుకునే వారు ఎవరూ లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నానని బాధితుడు సీపీ ముందు ఆవేదన వ్యక్తం చేశాడు. ఫిర్యాదుదారుడి భార్య, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్య పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులకు సీపీ సూచించారు.

## మెరిసిన మోహిత్


కౌశిక్


మోహిత్


రితీశ్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) 'బి' డివిజన్ లీగ్ క్రికెట్ రెండు రోజుల మ్యాచ్‌లో చీర్‌ఫుల్ చమ్స్ క్రికెట్ క్లబ్ ఆరు వికెట్ల తేడాతో శ్రీ శ్యామ్ క్రికెట్ క్లబ్‌ను ఓడించింది. ముందుగా శ్రీ శ్యామ్ జట్టు 44.4 ఓవర్లలో 104 పరుగులకు ఆలౌటైంది. చీర్‌ఫుల్ చమ్స్ జట్టు కెప్టెన్ టీఎస్ఆర్ మోహిత్ 34 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. శ్రేయ్ సింగ్, దాసరి సాయి సూరజ్‌లకు రెండు వికెట్లు చొప్పున లభించాయి. అనంతరం చీర్‌ఫుల్ చమ్స్ జట్టు 23 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ అన్నెందేవి ధనుష్ 61 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

### రితీశ్ రెడ్డి డబుల్ సెంచరీ

హెచ్‌సీఏ 'బి' డివిజన్ రెండు రోజుల లీగ్ మ్యాచ్‌లో వీనస్ సైబర్‌టెక్ బ్యాటర్ రితీశ్ రెడ్డి 'డబుల్ సెంచరీ'తో అదరగొట్టాడు. మాంచెస్టర్ క్రికెట్ క్లబ్ (సీసీ)తో జరిగిన ఈ మ్యాచ్‌లో వీనస్ సైబర్‌టెక్ జట్టు 251 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. ముందుగా వీనస్ సైబర్‌టెక్ జట్టు 85 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 356 పరుగులు చేసింది. రితీశ్ రెడ్డి 275 బంతుల్లో 29 ఫోర్ల సహాయంతో సరిగ్గా 200 పరుగులు చేసి అవుటయ్యాడు. అనంతరం 357 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మాంచెస్టర్ సీసీ జట్టు 31.2 ఓవర్లలో 105 పరుగులకు ఆలౌటైంది. వీనస్ జట్టు బౌలర్ అభిజయ్ నాలుగు వికెట్లు తీశాడు.

### కౌశిక్ సెంచరీ వృథా

హెచ్‌సీఏ 'బి' డివిజన్ లీగ్ రెండో రోజుల మ్యాచ్‌లో భాగంగా పీకేఎంసీసీ జట్టుతో జరిగిన పోటీలో గ్రీన్‌టర్ఫ్ జట్టు 189 పరుగుల తేడాతో ఓడిపోయింది. 428 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గ్రీన్‌టర్ఫ్ జట్టు 68.2 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. గ్రీన్‌టర్ఫ్ బ్యాటర్ కౌశిక్ (130 నాటౌట్; 16 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ సెంచరీ సాధించినా ఫలితం లేకపోయింది.

అంతకుముందు పీకేఎంసీసీ జట్టు 71 ఓవర్లలో 7 వికెట్లకు 427 పరుగులు చేసింది. అర్హాన్ పార్థ్ సత్వాలేకర్ (220 నాటౌట్; 43 ఫోర్లు, 1 సిక్స్) అజేయ డబుల్ సెంచరీ సాధించడం విశేషం.

# రాజ్‌భవన్ హైస్కూల్ కెప్టెన్‌గా మానస ఘన విజయం



ఓటింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న డీఈవో రోహిణి


ఎస్.మానస


దీప్తిరెడ్డి


కౌశిక్

బంజారాహిల్స్: సోమాజిగూడలోని రాజ్‌భవన్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థి సంఘాల ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. ఈ ఎన్నికల సందర్భంగా పాఠశాలలో సందడి నెలకొంది. ఓట్లు వేసేందుకు విద్యార్థులు ఉత్సాహాన్ని చూపించారు. మొత్తం 399 ఓట్లకుగాను 348 ఓట్లు పోల్ అయ్యాయి. కెప్టెన్ పదవికి మొత్తం 10 మంది పోటీ పడగా 144 ఓట్లతో ఎస్.మానస జయకేతనం ఎగురవేశారు. వైస్ కెప్టెన్‌గా బాలుర విభాగంలో కౌశిక్ 140 ఓట్లు సాధించి విజయం సాధించారు. వైస్ కెప్టెన్‌గా బాలికల విభాగంలో దీప్తిరెడ్డి 122 ఓట్లతో విజయం సాధించింది. ఈ ఎన్నికలను స్కూల్ సోషల్ స్టడీస్ టీచర్లు ప్రభాకర్, రాజు నేతృత్వంలో నిర్వహించారు.

ఓటింగ్ సరళిని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి పరిశీలించి విద్యార్థుల ఉత్సాహాన్ని చూసి అభినందించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ ఎన్నికలు దోహదపడతాయని ఆమె ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని కూడా నిలుపుతాయన్నారు.

## క్లుప్తంగా...

### అక్రమంగా నల్లా కనెక్షన్: మహిళపై కేసు నమోదు

బంజారాహిల్స్: అడ్డదారుల్లో, అక్రమంగా నల్లా కనెక్షన్‌ను తీసుకున్న మహిళపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాలివీ.... బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌లో ఇంటి నెంబర్ 8-2-269/డి/10/ఏ/1లో జలమండలి 15 ఎంఎం మంచినీటి పైప్‌లైన్‌కు అనుమతులు ఇచ్చింది. అయితే రెండు రోజుల క్రితం ఇక్కడ తనిఖీలు నిర్వహించగా ఈ ఇంటి యజమానురాలు ఎం.శకుంతల అక్రమంగా 20 ఎంఎం మంచినీటి పైప్‌లైన్‌ను వేసుకున్నట్లుగా అధికారులు గుర్తించారు. ఈ పైప్‌లైన్‌కు సంబంధించి సంబంధిత డాక్యుమెంట్లు ఇవ్వాలని ప్రశ్నించగా ఆమె ఎలాంటి పత్రాలు చూపించలేకపోయిందని ప్రధాన పైప్‌లైన్ నుంచి అడ్డదారుల్లో ఇల్లీగల్‌గా వాటర్ కనెక్షన్ పొందిన శకుంతలపై చర్యలు తీసుకోవాలంటూ జలమండలి తట్టికాన సెక్షన్ మేనేజర్ రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు శకుంతలపై ఐపీఈ సెక్షన్ 269, 430, 379, పీడీపీపీ యాక్ట్ కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు.

### మాంసం వ్యర్థాలను రోడ్లపై వేయొద్దు



జహీరానగర్‌వాసులకు కవర్లు అందజేస్తున్న ఏఎంహెచ్‌వో రజినీకాంత్

వెంకటేశ్వరకాలనీ: బక్రీద్ నేపథ్యంలో పెద్ద ఎత్తున జంతు కళేబర వ్యర్థాలు వెలువడనున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారుల అప్రమత్తమయ్యారు. సర్కిల్-18 ఏఎంహెచ్‌వో డాక్టర్ రజినీకాంత్ మసీదు కమిటీ నిర్వాహకులతో పాటు బస్తీ సంక్షేమ సంఘం నేతలకు, బస్తీవాసులకు బుధవారం వ్యర్థాలు వేసేందుకు బ్లాక్ కవర్లను పంపిణీ చేశారు. వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లో బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని బ్లాక్ కవర్లలో వేసి జీహెచ్ఎంసీ సిబ్బందికి అప్పగించాలని ఆయన కోరారు.

### 'లక్ష'ణంగా పొట్టేలు!



రహమత్‌నగర్: బక్రీద్ వచ్చిందంటేచాలు గొర్రెలు, పొట్టేళ్ల ధరలు ఆకాశాన్ని అంటుతాయి. అయినా ఖుర్బానీ ఇచ్చేందుకు ముస్లింలు ఎంత ధర ఉన్నా వాటిని కొనేందుకు వెనుకాడటం లేదు. ఈ క్రమంలో శ్రీరాంనగర్‌కు చెందిన మహ్మద్ నసీర్ రూ. లక్ష వెచ్చించి పొట్టేలును కొన్నాడు. ఆ పొట్టేలును చూసేందుకు స్థానికులు ఆశక్తి కనబరుస్తున్నారు.

### లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానా

బంజారాహిల్స్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పలువురు వాహనదారులు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డారు. బుధవారం 10 మంది వాహనదారులు నాంపల్లిలోని పదవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా వీరందరికీ రూ. 5500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

### 3 నుంచి వృత్తివిద్యా కోర్సులకు ఉచిత శిక్షణ

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్ మే) కేంద్ర ప్రభుత్వ శిక్షణా సంస్థలో జులై 3వ తేదీ నుంచి ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిమ్స్‌మే ప్రతినిధులు తెలిపారు. బ్యూటీ థెరపిస్ట్, క్రాఫ్ట్, బేకర్స్, అసిస్టెంట్ ఫ్యాషన్ డిజైనర్స్, ఇంజనీర్ టెక్నికల్ సపోర్ట్, సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, మిషన్ లెర్నింగ్ ఇంజినీర్, క్లౌడ్ కంప్యూటర్ జూనియర్ అనలిస్ట్, ఏఐ అండ్ ఎంఎల్, జూనియర్ డేటా అనలిస్ట్, అకౌంట్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో కేంద్ర సూక్ష్మ, చిన్న, లఘు సంస్థల (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ కోర్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. 18 నుంచి 35 సంవత్సరాలు మధ్య ఉన్న యువతీ యువకులు అర్హులన్నారు. ఆయా కోర్సుల్లో శిక్షణ తీసుకోవాలనుకునే ఆసక్తిగల వారు తమ ఆధార్ కార్డు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, పది, ఇంటర్, డిగ్రీ తదితర విద్యార్హతలు కలిగిన సర్టిఫికెట్లు, కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన చిరునామా ఉన్న ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. వివరాలకు ఫోన్: 040 2363 3244/218/217లలో సంప్రదించవచ్చన్నారు.

# వర్షాకాలం ప్రారంభమైంది.. పారాహుషార్!



వరద నీరు నిలిచే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న జలమండలి సిబ్బంది

వర్షాకాలం ప్రారంభమైంది. గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు ముందస్తు జాగ్రత్తలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా వరద సమయాల్లో మూతల్లేని మ్యాన్‌హోళ్లు, వరద నీటి కాల్వలతో గతంలో ప్రాణాలు కోల్పోయి ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో ఈ సారి ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

**ప్రమాదాల నివారణే లక్ష్యంగా హెచ్చరిక బోర్డులు**

- వరద నీరు నిలిచే ప్రాంతాల్లో ఏర్పాటు
- మ్యాన్‌హోళ్లపై సేఫ్టీ గ్రిల్స్ బిగింపు
- వర్షాకాలం నేపథ్యంలో చర్యలకు జలమండలి సిద్ధం



మ్యాన్‌హోళ్లపై ఏర్పాటు చేసిన సేఫ్టీగ్రిల్స్‌ను పరిశీలిస్తున్న జలమండలి జీఎం హరిశంకర్

బంజారాహిల్స్: వరద నీరు ఎక్కడెక్కడ నిలిచిపోతుందో ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి ప్రతి వరద నీరు నిలిచే ప్రాంతంలో ఈ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడమే కాకుండా స్థానికులకు అవగాహన కూడా కలిగించారు.

- ఇక్కడ లోతైన మ్యాన్‌హోల్ ఉంది... వర్షం సమయంలో అక్కడి నుంచి జాగ్రత్తగా వెళ్లండి అంటూ సూచిస్తున్నారు.
- చాలా చోట్ల మ్యాన్‌హోళ్లపై మూతలు లేకపోవడంతో తలెత్తుతున్న ప్రమాదాల దృష్ట్యా సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి మ్యాన్‌హోల్ మూతపైనా తప్పనిసరిగా సేఫ్టీ గ్రిల్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.
- ఇంకోవైపు వరద నీటి కాల్వల వద్ద సైతం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.
- మరో వారం రోజుల పాటు జలమండలి డివిజన్-6 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, వెంగళ్‌రావునగర్, ఎర్రగడ్డ, అమీర్‌పేట్, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో వరద నీరు నిలిచే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసే ప్రక్రియను పూర్తి చేస్తామని జలమండలి జీఎం హరిశంకర్ వెల్లడించారు.
- తాను ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ పరిస్థితిని అంచనా వేస్తున్నామని తెలిపారు. డివిజన్ పరిధిలో ఎక్కడెక్కడ సేఫ్టీ గ్రిల్స్ అవసరమో ఇప్పటికే పంపిణీ చేశామని ఆయన స్పష్టం చేశారు.
- వరదలు వచ్చే సమయంలో వరద నీటి కాల్వల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన వెల్లడించారు.
- జలమండలి సెక్షన్ మేనేజర్లకు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు వర్షాకాల కార్యాచరణప్రణాళికలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశామని తెలిపారు.
- ప్రజలు కూడా ఎక్కడైనా మ్యాన్‌హోల్ మూతలు తెరిచి ఉన్నా, వరద నీటి కాల్వల వద్ద ప్రమాదాలు తలెత్తే విషయాలను గమనిస్తే సమీపంలోని జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు.

### అధికారులతో కార్పొరేటర్ కవితారెడ్డి సమీక్ష



అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డ్రైనేజీలు ఓవర్‌ఫ్లో కాకుండా చర్యలు చేపట్టాలని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు సూచించారు. వరద, బురద సమస్యకు చెక్ పెట్టాలన్నారు. బుధవారం రోడ్ నెం. 4లోని జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. దెబ్బతిన్న సీవరేజి పైప్‌లైన్ ప్రాంతాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని వార్డు కార్యాలయంలో ఏఎంసీ ఉప్పలయ్యతో పాటు వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో జరగాల్సిన అభివృద్ధి పనులతో పాటు జరగాల్సిన అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. వర్షాలు పూర్తి స్థాయిలో మొదలయ్యేలోపే అభివృద్ధి పనులు పూర్తిచేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆమె కోరారు.

### 6 నుంచి సాయి సంకీర్తనా యజ్ఞ మహోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్ తదితరులు

ఖైరతాబాద్: షిరిడీ సాయి సేవా సమితి సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా సాయి అఖండ ఏక నామ సంకీర్తనాయజ్ఞ మహోత్సవాలను జూలై 6 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ తెలిపారు. బుధవారం వాసవి సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. చిక్కడపల్లిలోని షిరిడీ సాయి సేవా సంఘం ఏర్పాటై 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కర్మన్‌ఘాట్, చంపాపేట్ దగ్గర ఉన్న అయ్యప్ప హరి హర క్షేత్రంలో 25 రోజుల పాటు అఖండ ఏకనామ సంకీర్తణలు, నిత్యదేవతల అర్చణ, అభిషేకాష్టోత్తరాలు, లలిత విష్ణు సహస్రనామ పారాయనంతో నిత్య అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకుడు, సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.శ్యాంసుందర్ యాదవ్ తెలిపారు. వాసవి హాస్పిటల్ ప్రధాన కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్, సేవా కేంద్రం అధ్యక్షుడు ఆలంపల్లి రవికుమార్, ప్రధాన కార్యదర్శి కొల్పూరు రమేష్, కోశాధికారి పంపాటి జ్ఞాన్‌చందర్, శామీర్‌పేట్ రత్నాలయ చైర్మన్ టి.ఆర్.వెంకటేష్, రామిడి శంకర్‌గుప్తా, నాళ్ల పవన్, ఇరుకుళ్ల సత్యనారాయణ, శంబు పాండయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

### సొసైటీ స్థలం ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం 45లో సొసైటీకి చెందిన ప్లాట్‌ను కొంతమంది ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బి.రవీంద్రనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రోడ్డులో ప్లాట్ నెం 775 వెనుక సొసైటీకి చెందిన ఖాళీ స్థలం ఉందని, కొంతకాలంగా ఈ స్థలంలోకి చొచ్చుకువచ్చి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేసిన వ్యక్తికి జైలు



ఖైరాం కొండా గోపాల్

బంజారాహిల్స్: విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను దుర్భాషలాడటమే కాకుండా దౌర్జన్యంగా నెట్టేసిన ఘటనలో నిందితుడికి 20 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గత గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం. 1/7 చౌరస్తాలో బంజారాహిల్స్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సాయి మనోహర్ విధులు నిర్వహిస్తుండగా న్యూ నల్లకుంట తిలక్‌నగర్‌కు చెందిన వ్యాపారి ఖైరాం కొండా గోపాల్(39) మద్యం మత్తులో వాహనం నడుపుతూ ఓ వాహనదారుడితో గొడవపడుతున్నాడు. ఇదేమిటని ప్రశ్నించిన సాయి మనోహర్‌పై కొండా గోపాల్ దుర్భాషలాడుతూ కాలర్ పట్టుకున్నారు. బాధిత కానిస్టేబుల్ అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడిపై పెట్టీ కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నాంపల్లిలోని పదవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు ఎదుట హాజరు పరిచారు. కేసు తీవ్రతను గుర్తించిన న్యాయమూర్తి నిందితుడికి పైమేరకు శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.

### విద్యుదాఘాతంతో విద్యార్థికి గాయాలు

బంజారాహిల్స్: బడి ఎగ్గొట్టేందుకు పాఠశాల ప్రహరీ దూకేందుకు యత్నించిన విద్యార్థి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... మాసబ్‌ట్యాంక్‌లోని శాంతినగర్‌లో నివసించే ఎం.డి.హసన్(17) బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 23వ తేదీన క్లాస్ ఎగ్గొట్టి మధ్యాహ్నం 2 గంటల సమయంలో ప్రధాన గేటు మూసివేయడంతో బయటికి వెళ్లేందుకు యత్నించే క్రమంలో గోడ దూకేందుకు ప్రయత్నించాడు. అక్కడే ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న విషయం గమనించకపోవడంతో చెయ్యి విద్యుత్ వైర్లకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. 30 శాతం కాలిన గాయాలతో బాధితుడిని బంజారాహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. పాఠశాల నిర్లక్ష్యంతోనే తన కుమారుడు విద్యుదాఘాతానికి గురయ్యాడని బాధితుడి తండ్రి లతీఫ్ ఖాన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్లక్ష్యానికి కారణమైన పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు పోలీసులు పాఠశాలపై ఐపీసీ సెక్షన్ 337 కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జీఆర్ఏటీ సభ్యులకు రాయితీతో కూడిన వైద్యం



ఆసుపత్రితో ఒప్పందం చేసుకుంటున్న జీఆర్ఎటీ ప్రతినిధులు

పంజగుట్ట: గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (జీఆర్ఏటీ) సభ్యులకు రాయితీతో కూడిన వైద్యసేవలను టీఎక్స్ ఆసుపత్రి అందిస్తుందని జీఆర్ఎటీ వ్యవస్థాపక అధ్యక్షులు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎ.హనుమంత రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆసుపత్రి, జీఆర్ఎటీ ఒప్పందం కుదుర్చుకున్నారు. హనుమంత రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రాంత వాసులకు రాయితీతో వైద్యసేవలు, శస్త్ర చికిత్సలు, వైద్య పరీక్షలు, ఆంబులెన్స్ సర్వీసులు అందించడానికి ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జీఆర్ఎటీ ప్రధానకార్యదర్శి రాఘవ్, సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

### గోవధపై హైకోర్టు తీర్పు హర్షణీయం

పంజగుట్ట: గోవధపై హైకోర్టు ఇచ్చిన తీర్పు గో రక్షకులకు ఎంతో బలాన్ని ఇచ్చిందని యుగతులసి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివకుమార్ అన్నారు. ఒక్క గోవును కూడా చంపడానికి వీలులేదని హైకోర్టు స్పష్టంగా చెప్పిందని, కోర్టుకు తెలంగాణ ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌ను పిలిపించారంటే ప్రభుత్వాన్ని పిలిపించినట్లే అని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరామ్‌తో కలిసి మాట్లాడుతూ... పోలీసులు తాము చెక్‌పోస్టులు పెట్టాము, సిబ్బందిని పెట్టి కఠినంగా ఉన్నామని అంటున్నారని మీరు అవన్నీ చేస్తే కోర్టు సుమటోగా మా కేసు ఎందుకు తీసుకుంటుంది, అక్రమంగా తరలిస్తున్నారని తాము పూర్తి ఆధారాలు చూపగా అద్భుతమైన తీర్పు ఇచ్చిందన్నారు. ఎక్కడైనా గోవధ జరిగితే వాటి వీడియోలను తమ యుగతులసి నెంబర్ 80086 02588 నెంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు.

### 2న ముదిరాజ్ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న జగన్మోహన్ ముదిరాజ్

పంజగుట్ట: ముదిరాజ్ డాక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో జులై 2న ముదిరాజ్ వైద్యుల ఆత్మీయ సమేళనం, డాక్టర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ముదిరాజ్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బోయిని జగన్మోహన్ ముదిరాజ్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్, ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య, యువజన ప్రధాన కార్యదర్శి అల్లుడు జగన్‌లు మాట్లాడుతూ .. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్యభవన్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ ఆయుర్వేద, యునానీ, హోమియో అన్నిరకాల వైద్యులు, వైద్య విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి హరీష్‌రావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్‌లు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో డాక్టర్ నాగభూషణం, రంజిత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పాలిథిన్ కవర్ల పంపిణీ



ఖైరతాబాద్: బక్రీద్‌ను పురస్కరించుకొని వ్యర్థాలను సేకరించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పాలిథిన్ కవర్లను బుధవారం కార్పొరేటర్ విజయారెడ్డి పంపిణీ చేశారు. ఖైరతాబాద్ డివిజన్‌లోని ఎంఎస్‌మక్తాలో ముస్లింలకు కవర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్.కె.షరీఫ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పాలనలోనే అన్ని మతాలకు ప్రాధాన్యం

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



పాలిథిన్ కవర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్: బీఆర్ఎఎస్ పాలనలోనే అన్ని మతాల వారికి సముచిత ప్రాధాన్యం, గౌరవం లభిస్తున్నదని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎస్పీఆర్‌హిల్స్ ప్లేగ్రౌండ్‌లో బక్రీద్ ప్రార్థనల ఏర్పాట్లను జీహెచ్ఎంసీ అధికారులు, కార్పొరేటర్లలతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ... బక్రీద్ ప్రార్థనలను ఎలాంటి వివాదాలకు తావులేకుండా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. అనంతరం జీహెచ్ఎంసీ సరఫరా చేసిన పాలిథిన్ కవర్లను పలువురికి పంపిణీ చేశారు. జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఈఈ రాజ్‌కుమార్, కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, రాజ్‌కుమార్‌పటేల్, దేదీప్య, బీఆర్ఎస్ నాయకులు కృష్ణమోహన్, సంతోష్, దుబాయ్ నజీర్, సిరాజ్, విజయ్‌కుమార్, నర్సింగ్‌దాస్, షేక్ షరీఫ్, జాఫర్‌హుస్సేన్, గనీ, జబ్బార్, బషీర్, గఫూర్, విలియమ్స్, గోపీ, లింగరాజు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ మైనారిటీ నాయకులు తన్నూఖాన్, అప్పుఖాన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన పొట్టేళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది.

## విద్యతోనే ప్రగతి పథంలో భారత్

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్: చిన్నారులందరూ విద్యావంతులైతేనే రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతాయని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బుధవారం ఖైరతాబాద్ మహాగణపతి మంటపంలో మంగళారపు శివలాల్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు ఐదొందల మంది విద్యార్థులకు ట్రస్ట్ చైర్మన్ మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ... రెండు దశాబ్దాలుగా మహేష్‌యాదవ్ తండ్రి జ్ఞాపకార్థం ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందనీయమన్నారు. బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జల నాగేష్ మాట్లాడుతూ... ఖైరతాబాద్‌లో మహేష్‌యాదవ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తాను బతికున్నంత వరకు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని ట్రస్ట్ చైర్మన్ మహేష్‌యాదవ్ తెలిపారు. డీసీ మోహన్‌రెడ్డి, సైఫాబాద్ ఏసీపీ సంజీవ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ప్రసన్న, నాయకులు మహేందర్‌బాబు, లక్ష్మణ్ యాదవ్, సీఐబీ రాజు, ప్రసాద్, గంగాధర్ యాదవ్, మేఘన, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### రీజెనరేటివ్ విధానం ద్వారా కీళ్ల నొప్పులకు చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ వెంకటేష్ మొవ్వా

బంజారాహిల్స్: మోకాలి నొప్పితో బాధపడుతున్న వ్యక్తులకు ఎలాంటి సర్జరీలు లేకుండానే అత్యాధునిక రీ జెనరేటివ్ థెరపీ ద్వారా చికిత్సను అందించడం ద్వారా స్వస్థత చేకూరుస్తున్నామని రీజెన్ ఆర్థో స్పోర్ట్స్ రీ జెనరేటివ్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ వెంకటేష్ మొవ్వా వెల్లడించారు జూబ్లీహిల్స్‌రోడ్ నెం 1లోని ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రీ జెనరేటివ్ విధానాన్ని గురించి డాక్టర్ వెంకటేష్ వివరించారు. మోకాలి నొప్పి అనగానే చాలామంది సర్జరీ చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆందోళన పడుతుంటారని, మరి కొంతమంది ఎన్నో ఏళ్లపాటు ఇంజెక్షన్లు తీసుకుంటూ కాలయాపన చేస్తుంటారన్నారు. చివరికి పరిస్థితి తీవ్రంగా మారిన తర్వాత సర్జరీ తప్ప వేరే మార్గం లేకుండా పోతుందన్నారు, అయితే తమ వద్ద అత్యాధునిక రీజెనరేటివ్ విధానంలో మోకాలిలోని కణజాలాన్ని పెరిగేలా చూస్తామన్నారు. వెన్నెముక గాయాలు, ల్యాబ్రమ్, ఏసీఎల్ టియర్ అనే సమస్యలకు కూడా రీ జెనరేటివ్ విధానం ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. ఎనిమిదేళ్లుగా ఈ విధానంలో అనేకమందికి విజయవంతంగా నొప్పులను తగ్గించామని, ఈ చికిత్సను చేసే అతికొద్ది మంది నిపుణుల్లో తాను ఒకరినన్నారు. సర్జరీ లేకుండానే చికిత్స నిర్వహిస్తామని, ఇండియాలో చికిత్స నియంత్రణ సంస్థ (ఐసీఎస్ఆర్) ప్రభుత్వ అనుమతులను పొందామన్నారు.

### అన్నదానం



రహమత్‌నగర్: పూరి జగన్నాథ్ రథయాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఉత్కల్ సమాజ్, సిద్ధి వినాయక గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కార్మికనగర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ మాట్లాడుతూ... జగన్నాథ స్వామి వారి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అంతకు ముందు బస్‌స్టాప్ వద్ద ఉన్న గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు నీలం రతన్‌కుమార్, రాంధారి బాబా, కళావతి, ఉత్కల్ సమాజ్ ప్రముఖులు అత్తిలి గోపాల్, సంతోష్, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం కార్మికనగర్ పురవీధుల్లో జగన్నాథ రథయాత్ర నిర్వహించారు.

## క్లుప్తంగా...



### ఏపీలో సబ్సిడీపై టమాటా

రైతుబజార్ల ద్వారా

కిలో టమాటా రూ.50కే అమ్మకం

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఠారెత్తిస్తున్న టమాటా ధరల భారం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. పలుచోట్ల టమాటా రేట్లు చుక్కలను తాకుతుండటంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ శాఖను రంగంలోకి దించింది. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి ప్రధాన నగరాలు, పట్టణ ప్రాంతాల్లోని రైతుబజార్లలో కిలో రూ.50కే అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. వైఎస్సార్, కర్నూలు జిల్లాలలో బుధవారం శ్రీకారం చుట్టగా.. మిగిలిన జిల్లాల్లో గురువారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నిత్యం 50–60 టన్నుల టమాటాలు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. మరోవైపు టమాటాతో పోటీపడుతూ ఆకాశానికి ఎగబాకుతున్న పచ్చి మిర్చిని కూడా సబ్సిడీపై వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### మీవారితోనైనా నింపండి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటుపై హైకోర్టు వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: 'రాజ్యాంగబద్ధమైన ఎస్సీ, ఎస్టీ కమిషన్ పోస్టులను ఖాళీగా ఉంచడం సరి కాదు.. కనీసం మీవారితోనైనా నింపండి'.. అని ప్రభుత్వాన్ని ఉద్దేశించి హైకోర్టు వ్యాఖ్యానించింది. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకానికి ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని.. ఇంకా ఎంత సమయం కావాలని ప్రశ్నించింది. తదుపరి విచారణను జూలై 18కి వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకాలు చేపట్టకపోవడాన్ని సవాల్ చేస్తూ సికింద్రాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త ఎస్.గణేశ్‌రావుతో పాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకంపై పూర్తి వివరాలు అందజేయడానికి రెండు వారాల సమయం కావాలని అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ హైకోర్టును కోరారు. దీంతో ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

# నమ్మించి ముంచడమే వారి నైజం

గాంధీ గారి మూడు కోతుల కథలో 'చెడు వినొద్దు, చెడు కనొద్దు, చెడు అనొద్దు' అని నీతి చెబుతాయి. కానీ మన రాష్ట్రంలో మాత్రం 'మంచి వినొద్దు, మంచి కనొద్దు, మంచి అనొద్దు, మంచి చేయొద్దు' అనే నాలుగు కోతులున్నాయి. వీరినే దుష్ట చతుష్టయం అని మనం పిలుచుకుంటున్నాం. అవినీతి సొమ్మును పంచుకోవడం కోసం వారికి అధికారం కావాలి. ఇదీ వారి దుర్నీతి. నమ్మించి ప్రజల్ని నట్టేట ముంచడమే వారికి తెలిసిన ఏకైక నీతి.

## దుష్టచతుష్టయం దుర్నీతిని గమనించండి

ప్రతిపక్షాల తీరుపై ఏపీ సీఎం వైఎస్ జగన్ మండిపాటు



పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జరిగిన సభకు హాజరైన విద్యార్థులు, ప్రజలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: 'మనం ప్రజలకు మంచి చేస్తున్నామని కొంత మందికి కడుపులో మంట. వారికి మద్దతుగా ఉండే దుష్టచతుష్టయం జీర్ణించుకోలేకపోతోంది. పదేపదే అబద్ధాలు చెబుతూ, ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. ఈర్ష్యతో కళ్లు కప్పుకుపోయాయి. వీరి దుర్నీతిని ప్రజలు గమనించాలి' అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అమ్మఒడి నాలుగో ఏడాది ఆర్థిక సాయం విడుదల సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 45 ఏళ్ల రాజకీయ జీవితంలో 14 ఏళ్లు సీఎంగా ఉండీ కూడా ఏమీ చేయని ఓ నాయకుడు (చంద్రబాబు), ఆ నాయకుడి కోసం 15 ఏళ్ల కిందటే పుట్టిన ఓ దత్తపుత్రుడు (పవన్ కళ్యాణ్) మన ప్రభుత్వం చేస్తున్న మంచి చూసి జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. 'ఇదీ టీడీపీ అంటే.. టీ–తినుకో, డీ–దోచుకో, పీ–పంచుకో. దోచుకున్న అవినీతి సొమ్మును పంచుకుంటూ.. బొజ్జలు పెంచుకుంటూ.. బొజ్జ రాక్షసుల్లా వ్యవహరిస్తున్నారు. వారి పత్రికలు, వారి టీవీలతో కలిసి మంచి పనులు చేస్తున్న మనపై దుష్ప్రచారం చేస్తున్నారు' అని చెప్పారు. ఈ సభలో సీఎం ఇంకా ఏమన్నారంటే..

### కొత్త డ్రామాలు మొదలు

- మూడుసార్లు ముఖ్యమంత్రి అయినా కూడా ఏ ప్రాంతానికీ ఏ మంచీ చేయని చంద్రబాబు.. ఎన్నికల ముందు మేనిఫెస్టో బుక్ తెస్తారు. అది చేస్తా, ఇది చేస్తా అంటారు. అధికారంలోకి వస్తే దానిని చెత్త బుట్టలో పడేస్తారు. ఇదీ వాళ్ల ట్రాక్ రికార్డు. ఇదే దుష్ట చతుష్టయం, ఇదే బాబు.. మరోసారి అధికారం ఇవ్వండంటూ మరోసారి మేనిఫెస్టోతో మళ్లీ మోసానికి దిగారు. డ్రామాలు మొదలు పెట్టారు.



- ఈసారి డ్రామాలను కొంచెం రక్తి కట్టించారు. ప్రతి ఇంటికీ కేజీ బంగారం, బెంజ్ కారంట.. మోసం చేసేదానికి ఒక హద్దు పద్దు లేకుండా పోయింది. జగన్ ఏం చేస్తున్నాడు.. జగన్ కంటే కాస్త ఎక్కువ చెప్పాలని చెప్పి మోసం చేయడంలో రక్తి కట్టిస్తున్నాడు. వీళ్లందరికీ తోడు ఒక దత్తపుత్రుడు ఉన్నాడు. 2014లో చంద్రబాబుకు మద్దతు పలికాడు. ఒకవైపు చంద్రబాబు, మరోవైపు దత్తపుత్రుడి సంతకాలతో మీకు లేఖలు వచ్చాయి. మాదీ బాధ్యత అని, అన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. ఎన్నికలు అయిపోయాక ఎన్నికల ప్రణాళికను చెత్తబుట్టలో వేశారు.

### ప్యాకేజీ స్టార్ ఊగిపోతున్నాడు

- రైతులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, చిన్న పిల్లలను సైతం వదలకుండా చంద్రబాబు మోసం చేశాడు. పూచీగా సంతకం పెట్టిన దత్తపుత్రుడు ఐదేళ్లలో ఒక్క మాటా మాట్లాడలేదు. అలాంటి దత్తపుత్రుడు, ప్యాకేజీ స్టార్ ఈ రోజు ఓ లారీ ఎక్కాడు. దాని పేరు వారాహి అట. ఊగిపోతూ తనకు నచ్చని వారిని చెప్పుతో కొడతానంటాడు.. తాట తీస్తానంటాడు.. గుడ్డలూడదీసి తంతానంటాడు.. ఈయన నోటికి అదుపులేదు.. మనిషికి నిలకడ లేదు. పూనకం వచ్చినట్లు ఊగిపోతాడు.
- అలా మనం మాట్లాడలేం. వారిలా మనం రౌడీల్లా మీసాలు మెలేయలేం. బూతులు తిట్టలేం. నలుగురిని పెళ్లి చేసుకొని నాలుగేళ్లకోసారి భార్యనూ మార్చలేం. పెళ్లి అనే పవిత్ర వ్యవస్థను రోడ్డు మీదకు తీసుకురాలేం. ఇవన్నీ వారికే పేటెంట్.

# దివ్యాంగుల కోటా జాడేది?

- సంక్షేమ పథకాల్లో దివ్యాంగుల వాటాపై స్పష్టత కరువు
- పథకాల్లో తమకు 5% వాటా కేటాయించాలని వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహలక్ష్మి, దళితబంధు పథకాలపై దివ్యాంగుల్లో అయోమయం నెలకొంది. ఈ రెండు పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరుగా ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో రిజర్వేషన్ల అంశాన్ని స్పష్టంగా తెలిపింది. కానీ ఇందులో దివ్యాంగుల రిజర్వేషన్లపై ఎలాంటి వివరణ ఇవ్వలేదు. దీంతో ఆ వర్గాల్లో గందరగోళం నెలకొంది. దివ్యాంగుల హక్కుల చట్టం కింద రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయా సంఘాల నుంచి ప్రభుత్వానికి వినతులు వెల్లువెత్తుతున్నాయి. సంక్షేమ పథకాల్లో తమకు 5శాతం వాటా కేటాయించాలంటూ దివ్యాంగుల సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నాయి.

**జీఓ ఎంఎస్1 ఏం చెబుతుంది?**

ప్రభుత్వ పథకాల్లో దివ్యాంగులకు 5శాతం కోటా కేటాయిస్తూ 16 జనవరి, 2018లో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ జీఓ ఎంఎస్1 జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం తలపెట్టే కార్యక్రమాల్లో దివ్యాంగులకు 3శాతం నుంచి 5శాతం కోటా కేటాయించాలి. భౌతిక, ఆర్థికపరమైన కార్యక్రమాల్లో 5శాతానికి తగ్గకుండా లబ్ధి కల్పించాలి. దివ్యాంగులకు హక్కుల చట్టంలోని సెక్షన్ 37(బి) ప్రకారం దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం జీఓ ఎంఎస్1లో వెల్లడించింది. ఈ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విభాగాలకు ఇప్పటికే పంపింది.

**గృహలక్ష్మి పథకంలో రిజర్వేషన్లు కల్పించండి**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకంలో దివ్యాంగులకు 5శాతం లబ్ధి చేకూర్చాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందించాం. అన్ని సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అమలుచేస్తున్నారు, గృహలక్ష్మి పథకంలోనూ చర్యలు తీసుకోవాలని కోరాం. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

– వాసుదేవరెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్

# విశాఖలో మోడరన్ ట్రామ్ ప్రాజెక్టు

- మెట్రో సిస్టమ్‌కు అనుసంధానంగా ఏర్పాటు
- రూ.5,332 కోట్లతో ప్రణాళిక
- డీపీఆర్ తయారీకి ఏపీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశం



సాక్షి, అమరావతి : విశాఖపట్నంలో ప్రతిపాదించిన మెట్రో లైట్ (మోడరన్ ట్రామ్) ప్రాజెక్టుకు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేయాలని పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అధికారులను ఆదేశించారు. మంత్రి బుధవారం మెట్రో ప్రాజెక్టుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. విశాల ప్రయోజనాల దృష్ట్యా ప్రాజెక్టు డీపీఆర్‌ను మరింత మెరుగ్గా తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఆధునాతన ట్రామ్ ప్రాజెక్టును మెట్రోరైలు సిస్టంకు అనుసంధానంగా నగరం నలు దిక్కులా నాలుగు కారిడార్లుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మొత్తం 60.05 కిలోమీటర్ల పరిధిలో 58 స్టేషన్లతో రూ.5,332 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని మంత్రి వివరించారు. ప్రజా అవసరాలు, డిమాండ్ తదితర ప్రాధాన్యతలకు అనుగుణంగా ఒక్కొక్క కారిడార్‌కు తగిన ఆర్థిక నమూనా (ఫైనాన్షియల్ మోడల్)లో అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు.

# వ్యవసాయానికి విద్యుత్తు ఉచితమే

- అన్నదాతలకు ఉచిత విద్యుత్తు హక్కుగా అందాలన్నదే ఏపీ సీఎం జగన్ లక్ష్యం
- డిస్కంల సీఎండీలు పృథ్వీతేజ్, పద్మాజనార్దనరెడ్డి, సంతోషరావు

సాక్షి, అమరావతి: అన్నదాతలకు ఉచిత విద్యుత్‌ను హక్కుగా అందించాలని, 30 ఏళ్లయినా వ్యవసాయానికి ఎలాంటి కొరత లేకుండా నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. ఇందుకోసం ఖర్చుకు కూడా వెనుకాడకుండా ఏపీ రైతాంగం కోసం ఏర్పాటు చేసిన పథకమే వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం. ఈ పథకం కింద వ్యవసాయానికి పగటిపూట 9 గంటలపాటు నాణ్యమైన విద్యుత్తు ఉచితంగా అందుతుంది. ఇందుకోసం ప్రభుత్వం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. వాడిన విద్యుత్‌కు రైతులు చెల్లించాల్సిన బిల్లుల మొత్తాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఇంత మంచి పని చేస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారు కొందరు. రైతుల హక్కును అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారు. అసత్య ప్రచారాలతో ప్రజలను, రైతులను అయోమయానికి గురిచేయాలని ప్రయత్నిస్తున్నారు. అలాంటి తప్పుడు ప్రచారాలని నమ్మి ఆందోళనకు గురికావద్దని ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్దనరెడ్డి, కె.సంతోషరావు స్పష్టం చేశారు.

## ఆర్టీసీలో వెంటనే వేతన సవరణ జరపాలి

సాక్షి, హైదరాబాద్: దాదాపు 24 వేల కోట్ల నష్టాలున్నప్పటికీ విద్యుత్ శాఖ తమ ఉద్యోగులకు 2018, 2022లో వేతనాలు పెంచిందని, కానీ అతి తక్కువ వేతనాలున్న ఆర్టీసీ ఉద్యోగులకు మాత్రం 75 నెలల జాప్యం తర్వాత కూడా వేతన సవరణ చేయటం లేదని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మిక కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే వేతన సవరణకు అవకాశం కల్పించాలని ఆయన బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

## కొమ్మినేనికి 'నాటా' అవార్డు ఇన్ జర్నలిజం ఎక్సలెన్సీ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) అవార్డు ఇన్ జర్నలిజం–2023కు ఆంధ్రప్రదేశ్ సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఈ నెల 30 నుంచి జులై 3వ తేదీ వరకు అమెరికాలోని డల్లాస్ నగరంలో డల్లాస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును కొమ్మినేని అందుకోనున్నారని మీడియా అకాడమీ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. 46 సంవత్సరాల పాటు వివిధ పత్రికలు, చానళ్లలో పనిచేసిన అనుభవం, కేఎస్‌ఆర్ లైవ్ షో పేరుతో తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన కొమ్మినేని శ్రీనివాసరావుకు జర్నలిజం విభాగంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.

## నగర వార్తలు

### హెచ్‌సీయూకు ఉత్తమ ర్యాంక్

రాయదుర్గం: తాజా ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రపంచ ర్యాంకింగ్‌లో ఉత్తమ ర్యాంకులు పొందింది. క్యూఎస్(క్వాక్వెరెల్లి సైమండ్స్) వరల్డ్ సంస్థ ప్రతియేటా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, ఉన్నత విద్యాకేంద్రాల పనితీరు ఆధారంగా ర్యాంకింగ్స్‌ను ప్రకటిస్తూ ఉంటుంది. అందులో భాగంగా క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌ను బుధవారం ప్రకటించారు. అధ్యాపకుల సూచిక ఆధారంగా హెచ్‌సీయూ ప్రపంచంలో 372వ స్థానంలో నిలవడం విశేషం. ప్రపంచంలో అత్యధికంగా కన్సల్టేటెడ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 21వ ఎడిషన్ ప్రకారం హెచ్‌సీయూ ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా పేరుపొందింది. కాగా ఈ క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో హెచ్‌సీయూకు భారతదేశంలో 23వ స్థానం లభించింది.

### మనోవాంఛలన్నింటినీ వధించడమే అసలైన ఖుర్బానీ

లక్డీకాపూల్ : ఖుర్బానీ అంటే కేవలం జంతువులను వధించడమే కాదని మన మనోవాంఛలన్నింటినీ వధించడమే అసలైన ఖుర్బానీ అని జమాతె ఇస్లామ్‌హింద్ తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ ఖాలిద్ ముబష్శిర్ జఫర్ పేర్కొన్నారు. ప్రవక్త ఇబ్రహీం జ్ఞాపకార్థం జరుపుకునే బక్రీదు పండుగ త్యాగ స్ఫూర్తిని ప్రతీ ముస్లిమ్ అలవర్చుకోవాలన్నారు. బుధవారం ఆయన ముస్లిమ్ సోదరులకు బక్రీదు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్యాగస్ఫూర్తిని అలవర్చుకున్నప్పుడే ముస్లిములు ఎదుర్కొంటున్న అభద్రతాభావం, అన్ని రకాల భయాందోళనల్ని జయించవచ్చన్నారు. వేలాది సంవత్సరాల క్రితం ప్రవక్త ఇబ్రాహీం, ఇస్మాయిల్ (అలైహి)లు అల్లాహ్ పట్ల చూపిన విధేయత, త్యాగాలను అల్లాహ్ చిరస్మరణీయంగా మార్చారని డాక్టర్ ఖాలీద్ జఫర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం.. కుంగిన రోడ్డు

**మరో రోడ్డు సౌకర్యం లేక కాలనీవాసుల ఇబ్బందులు**

- రెండు ఇళ్లు, 24 ఫ్లాట్లలోని వారిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరిన అధికారులు



హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని గౌతమినగర్‌లో ప్రణీత్ నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం కారణంగా కుంగిపోయిన రహదారి



డ్రైనేజీపైపులైన్ పగిలిపోవటంతో సెల్లార్ గుంతలోకి ప్రవహిస్తున్న మురుగునీరు

భాగ్యనగర్‌కాలనీ: ప్రణీత్ నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం కారణంగా రోడ్డు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని గౌతమినగర్‌లో నిర్మాణ సంస్థ ఎటువంటి భద్రతా చర్యలు చేపట్టకుండా 9 ఎకరాల స్థలంలో భారీ వెంచర్ పనులను చేపడుతున్నారు. ఇందులో భాగంగానే సెల్లార్ నిర్మాణం కోసం సుమారు 40 నుంచి 60 అడుగుల లోతు తవ్వకాలు చేపట్టారు. రాత్రి సమయంలో జిలెటిన్ స్టిక్స్ వాడి గోతులు తవ్వారు. ఈ క్రమంలో రోడ్డు అంచు వరకు తవ్వకాలు చేపట్టడంతో రోడ్డు కుంగిపోయి నిర్మాణ సంస్థలో పడిపోయింది. దీంతో కుంగిన రోడ్డు దగ్గరగా ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లోని 24 ఫ్లాట్లలోని కుటుంబాలను, రెండు ఇళ్లలోని కుటుంబాలను ఇతర ప్రాంతాలకు వెళ్లాలని జీహెచ్‌ఎంసీ అధికారులు సూచించారు.

### ఒక్కసారిగా కుంగిపోయింది

డ్రైనేజీ పైపులైన్ పగిలిపోవటంతో మురుగు నీరు పూర్తిగా నిర్మాణ సంస్థ ప్రదేశంలో ప్రవహిస్తుండటం వల్ల స్థానికులు ఆందోళనకు గురయ్యారు. గతంలో సెల్లార్ నిర్మాణానికి పేలుళ్లు జరుపుతుండగా సమీపంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లలో భారీ శబ్దాలు రావటంతో పాటు రాత్రి పూట నిద్ర లేని పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు గౌతమీనగర్ అసోసియేషన్ సభ్యులు వాపోయారు. ఈ నిర్మాణ సంస్థపై జీహెచ్‌యంసి, టౌన్ ప్లానింగ్‌తో పాటు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని కాలనీవాసులు పేర్కొన్నారు. అయితే మంగళవారం సెల్లార్ నిర్మాణంలో భాగంగా మట్టి మెత్తగా ఉండటంతో రాత్రి ఒక్కసారిగా రోడ్డు కుంగిపోయి పడిపోయింది. మిగిలిన రోడ్డు కూడా ఎప్పుడు కూలిపోతుందోనని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి ప్రధాన రహదారి కావటంతో రోడ్డు కుంగిపోయి ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

### నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలి

కనీసం అంబులెన్స్‌కూడా రాని పరిస్థితి ఉండటంతో ఆరోగ్యం బాగోలేని వారిని కుర్చీమీద కూర్చోబెట్టుకొని ఇంటికి తీసుకువచ్చినట్లు వారు తెలిపారు. రోడ్డు కుంగిన విషయం తెలుసుకున్న అధికారులు, స్థానిక డివిజన్ కార్పొరేటర్, బీజేపీ నేతలు పెద్ద సంఖ్యలో చేరుకుని పరిశీలించారు. ఎటువంటి నిబంధనలు పాటించకుండా అజాగ్రత్తతో నిర్మాణం చేపడుతున్న ప్రణీత్ నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. అనుమతులు ఉన్నప్పటికి కనీస భద్రతా ప్రమాణాలు పాటించి ఉంటే ఇటువంటి పరిస్థితి వచ్చి ఉండేది కాదని వారు పేర్కొంటున్నారు. కుంగిపోయిన రోడ్డు నిర్మాణం చేపట్టే వరకు ఇక్కడి అపార్ట్‌మెంట్‌వాసులు రాకపోకలు సాగించేందుకు ప్రత్యామ్నాయంగా హైటెన్షన్ రహదారి వైపు ఉన్న నాగార్జున హోమ్స్‌కు చెందిన రహదారిని వాడుకునేటట్లుగా చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తెలిపారు.



రోడ్డు కుంగిపోవటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్న గౌతమినగర్ కాలనీవాసులు

## జాతి అభ్యుదయానికి పీవీ చేసిన కృషి మరువలేనిది



పీవీ నరసింహారావుకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి

సనత్‌నగర్: సంక్లిష్ట రాజకీయాల్లో భారత ప్రధానిగా పదవి చేపట్టిన పీవీ నరసింహారావు యావత్ ప్రపంచం కలకలం గుర్తుంచుకునేలా జాతి అభ్యుదయానికి కృషి చేశారని ఎమ్మెల్సీ వాణీదేవి అన్నారు. పీవీ నరసింహారావు 102వ జయంతి సందర్భంగా బుధవారం బేగంపేట బ్రాహ్మణవాడిలోని స్వామి రామానందతీర్థ మెమోరియల్ కమిటీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీవీ విగ్రహానికి పూలమాలలు వేసిన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ పీవీ సంస్కరణల ఫలితాలను, ప్రయోజనాలను మనమందరం అనుభవిస్తున్నామన్నారు. ఆయన ఒక పార్టీకి చెందిన వారైనా అన్ని రాజకీయ పార్టీల నాయకుల సహకారాన్ని పొందడం ఆయనతోనే ఆరంభమైందనడంలో ఆశ్చర్యం లేదన్నారు. ఆయనకు భారత అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించాలని ఆయన అభిమానులందరూ ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్వామి రామానందతీర్థ రీసెర్చ్ కమిటీ అధ్యక్షుడు పీవీ ప్రభాకర్‌రావు, సురభి రెనవబుల్ ఎనర్జీ డైరెక్టర్ శేఖర్ మారంరాజు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వాసుకి తదితరులు పాల్గొన్నారు.

# ఈటల భద్రతపై పోలీసుల పరిశీలన



ఈటల నివాసంలో భద్రతను పరిశీలిస్తున్న మేడ్చల్ డీసీపీ సందీప్

మేడ్చల్ రూరల్: బీజేపీ చేరికల కమిటీ చైర్మెన్, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ భద్రత పెంపుపై రాష్ట్ర పోలీసులు బుధవారం పరిశీలించారు. ఈటల రాజేందర్‌ను చంపాలని కుట్ర చేస్తున్నారని, ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి రూ.20కోట్లతో సుపారీ ఇచ్చారని ఈటల భార్య జమున ఆరోపణలు చేశారు. ఈటలకు కేంద్రం వై కేటగిరి భద్రత కల్పించనుందని వార్తల నేపథ్యంలో రాష్ట్ర పోలీసులు ఈటల భద్రతపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున భద్రత కల్పించాలని భావించగా డీజీపీ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం మేడ్చల్ డీసీపీ సందీప్ గోనె, ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డిలు మేడ్చల్ మండలం పూడూర్ గ్రామ పరిధిలో ఉన్న ఈటల రాజేందర్ నివాసానికి వెళ్లి పరిశీలించారు. ఈటల కుటుంబీకులతో భద్రతపై చర్చించారు. ఈటల నివాసంలో ఎవరెవరు ఉంటారు, ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారు అనే వివరాలు సేకరించారు. ఇంటి నలువైపులా పరిశీలించారు.

## టెక్నోపెయింట్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా మహేశ్‌బాబు



కార్యక్రమంలో పాల్గొన్న నమ్రతా శిరోద్కర్ , వైఎస్సార్‌సీపి రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి

మాదాపూర్: నగరానికి చెందిన టెక్నోపెయింట్స్ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా సూపర్‌స్టార్ మహేశ్‌బాబు వ్యవహరిస్తున్నట్టు సంస్థ అధినేత ఆకురి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్‌లో బుధవారం టెక్నో పెయింట్స్‌పై మహేశ్‌బాబు నటించిన టీవీ యాడ్స్‌ను మహేశ్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆయోధ్యరామిరెడ్డి , మేఘా ఇన్‌ఫ్రా డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగురాష్ట్రాల్లో 25శాతం వాటా దక్కించుకునే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. మహేశ్‌బాబును బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంచుకున్న తరువాత తమ ప్రొడక్ట్‌ను మరింత ముందుకు తీసుకువెళ్ళనున్నట్టు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు టెక్నోస్కూల్ భాగస్వామ్యంతో పనిచేస్తున్నామన్నారు. త్వరలో విశాఖ, ఒడిస్సా,లలో రెండు ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈ సందర్భంగా కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. టీఎస్ఈడబ్ల్యూ ఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



## కనుల పండువగా జగన్నాథ తిరుగు యాత్ర

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ 12లోని జగన్నాథ టెంపుల్‌లో జగన్నాథ బహుడా (తిరుగు) యాత్ర కనుల పండువగా జరిగింది. బుధవారం యాత్రను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని విశ్వసాయి మందిరంలో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రల విగ్రహాలను ఉంచారు. ఈ విగ్రహాలను భక్తిప్రపత్తుల మధ్య జగన్నాథ ఆలయానికి రథయాత్ర ద్వారా తీసుకొచ్చారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేయడంతో బంజారాహిల్స్ రహదారులు భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. ఉదయం 7.30 గంటలకు బలభద్రుడు, సుభద్ర, జగన్నాథుడితో కలిసి బయల్దేరిన క్షణాల నుంచి భక్తులు ఆనందంతో ఊగిపోయారు. ఆలయ అర్చకులు దివ్యరథాలపై బంగారు చీపురితో ఊడ్చి కస్తూరి కల్లాపి చల్లి హారతి ఇచ్చారు.



(నేడు ఈదుల్ అజ్ హా / బక్రీద్ పర్వదినం)

# మనోవాంఛల త్యాగమే బక్రీద్



ఒకప్పుడు ఎలాంటి జనసంచారం లేని నిర్జీవ ఎడారి ప్రాంతమది. కాని ఈనాడు విశ్వప్రభువు అనుగ్రహంతో నిత్యనూతనంగా కళకళలాడుతూ యావత్ ప్రపంచ ముస్లిం సమాజానికి ప్రధాన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఆ పుణ్యక్షేత్రమైన మక్కాలో జరిగే హజ్ ఆరాధనకు, ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సమాజం జరుపుకునే ఈదుల్ అజ్ హా పండుగకు అవినాభావ సంబంధం ఉంది.

ఈదుల్ అజ్ హా ఒక మహత్తర పర్వదినం. వ్యావహారికంలో దీన్ని బక్రీద్ పండుగ అంటారు. బక్రీద్ పేరు వినగానే మొదట మనకు హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం, ఇస్మాయిల్ అలైహిస్సలాంల పేర్లు గుర్తుకొస్తాయి. ఆ మహనీయుల విశ్వాస పటిమ, త్యాగ నిరతి కళ్ళముందు కదలాడతాయి. అలనాటి ఆ మధుర ఘట్టాలు ఒక్కొక్కటిగా మనో యవనిక పై ఆవిష్కృతమవుతాయి. వారి ఒక్కో అడుగు జాడ విశ్వాసాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. ఈ విధంగా ఆ త్యాగ ధనుల ఒక్కో ఆచరణనూ స్మరించుకుంటూ జరుపుకునే పర్వదినమే ఈదుల్ అజ్ హా... అదే బక్రీద్. ఆరోజే అరేబియా దేశంలోని మక్కా నగరంలో 'హజ్' ఆరాధన జరుగుతుంది. లక్షలాది మంది యాత్రికులతో ఆ పవిత్ర నగరం కళకళలాడుతూ ఉంటుంది. 'లబ్బైక్' నినాదాలు సర్వత్రా మిన్నంటుతూ ఉంటాయి. అల్లాహ్ ఆదేశాలను, ప్రవక్త వారి ప్రవచనాలను పాటించడంలో భక్తులు నిమగ్నమై ఉంటారు. నేల ఈనినట్లు కనిపించే ఆ జనవాహినిలో 'తవాఫ్ 'చేసేవారు కొందరైతే, 'సఫా మర్వా' కొండల మధ్య 'సయీ' చేసేవారు మరికొందరు. అదొక అపురూపమైన సుందర దృశ్యం. రమణీయమైన అద్భుత సన్నివేశం. అల్లాహ్ స్తోత్రంతో పరవశించి తన్మయత్వం చెందే ఆధ్యాత్మిక కేంద్ర బింబం.

జిల్ హజ్ పదవ తేదీన జరుపుకొనే బక్రీద్ ఒక అపూర్వమైన పండుగ. హజ్రత్ ఇబ్రాహీమ్, హజ్రత్ ఇస్మాయీల్ అలైహిస్సలాంల త్యాగాలను స్మరించుకునే త్యాగోత్సవం. ప్రపంచ విశ్వాసుల పర్వదినం. ఇదేదో షరా మామూలుగా జరిగే ఆచారం కాదు. ఇదొక మహత్తర సందేశం కలిగిన శుభదినం. క్రియా రూపంలో దైవ ధర్మాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అద్భుత ప్రక్రియ. మనిషి తనను తాను తగ్గించుకొని, వినమ్ర పూర్వకంగా అల్లాహ్ ఔన్నత్యాన్ని, ఆయన ఘనతను కీర్తించే గొప్పరోజు. మౌలిక విశ్వాసం పరంగా ఒక్కటిగానే ఉన్న మనం పాక్షిక పొరపొచ్చాలనూ విస్మరించి తోటి సోదరుల్ని గుండెలకు హత్తుకోవాల్సిన రోజు. ఈ పర్వదినం మనకిచ్చే మరో సందేశం ఏమిటంటే, సమాజాన్ని కలుపుకు పోకుండా, నలుగురితో మమేకం కాకుండా, సాటి ప్రజల పట్ల ప్రేమ, త్యాగం, సహనం, పరోపకారం లాంటి సుగుణాలను అలవరచుకోకుండా ఏ సంతోషమయినా, ఎంతటి ఆనందమైనా పరిపూర్ణం కాజాలదు. ఏ సంతోష కార్యమైనా నలుగురితో పంచుకోవాలని, కేవలం మన గురించి మాత్రమే కాకుండా సంఘం గురించి, సమాజం గురించి ఆలోచించాలని చెబుతుందీ పండుగ. ప్రతి ఒక్కరూ తమ స్థాయి, స్తోమతకు తగినట్లు ఈద్ జరుపుకుంటారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు జిల్ హజ్జ్ నెలలో 'హజ్ 'యాత్రకు వెళతారు. అంతటి స్థోమత లేనివారు ఇళ్ళవద్దనే ఖుర్బానీలు ఇస్తారు. ఆ స్థోమత కూడా లేకపోతే రెండు రకాతుల నమాజ్ ఆచరించినా దయామయుడైన దైవం హజ్, ఖుర్బానీలు ఆచరించిన వారితో సమానంగా పుణ్యఫలం ప్రసాదిస్తాడు. ఆయన తన దాసుల చిత్తశుద్ధిని, సంకల్పాన్ని మాత్రమే చూస్తాడు. ఆయనకు ధనరాశులు, రక్తమాంసాల అవసరం ఎంతమాత్రం లేదు. కనుక సర్వకాల సర్వావస్థల్లో చిత్తశుద్ధితో కూడిన సత్కర్మలు ఆచరించాలి. పేదసాదల అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి. పండుగల్లాంటి ప్రత్యేక సందర్భాల్లో వారిని ప్రత్యేకంగా గుర్తుంచుకోవాలి. ఆనందంలో వారినీ భాగస్వాములను చేయాలి. అప్పుడే నిజమైన పండుగ. తన అవసరాలను త్యజించి దైవ ప్రసన్నత కోసం ఇతరుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వమని చెప్పేదే ఈ త్యాగాల పండుగ. మంచికోసం మానవ సంక్షేమం కోసం, ధర్మంకోసం, ధర్మసంస్థాపన కోసం ఎంతో కొంత త్యాగం చెయ్యాలన్న సందేశం ఇందులో ఉంది. ఈరోజున ముస్లిం సమాజం జరుపుకుంటున్న త్యాగోత్సవానికి ఇదే అసలు ప్రేరణ. అందుకని, పండుగ సందర్భంగా చేసే ప్రతి ఆచరణలో త్యాగ ధనులైన హజ్రత్ ఇబ్రాహీం, ఇస్మాయీల్ గార్ల స్ఫూర్తి తొణికిసలాడాలి. దైవప్రసన్నత కోసం, ఇహపర సాఫల్యం కోసం వారు ఎలాంటి పరీక్షలు ఎదుర్కొన్నారో, ఎంతటి సహన స్థయిర్యాలు కనబరిచారో మనం కూడా అలాంటి ప్రయత్నం చెయ్యాలి. సదాచారం, త్యాగం, పరోపకారం లాంటి సుగుణాలను అలవరచుకోవాలి. మనోవాంఛల త్యాగం అన్నిటికన్నా ముఖ్యమైనది. ఈ సందర్భంగా మనం ఖుర్బానీలు ఇస్తాం, నమాజులు చేస్తాం. ఇతరత్రా ఇంకా ఏవో పుణ్యకార్యాలు ఆచరిస్తాం. కాని మనోవాంఛల త్యాగం అన్నిటికన్నా ముఖ్యమన్న విషయాన్ని విస్మరించకూడదు. ఇది నిస్సందేహంగా కష్టంతో కూడుకున్నకార్యమే. కాని, హజ్రత్ ఇబ్రాహీం, ఇస్మాయిల్ గార్ల త్యాగాలను స్మరించుకుంటే ఏమాత్రం కష్టం కాదు. మనం కూడా పరీక్షలు, కష్టాలు, త్యాగాల కఠినమయిన దశలను దాటవలసి ఉంది. ఈ మార్గంలో చేసే ఏ కృషి అయినా, ఏ త్యాగమయినా వృథా పోదు. చరిత్రే దీనికి ప్రత్యక్ష సాక్ష్యం. దైవం మనందరిలో త్యాగభావం, పరోపకార గుణాలను పెంపొందించాలని ప్రార్థిద్దాం.





## త్యాగానికి ప్రతీక

ఈ పండుగకు, హజ్, ఖుర్బానీలకు మూలకారణం హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం. ఈయన గొప్పదైవ ప్రవక్త. దేవునికి ప్రియ మిత్రుడు. తన పూర్తిజీవితం ద్వారా దైవప్రసన్నతకు మించిన కార్యం మరొకటి లేదని నిరూపించిన త్యాగధనుడు. కలలో కనిపించింది కూడా కరుణామయుని ఆజ్ఞగానే భావించి ఆచరించేవారు. ఒకరోజు ఇబ్రాహీం ప్రవక్త తన ముద్దుల కొడుకు ఇస్మాయిల్ గొంతుకోస్తున్నట్లు కలగన్నారు. దీన్ని ఆయన దైవాజ్ఞగా భావించి, తనయునితో సంప్రదించారు. తండ్రికి దగ్గ ఆ తనయుడు వెనకా ముందు ఆలోచించకుండా త్యాగానికి సిద్ధమయ్యారు. ఆ క్రమంలో వారు ఎదుర్కొన్న పరీక్షలు, అందులో వారు సఫలమైన తీరు, వారి ఒక్కో ఆచరణ ప్రళయకాలం వరకు సజీవంగా ఉండేలా ఏర్పాటు చేశాడు దైవం. అందుకే విశ్వవ్యాప్త విశ్వాసులు ఆ మహనీయుల ఒక్కో ఆచరణనూ స్మరించుకుంటూ, దేవుని ఘనతను, గొప్పతనాన్ని కీర్తిస్తూ, సముచిత రీతిలో ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి పండుగ రోజు ఈద్‌గాహ్‌కు చేరుకుని వేనోళ్ళా దైవాన్ని స్తుతిస్తారు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

---

# ఇలా రిపోర్ట్ చేయండి...!




ప్రతీకాత్మక చిత్రం

డబ్బు పోగొట్టుకోవడం, బెదిరింపులు ఎదుర్కోవడం, వీడియో–ఆడియో సంభాషణల ద్వారా ఇబ్బందులకు లోను అవడం.. ఇవన్నీ ఇటీవల ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికగా అధికంగా జరుగుతున్న నేరాలు. ఈ–మోసాలకు గురైతే ఏం చేయాలి? ఇంటర్నెట్‌లో భద్రంగా ఎలా ఉండాలి..? వివరంగా తెలుసుకుని ఆచరిస్తే సమస్యల నుంచి సులువుగా బయటపడవచ్చు.

మన దేశంలో సైబర్ నేరాలను అధికారులకు రిపోర్ట్ చేయాలంటే కొన్ని ముఖ్యమైన దశలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి..

- సైబర్ క్రైమ్‌కు సంబంధించి వీలైనంత ఎక్కువ సాక్ష్యాలను సేకరించాలి. ఇందులో స్క్రీన్ షాట్‌లు, ఇ–మెయిల్స్, చాట్‌లాగ్‌లు, బ్యాంక్ లావాదేవీల రికార్డులు, వీడియో అండ్ ఆడియో సంభాషణలు లేదా మీ ఫిర్యాదుకు మద్దతునిచ్చే ఏవైనా ఇతర సంబంధిత సమాచారం అంతా మీ దగ్గర ఉండాలి.

**1. సంఘటన ఆధారంగా..**

ఇంటర్నెట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ మొదలైనవాటిలో మీరు అవతలి వ్యక్తులతో కమ్యూనికేట్ చేసిన విధానం. తేదీ, సమయం, ఏ ప్లాట్ ఫారమ్ (ఇంటర్నెట్, సోషల్ మీడియా... మొదలైనవి) అనే అంశాల్ని చూసుకోవాలి. అలాగే సాక్ష్యాలను అప్‌లోడ్ చేయాలి (నగదు చెల్లింపులు /బ్యాంక్ స్క్రీన్‌షాట్‌లు ఆర్థిక మోసాలకు సంబంధించిన స్టేట్‌మెంట్‌లు. వేధింపులకు లేదా ఇతర వాటికి సంబంధించిన స్క్రీన్ షాట్‌లు, ఫొటో, ఆడియో, వీడియో మొదలైనవి ఏమైనా ఉంటే జత చేయాలి).

**2. అనుమానితుడి వివరాలు ఏవైనా ఉంటే..**

అనుమానితుడి పేరు, గుర్తింపు (మొబైల్, ఇ–మెయిల్, సోషల్ మీడియా యుఆర్‌ఎల్ మొదలైనవి), ప్లేస్ (ఆఫీస్... మొదలైనవి).

**3. కంప్లైంట్స్ వివరాలు**

బాధితుడి పూర్తి పేరుతో పాటు తండ్రి/జీవిత భాగస్వామి/ సంరక్షకుడు మొదలైనవి నోట్ చేయాలి. ఇ–మెయిల్ ఐడీ /ఫోన్ నెంబర్, చిరునామా, ఐడీ గుర్తింపు (ఆధార్.. మొదలైనవి)తో మీ దగ్గరలోని స్థానిక పోలీస్‌స్టేషన్ లేదా సంబంధిత పోలీస్ కమిషనరేట్‌లోని సైబర్ క్రైమ్ విభాగాన్ని సంప్రదించాలి. నేరం గురించి, సంఘటన జరిగిన తేదీ, సమయం, మీరు సేకరించిన సాక్ష్యాలతో సహా అన్ని వివరాలతో కూడిన రాతపూర్వక ఫిర్యాదుతో వారికి అందించాలి. మీ ఫిర్యాదుకు ఏవైనా సంబంధిత పత్రాలు లేదా సాక్ష్యాధారాల కాపీలను జత చేయాలి. మీ పట్ల జరిగిన నేరం వరుస పద్ధతిలో సాక్ష్యాలను జాబితా చేయడం మంచిది. మీ కంప్లైంట్ /ఎఫ్ఐఆర్/ పిటిషన్ ఫాలోఅప్ గురించి విచారించాలి. మీ కేసుకు కేటాయించిన దర్యాప్తు అధికారిని క్రమం తప్పకుండా వివరాలను కనుక్కుంటూ ఉండాలి. అధికారి పేరు, సంప్రదింపు వివరాలు, మీకు అందించిన ఏవైనా రిఫరెన్స్ నంబర్ల రికార్డును మెయిన్‌టెయిన్ చేయాలి. ఇ–మెయిల్, సందేశాలు లేదా ఏదైనా ఇతర డిజిటల్ కంటెంట్‌తో సహా సైబర్ నేరానికి సంబంధించిన అన్ని సంబంధిత సాక్ష్యాలను భద్రపరిచారని నిర్ధారించుకోవాలి. విచారణ ప్రయోజనాల కోసం సాక్ష్యాలను తారుమారు చేయద్దు.

**సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ సంబంధిత పోర్టల్స్:**

దేశంలో వివిధ రకాల సైబర్ నేరాలను నివేదించడానికి ఉన్న పోర్టల్స్..

- పరువు నష్టం, సైబర్ బెదిరింపు, సైబర్ స్టాకింగ్, అశ్లీల కంటెంట్, అశ్లీలత, లైంగిక వేధింపులు, ఫిషింగ్ మోసాలు.. వంటి సైబర్ మోసాలను నివేదించడానికి మీరు https://www.cybercrime.gov.in/ పోర్టల్‌ని ఉపయోగించవచ్చు.
- పెట్టుబడి మోసాలు, క్రిప్టో కరెన్సీ స్కామ్‌లు, ఇ–కామర్స్ మోసాలు, వర్క్ ఫ్రమ్ హోమ్‌స్కామ్‌లు, ఫిషింగ్ మోసాలతో సహా ఆర్థిక సైబర్ మోసాలకు గురైనట్లైతే.. 1930కి కాల్ చేయవచ్చు. సిటిజన్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్కామర్ల నిధులను స్తంభింపజేయడానికి ఈ వ్యవస్థ సహాయం చేస్తుంది.
- సైబర్ సెక్యూరిటీ, సైబర్ టెర్రరిజానికి సంబంధించిన సంఘటలను రిపోర్ట్ చేయడానికి ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (CERT-In) వెబ్‌సైట్ ద్వారా https://cert-in.org.in లో రిపోర్ట్ చేయవచ్చు.
- పోగొట్టుకున్న ఫోన్ల గురించి https://ceir.sancharsaathi.gov.in/Home/index.jsp లో రిపోర్ట్ చేయచ్చు. మీ ఫోన్‌లను బ్లాక్ చేయడానికి, ట్రాక్ చేయడానికి ఈ పోర్టల్ మీకు అనుమతిస్తుంది. సరైన సూచనల కోసం పోలీస్‌స్టేషన్‌ను కూడా సంప్రదించవచ్చు.
- ఎవరైనా మీ అనుమతి లేకుండా మొబైల్ ఫోన్ సేవల కోసం మీ ఆధారాలను ఉపయోగిస్తున్నారని అనుమానం వస్తే.. దానిని https://tafcop.sancharsaathi.gov.in/telecomUser/ లో రిపోర్ట్ చేయవచ్చు.
- వన్ నేషన్ వన్ అంబుడ్స్‌మన్ స్కీమ్ అనేది మీరు యుపీఐని ఉపయోగించి అనుకోకుండా ఇతరులకు డబ్బును బదిలీ చేస్తే, ఫిర్యాదు చేయడానికి అనుమతించే పథకం. సంబంధిత యుపీఐ సర్వీస్‌ప్రొవైడ్ (పేటీఎమ్, గూగుల్ పే, ఫోన్ పే మొదలైనవాటిపై ఫిర్యాదు), టోల్ ఫ్రీ నంబర్ 14448కి కాల్ చేయాలి. https://cms.rbi.org.in పోర్టల్‌లో రిపోర్ట్ చేయాలి. ప్రత్యామ్నాయంగా CRPC@rbi.org.in కు మెయిల్ చేయవచ్చు.
- యుపిఐ లావాదేవీకి సంబంధించి https://www.npci.org.in/what-we-do/upi/dispute-redressal-mechanismలో రిపోర్ట్ చేయచ్చు.

### సైబర్ సెక్యూరిటీ చిట్కాలు:

- పెద్ద అక్షరాలు, చిన్న అక్షరాలు, ప్రత్యేక అక్షరాలు, సంఖ్యా కలయికతో బలమైన పాస్‌వర్డ్‌లను సృష్టించాలి.
- మీ ఆన్‌లైన్, సోషల్ మీడియా, ఇ–మెయిల్ ఖాతాల కోసం .. టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ (2ఎఫ్ఎ)ని ప్రారంభించాలి.
- ఎసెమ్మెస్ ద్వారా మీ మొబైల్ పరికరానికి పంపిన ప్రత్యేక కోడ్‌ని లేదా ప్రత్యేక ప్రమాణీకరణ అప్లికేషన్‌ను ఉపయోగించవచ్చు.
- సురక్షిత డేటా ట్రాన్స్‌మిషన్ కోసం WPA2 లేదా WPA3 ఎన్‌క్రిప్షన్‌తో మీ వైఫై రూటర్‌ని సెట్ చేయాలి. చట్టబద్ధమైనదని మీకు కచ్చితంగా తెలిస్తే తప్ప పబ్లిక్ వై ఫైని ఎప్పటికీ ఉపయోగించవద్దు.
- మీ సోషల్ మీడియా ఖాతాల్లోని సీక్రెట్ సెట్టింగ్‌లను చెక్ చేస్తూ ఉండాలి. మీ వ్యక్తిగత వివరాలను నమ్మకమైన వారితో మాత్రమే పంచుకోవాలి.
- సాఫ్ట్‌వేర్ యాప్‌లు, ఫైల్స్‌ను రెప్యుటేషన్ ఉన్నవాటి నుండి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్ నుండి మాత్రమే అప్లికేషన్‌లను ఇన్‌స్టాల్ చేయాలి.
- మీ ముఖ్యమైన డేటా, ఫైల్స్ డేటా, క్లౌడ్ స్టోరేజీ మొత్తాన్ని క్రమం తప్పకుండా బ్యాకప్ చేసుకోవడం మంచిది.
- డిజిటల్ భద్రత పద్ధతుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవడం మంచిది.

**లోతైన పరిష్కారానికి..**

సోషల్ మీడియా మోసాలకు సంబంధించి సరైన, సంతృప్తికరమైన పరిష్కారం దొరకలేదు అనుకుంటే https://gac.gov.in/లో రిపోర్ట్ చేయవచ్చు. ఈ GAC కమిటీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ బాధితుల కంప్లైంట్స్‌ను అప్పీళ్లతో పరిష్కరిస్తుంది.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

---

పొరుగింటి పుల్లకూర రుచి అంటారు. ముంబైకి చెందిన హేమ తన బిడ్డలు దియా, ఓజస్వీ శర్మలతో కలిసి 'చిల్జో' ఫుడ్‌బ్రాండ్ ద్వారా మన పొరుగుదేశాలతో పాటు ఇటలీ, ఆఫ్రికా, అమెరికా, చైనా... మొదలైన దేశాల వంటకాలను రుచి చూపిస్తూ 'వావ్' అనిపిస్తోంది...

● కొత్త దారి

# విదేశీ భోజనంబు.. వింతైన వంటకంబు...



చైనా వంటకాలు చైనాకు వెళ్లే తిన నక్కర్లేదు. ఇటలీ వంటకాలకు అక్కడికే వెళ్లనక్కర్లేదు. ముంబైలోని 'చిల్జో'లోకి అడుగుపెడితే చాలు ఎన్నో దేశాలకు సంబంధించిన నోరూరించే వంటకాలు స్వాగతం పలుకుతాయి.

గత సంవత్సరం హేమ తన కూతుళ్లు దియా, ఓజస్వీలతో కలిసి ఈ ఫుడ్‌రెస్టారెంట్‌ను ప్రారంభించింది. ప్రారంభించిన కొద్దిరోజుల్లోనే సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. ముంబైవాసులు మాత్రమే కాదు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా ఇక్కడకు రావడం మొదలైంది.

'ఇతర దేశాల ఆహార సంస్కృతిని అందిపుచ్చుకొని ఆస్వాదించడం మనకేమీ కొత్త కాదు. అయితే అక్కడి రుచిని ఇక్కడికి తీసుకు వచ్చినప్పుడే విజయవంతం అవుతాం' అంటుంది దియా.

చదువు పూర్తయిన తరువాత అమెరికాలోని ఒక మార్కెటింగ్ కంపెనీలో పనిచేసింది దియా. ఉద్యోగ కాలంలో ఎన్నో ప్రాంతాలు తిరిగింది. ఆ సమయంలో రకరకాల రుచులతో పరిచయం అయింది. వంటల రుచికి మాత్రమే పరిమితమై పోకుండా ఎందరో చెఫ్‌లు, ఫుడ్ ఇండస్ట్రీలోని ప్రొఫెషనల్స్‌తో మాట్లాడింది.

కోవిడ్ కల్లోల కాలంలో స్వదేశానికి తిరిగివచ్చిన దియా ఇంటి నుంచి పనిచేయడం ప్రారంభించింది. లాక్‌డౌన్ సమయంలో బయటికి వెళ్లి తినే పరిస్థితి లేదు. దాల్, రోటీ తినడం తప్ప మరోదారి లేదు. మరోవైపు రకరకాల వంటకాల రుచులు గుర్తుకొచ్చి నోరూరించేవి. ఆ సమయంలో వివిధ దేశాలకు చెందిన వంటకాల గురించి తెలుసుకునే పనిలో పడింది దియా.

'ఎన్నో సంవత్సరాలు హాస్టల్ ఫుడ్ తిన్న నాకు కొత్త రుచి కావాలనిపించేది. నేను పాస్తాకు వీరాభిమానిని. దీంతో ఇంట్లో వంటల ప్రయోగాలు మొదలు పెట్టాం. చాలాసార్లు విఫలం అయిన తరువాతగానీ సక్సెస్ కాలేకపోయేవాళ్లం. మేము ప్రొఫెషనల్స్ కాకపోయినా యూట్యూబ్ వీడియోలు చూసుకుంటూ నేర్చుకున్నాం. ఇప్పుడు 'చాలా బావుంది... అని మాకు అనిపించే వరకు వెనక్కి తగ్గలేదు' అంటోంది బీటెక్ చదివిన ఓజస్వీ.



● హేమ, దియా, ఓజస్వి

ప్రయోగాల్లో భాగంగా తాము తయారుచేసిన రెండు వందల సాస్‌లను బంధువులు, స్నేహితులకు పంపిణీ చేశారు. వారి నుంచి మంచి స్పందన లభించింది.

ఆ సమయంలోనే ఈ తల్లీకూతుళ్ల మదిలో 'చిల్జో' ఐడియా వచ్చింది.

ఒక సంవత్సరం రీసెర్చ్, డెవలప్‌మెంట్ తరువాత ప్రాజెక్ట్ పట్టాలకెక్కింది. తమ పొదుపు మొత్తాల నుంచి 40 లక్షల రూపాయలు తీశారు. 30 మందికి ఉపాధి కల్పించారు.

'ఇంట్లో వంటలతో ఎన్ని ప్రయోగాలైనా చేయవచ్చు. డబ్బులతో చేయవద్దు. ఫుడ్ ఇండస్ట్రీలో మీకు ఎలాంటి అనుభవం లేదు. రిస్క్ తీసుకుంటున్నారు' అన్నవారే ఎక్కువ మంది ఉన్నారు.

'యూనిట్ మొదలైన తరువాత నేను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేశాను. ఎన్నో సంవత్సరాలు చేసిన ఉద్యోగానికి దూరం కావడం బాధగా అనిపించినా, సొంత వ్యాపారం మొదలుపెట్టాం అనేది ఉత్సాహాన్ని ఇచ్చింది. ఉత్సాహం అయితే ఉంది కానీ ఫుడ్ ఇండస్ట్రీకి సంబంధించి ఎలాంటి నేపథ్యం లేని మాకు మార్జిన్స్, రిటైల్, ఎలాంటి డిస్ట్రిబ్యూటర్‌లను సంప్రదించాలి అనే విషయాలు తెలియదు. జీటీ–జనరల్ ట్రేడ్, ఎంటీ–మార్కెట్ ట్రేడ్‌లాంటి పదాలు తెలియవు. సక్సెస్ అవుతామా, లేదా అనేది తెలియదు. అయినా ఉత్సాహంతో ముందుకు వెళ్లాం. మంచి ఫలితాన్ని సాధించాం' అంటుంది దియా.

**అయినా సరే...**

'ఏమవుతుందో ఏమో!' అనే సంశయం ఎక్కువైతే ఉన్నచోటే ఉండి పోతాం. కంఫర్ట్ జోన్‌కు అలవాటు పడిపోతాం. దీంతో విజయానికి దూరం అవుతాం. 'పెద్ద రిస్క్ ఏమిటంటే ఎలాంటి రిస్క్ తీసుకోకపోవడమే' అనే ప్రసిద్ధ మాటను దృష్టిలో పెట్టుకొని రంగంలోకి దిగాను. ఫుడ్ ఇండస్ట్రీలో ఎలాంటి అనుభవం లేకపోయినా మా మీద మేము నమ్మకం కోల్పోలేదు. ఆశావాదంతో ముందుకు వెళ్లాం. అద్భుత ఫలితాన్ని సాధించాం.

**- హేమ, ఫౌండర్, చిల్జో**



## అల్పైన్ వారియర్స్‌కు ఐదో విజయం

గ్లోబల్ చెస్ లీగ్‌లో ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్‌జీ అల్పైన్ వారియర్స్ జట్టు ఐదో విజయం సాధించింది. భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ సభ్యుడిగా ఉన్న గ్యాంజస్ గ్రాండ్‌మాస్టర్స్ జట్టుతో దుబాయ్‌లో బుధవారం జరిగిన ఏడో రౌండ్‌లో అల్పైన్ వారియర్స్ 10-8తో గెలిచింది. ఆనంద్‌తో జరిగిన గేమ్‌లో కార్ల్‌సన్ 72 ఎత్తుల్లో నెగ్గాడు. వారియర్స్‌కే చెందిన ప్రజ్ఞానంద 42 ఎత్తుల్లో ఇసిపెంకోను ఓడించగా... అర్జున్, ఎలిజబెత్ పాట్జ్ తమ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. గుకేశ్, ఇరీనా ఓడారు.

## కేటీ లెడెకీ ఆరోసారి...

అమెరికా మహిళా స్టార్ స్విమ్మర్ కేటీ లెడెకీ వరుసగా ఆరోసారి ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగనుంది. గతంలో మైకేల్ ఫెల్ప్స్, రియాన్ లోచ్టె, నటాలీ కులిన్, ఎలిజబెత్ జిసెల్, నాథన్ అడ్రియన్ మాత్రమే ఈ ఘనత సాధించారు. అమెరికా జాతీయ పోటీల్లో లెడెకీ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో విజేతగా నిలిచింది. లెడెకీ ఇప్పటివరకు ఒలింపిక్స్‌లో 7 స్వర్ణాలు, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 19 స్వర్ణాలు గెలిచింది.



# లార్డ్స్‌లో నిరసన గళం

### నిరసనకారుణ్ని ఎత్తుకొని బౌండరీ వద్ద దించిన బెయిర్‌స్టో

విఖ్యాత లార్డ్స్ మైదానంలో బుధవారం అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఆందోళనకారులు రెండో టెస్టు మొదలవగానే హల్‌చల్ చేశారు. ఊహించని విధంగా కొందరు ఆందోళనకారులు మైదానం లోపలికి దూసుకొచ్చారు. ఆరెంజ్ (కాషాయ రంగు) పొడిని పిచ్‌పై చల్లేందుకు ప్రయత్నించారు. పర్యావరణ కార్యకర్తలు 'జస్ట్ స్టాప్ ఆయిల్' (చమురు ఉత్పాదక లైసెన్సులపై నిరసన)లో భాగంగా లార్డ్స్‌లో తమ నిరసన గళంతో ప్రపంచం కంటపడ్డారు. మ్యాచ్ మొదలై తొలి ఓవర్ ముగిసిందో లేదో ముగ్గురు పర్యావరణ కార్యకర్తలు గ్రౌండ్‌లోకి పరుగెత్తుకుంటూ వచ్చారు. చేతిలోని కవర్లోంచి ఆరెంజ్ పొడిని మైదానంలో చల్లారు. ఒక నిరసనకారుడిని కీపర్ బెయిర్‌స్టో అమాంతం తన రెండు చేతులతో మేకపిల్లను ఎత్తుకున్నంత సులభంగా పైకెత్తుకొన్నాడు. 50 మీటర్ల దూరంలో ఉన్న బౌండరీ లైను దాకా నడుచుకుంటూ వెళ్లి పద్ధతిగా అతన్ని దిగబెట్టాడు. అక్కడే కాచుకున్న సెక్యూరిటీ సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకుంది. ఈ ఉదంతంపై లండన్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు.



**ఏమిటీ 'జస్ట్ స్టాప్ ఆయిల్'?**

పర్యావరణానికి హాని కలిగించే చమురు ఉత్పాదన కోసం కొత్త లైసెన్సులను నిలిపివేయాలని కొందరు నిరసనకారులు 'జస్ట్ స్టాప్ ఆయిల్' పేరిట ఆందోళనకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది బ్రిటన్‌లో పలు క్రీడల ఈవెంట్లను ఈ పర్యావరణ కార్యకర్తలు ఆటంకపరుస్తూ తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఇంగ్లండ్, ఐర్లాండ్ క్రికెట్ మ్యాచ్, ప్రీమియర్ లీగ్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు, ప్రీమియర్‌షిప్ రగ్బీ ఫైనల్‌కు, ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్‌లలోనూ తమ నిరసన గళం వినిపించారు.


# ఆసీస్‌దే తొలిరోజు

- రాణించిన స్మిత్, హెడ్, వార్నర్
- తొలి ఇన్నింగ్స్‌లో 339/5
- యాషెస్ రెండో టెస్టు

లండన్: బ్యాటర్లు క్రీజులో పాతుకుపోవడంతో రెండో టెస్టు ఆస్ట్రేలియా ఆధిపత్యంతో మొదలైంది. యాషెస్ సిరీస్‌లో భాగంగా 'క్రికెట్ మక్కా' లార్డ్స్ మైదానంలో జరుగుతున్న ఈ టెస్టులో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 5 వికెట్లకు 339 పరుగులు చేసింది. స్టీవ్ స్మిత్ (85 బ్యాటింగ్; 10 ఫోర్లు) అజేయ అర్ధసెంచరీతో నిలువగా, ట్రావిస్ హెడ్ (77; 14 ఫోర్లు), వార్నర్ (66; 8 ఫోర్లు, 1 సిక్స్) వన్డేలా ఆడి వేగంగా ఫిఫ్టీలు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ టంగ్, రూట్ చెరో 2 వికెట్లు తీశారు. టాస్ నెగ్గిన ఇంగ్లండ్ ఫీల్డింగ్‌కే మొగ్గు చూపింది. దీనికి తగ్గట్లే బౌలర్లు కూడా ఓపెనర్లను పెవిలియన్‌కు పంపేవారు! కానీ పేలవమైన ఫీల్డింగ్ విలువైన వికెట్ అందిపుచ్చుకోలేకపోయింది. 13వ ఓవర్ ఆఖరి బంతి వార్నర్ బ్యాట్ అంచును తాకుతూ నాలుగో స్లిప్‌లో ఉన్న పోప్ వైపు వెళ్లింది. కానీ సునాయాసమైన ఈ క్యాచ్‌ను అతను నేలపాలు చేశాడు. అప్పటికి వార్నర్ స్కోరు 20 పరుగులే. కాసేపటికి ఉస్మాన్ ఖ్వాజా (17; 2 ఫోర్లు)ను టంగ్ బౌల్డ్ చేయగా, లైఫ్‌తో వార్నర్ ఎంచక్కా అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. వన్డే ఫార్మాట్‌లా ఆడుతున్న అతన్ని కూడా టంగ్ బౌల్డ్ చేయగా, లబుషేన్-స్మిత్ జోడీ ఆతిథ్య బౌలర్లకు మింగుడుపడని భాగస్వామ్యాన్ని నమోదు చేసింది. ఇద్దరు మూడో వికెట్‌కు 102 పరుగులు జత చేశారు. అనంతరం లబుషేన్ ఆటకు రాబిన్సన్ ముగింపు పలికాడు. అయితే హెడ్ వచ్చాక స్మిత్ తన నిలకడైన బ్యాటింగ్‌ను కొనసాగించడంతో ఆతిథ్య బౌలర్లకు మళ్లీ కష్టాలు తప్పలేదు. ఇద్దరు ఆఖరి సెషన్‌లో అదరగొట్టారు. ఈ జోడీ ఇంగ్లండ్ పాలిట కొరకరానికొయ్యలా మారింది. నాలుగో వికెట్‌కు 118 పరుగులు జోడించాక రూట్ ఒకే ఓవర్లో హెడ్‌తో పాటు, గ్రీన్ (0)ను అవుట్ చేయడంతో ఇంగ్లండ్ శిబిరం ఊపిరి పీల్చుకుంది. స్మిత్‌తో పాటు క్యారీ (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.



**1** ఈ మ్యాచ్‌తో ఆస్ట్రేలియా స్పిన్నర్ నాథన్ లయన్ తన కెరీర్‌లో 100 టెస్టులు పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో వరుసగా 100 టెస్టులు ఆడిన తొలి బౌలర్‌గా లయన్ ఘనత సాధించాడు. గతంలో అలిస్టర్ కుక్ (159 టెస్టులు), బోర్డర్ (153), మార్క్ వా (107), సునీల్ గావస్కర్ (106), మెకల్లమ్ (101) వరుసగా 100కుపైగా టెస్టులు ఆడినా వారందరూ బ్యాటర్లు కావడం గమనార్హం.



## ధ్రువ్ షోరే సెంచరీ

బెంగళూరు: భారత క్రికెట్ దేశవాళీ సీజన్ 2023–2024 దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లతో బుధవారం మొదలైంది. చిన్నస్వామి స్టేడియంలో నార్త్ ఈస్ట్ జోన్‌తో ప్రారంభమైన క్వార్టర్ ఫైనల్లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి నార్త్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా సాగుతోంది. 90 ఓవర్లు ఆడిన నార్త్ జోన్ 6 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసింది. ఓపెనర్ ధ్రువ్ షోరే (211 బంతుల్లో 136; 22 ఫోర్లు) సెంచరీ సాధించాడు. నిశాంత్ సింధు (113 బంతుల్లో 76 బ్యాటింగ్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), పుల్కిత్ నారంగ్ (23 బ్యాటింగ్; 3 ఫోర్లు) క్రీజులో ఉన్నారు.

**సెంట్రల్ జోన్ 182 ఆలౌట్**

ఆలూర్‌లో ఈస్ట్ జోన్ జట్టుతో జరుగుతున్న మరో క్వార్టర్ ఫైనల్లో సెంట్రల్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 71.4 ఓవర్లలో 182 పరుగులకు ఆలౌటైంది. ఐపీఎల్ స్టార్ రింకూ సింగ్ (38; 6 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈస్ట్ జోన్ బౌలర్ మణిశంకర్ మురాసింగ్ 42 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఈస్ట్ జోన్ ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 32 పరుగులు సాధించింది.


## హైదరాబాద్‌లో జాతీయ సీనియర్ స్విమ్మింగ్ పోటీలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో జూలై 2 నుంచి 5 వరకు హైదరాబాద్ వేదికగా జాతీయ సీనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. గచ్చిబౌలి స్టేడియం స్విమ్మింగ్ కాంప్లెక్స్‌లో జరిగే ఈ పోటీల్లో దేశం నలుమూలల నుంచి 500 మందికిపైగా స్విమ్మర్లు బరిలోకి దిగనున్నారు. తెలంగాణ తరఫున 22 మంది స్విమ్మర్లు పోటీపడనుండగా... పురుషుల బృందానికి సూర్యాన్షు, మహిళల బృందానికి ప్రితి అగర్వాల్ నాయకత్వం వహిస్తారు. జాన్ సిద్దిఖీ, ఆయూశ్ యాదవ్ కోచ్‌లుగా వ్యవహరిస్తారు. ఒలింపియన్ స్విమ్మర్లు శ్రీహరి నటరాజ్, సజన్ ప్రకాశ్, మానా పటేల్ ప్రధాన ఆకర్షణగా నిలువనున్నారు.

## భారత కబడ్డీ జట్టు హ్యాట్రిక్




బుసాన్ (దక్షిణ కొరియా): ఆసియా పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు వరుసగా మూడో విజయం నమోదు చేసింది. జపాన్ జట్టుతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 62–18 పాయింట్లతో తేడాతో ఘనవిజయం సాధించింది. కెప్టెన్ పవన్ సెహ్రావత్, అర్జున్ దేశ్వాల్, అస్లామ్ ఇనామ్‌దార్ రాణించడంతో భారత్ ఆరంభంలో 15–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. విరామ సమయానికి భారత్ 32–6తో ముందంజ వేసింది. రెండో అర్ధభాగంలోనూ భారత క్రీడాకారులు పూర్తి ఆధిపత్యం చలాయించారు. నేడు జరిగే నాలుగో లీగ్ మ్యాచ్‌లో ఇరాన్‌తో భారత్ ఆడుతుంది.



## టాప్ సీడ్‌గా అల్‌కరాజ్

**వింబుల్డన్ టోర్నీ సీడింగ్స్ విడుదల**

లండన్: ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్‌కు టాప్ సీడింగ్ లభించింది. దాంతో 2003 తర్వాత ఫెడరర్ (స్విట్జర్లాండ్), నాదల్ (స్పెయిన్), జొకోవిచ్ (సెర్బియా), ఆండీ ముర్రే (బ్రిటన్) కాకుండా మరో ప్లేయర్‌కు టాప్ సీడ్ దక్కడం ఇదే తొలిసారి కావడం విశేషం. 2003లో లీటన్ హెవిట్ (ఆస్ట్రేలియా)కు టాప్ సీడ్ లభించింది. మరుసటి ఏడాది నుంచి 2022 వరకు ఫెడరర్, నాదల్, జొకోవిచ్, ముర్రేలలో ఒకరు టాప్ సీడ్‌గా వింబుల్డన్ టోర్నీలో బరిలోకి దిగారు. డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్‌కు ఈసారి రెండో సీడ్ దక్కింది. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్ వన్, ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ స్వియాటెక్ (పోలాండ్)కు టాప్ సీడ్ కేటాయించారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత సబలెంకా (బెలారస్) రెండో సీడ్‌గా, డిఫెండింగ్ చాంపియన్ రిబాకినా (కజకిస్తాన్) మూడో సీడ్‌గా పోటీపడతారు. వింబుల్డన్ టోర్నీ జూలై 3 నుంచి లండన్‌లో జరుగుతుంది.



## పోరాడి ఓడిన శ్రీజ

జాగ్రెబ్ (క్రొయేషియా): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్ జాగ్రెబ్ ఓపెన్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయింది. జాతీయ మహిళల సింగిల్స్ చాంపియన్ అయిన శ్రీజ బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ మూడో రౌండ్ మ్యాచ్‌లో 11-7, 9-11, 11-4, 4-11, 5-11తో లీ యున్‌హై (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. అంతకుముందు తొలి రౌండ్‌లో శ్రీజ 11-5, 7-11, 14-12, 11-8తో చెంగ్ పుస్‌యువాన్ (చైనీస్ తైపీ)పై, రెండో రౌండ్‌లో 11-6, 9-11, 11-9, 11-5తో రీత్ టెనిసన్ (భారత్)పై విజయం సాధించింది. భారత్‌కే చెందిన సుతీర్థ ముఖర్జీ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందింది. క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో సుతీర్థ 1-11, 10-12, 12-10, 11-6, 11-9తో జు చెంగ్‌జు (హాంకాంగ్)పై గెలిచింది. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ విభాగంలో భారత క్రీడాకారులు సత్యన్ జ్ఞానశేఖరన్, హర్మీత్ దేశాయ్, మనుష్ షా, మానవ్ ఠక్కర్, సానిల్ షెట్టి మెయిన్ 'డ్రా'కు చేరుకోలేకపోయారు.

# సినిమా



● చిరంజీవి

## పదహారేళ్ల తర్వాత...

పదహారేళ్ల తర్వాత చిరంజీవి, త్రిష కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని తెలిసింది. చిరంజీవి హీరోగా, సిద్ధు జొన్నలగడ్డ కీలక పాత్రలో కల్యాణ్ కృష్ణ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్నట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయట. ఈ సినిమాలో చిరంజీవి సరసన త్రిష, సిద్ధు జొన్నలగడ్డకు జోడీగా శ్రీలీల నటించనున్నారని తెలిసింది. అలాగే చిరంజీవి కుమార్తె సుష్మితా కొణిదెల ఈ సినిమాను నిర్మించనున్నారని, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించనున్నారని సమాచారం. ఈ విషయాలపై త్వరలోనే ఓ అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఇక 2006లో వచ్చిన 'స్టాలిన్' చిత్రం తర్వాత చిరంజీవి, త్రిష మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోలేదు.



● త్రిష



● వెంకటేశ్

## త్వరలో ఫైనల్ మిషన్

మిషన్‌ను పూర్తి చేయడానికి వెంకటేశ్ రెడీ అవుతున్నారు. వెంకటేశ్ హీరోగా 'హిట్' ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'సైంధవ్'. ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా హీరోయిన్లుగా నటిస్తున్నారు, బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ విలన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన తాజా కీలక షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో ముగిసింది. ప్రధానంగా వెంకటేశ్, రుహానీ శర్మ, శ్రద్ధా శ్రీనాథ్ పాల్గొనగా ఈ సన్నివేశాలను చిత్రీకరించారు. త్వరలోనే ఈ సినిమా ఫైనల్ మిషన్ (ఫైనల్ షెడ్యూల్ చిత్రీకరణ) ఆరంభం కానుందని చిత్ర యూనిట్ పేర్కొంది. వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రంగా రూపొందుతున్న ఈ చిత్రం డిసెంబరు 22న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, సహ నిర్మాత: కిషోర్ తాళ్లూరు.

## యాక్షన్ అర్జున్



● వరుణ్ తేజ్

సెక్యూరిటీ ఆఫీసర్‌గా వరుణ్ తేజ్ నటించిన యాక్షన్ చిత్రం 'గాండీవధారి అర్జున'. వరుణ్ తేజ్ హీరోగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటించారు. బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 25న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని వరుణ్ తేజ్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అర్జున్ పాత్రలో వరుణ్ తేజ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. ''ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపిస్తారు. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల నుంచి ప్రజలను అతను ఏ విధంగా కాపాడాడు? అందుకు అతని వ్యూహాలేంటి? అనేది ఈ సినిమాలో ఆసక్తికరం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.

## అందుకే ఈ సినిమా నిర్మించా!

**- సుధాకర్ కోమాకుల**



''నారాయణ అండ్ కో' కథని డైరెక్టర్ చిన్నా చెప్పినప్పుడు గమ్మత్తుగా అనిపించింది. ఫ్యామిలీ అండ్ క్రైమ్ కామెడీగా రూపొందిన ఈ చిత్రం కుటుంబమంతా కలిసి హాయిగా నవ్వుకునేలా ఉంటుంది'' అని సుధాకర్ కోమాకుల అన్నారు. చిన్నా పాపిశెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'నారాయణ అండ్ కో'. పాపిశెట్టి బ్రదర్స్‌తో కలిసి సుధాకర్ కోమాకుల నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలకానుంది. ఈ సందర్భంగా సుధాకర్ కోమాకుల మాట్లాడుతూ– ''నాకు నిర్మాణంపై ఎప్పటి నుంచో ఆసక్తి ఉంది. మొదటి నుంచి వీడియోస్, కవర్ సాంగ్స్ చేస్తూనే ఉన్నాను. సినిమా నిర్మాణంలోకి రావాలనుకున్నప్పుడు 'నారాయణ అండ్ కో' సరైన సినిమా అనిపించింది. నాకు వినోదం అంటే చాలా ఇష్టం. ఈ మూవీలో పూర్తి స్థాయి వినోదం పంచే పాత్ర చేసే అవకాశం దక్కింది. ఇక పదేళ్లకు పైగా ఉన్న నా సినీ ప్రయాణంలో రావాల్సినంత ఫేమ్ రాలేదు. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' సినిమా తర్వాత మరో సోలో చిత్రం పడుంటే నా కెరీర్ తర్వాతి స్థాయికి వెళ్లేది. డైరెక్టర్ అనిల్ రావిపూడి నాకు మంచి స్నేహితుడు. తన సినిమాలో ఓసారి మంచి పాత్ర చేసే అవకాశం వచ్చింది.. కానీ చేయలేకపోయాను. నాకు సరైన పాత్ర ఇవ్వాలని అనిల్‌కి కూడా ఉంది. 'క్రాక్' సినిమా తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అవకాశాలు వచ్చాయి. కానీ, నేనే ఆసక్తి చూపలేదు.. లీడ్ రోల్స్‌పైనే దృష్టి పెట్టాను. ప్రస్తుతం 'జీడీ' (గుండెల్లో దమ్ము) సినిమాతో పాటు 1980 నేపథ్యంలో ఒక ప్రేమ కథా చిత్రం చేస్తున్నాను'' అన్నారు.



## దర్శకత్వం కంటే నటన చాలా ఈజీ

**- దశరథ్**

''లవ్ యు రామ్' చిత్రంలో తొలి సారి తప్పని పరిస్థితిలో నేను నటించాల్సి వచ్చింది. నటించే ముందు మొదట ట్రయిల్ షూట్ చేశాం.. అందరికీ నచ్చింది. ఇప్పటివరకూ ప్రీమియర్స్ చూసిన అందరూ బాగా చేశానని అభినందించారు. ఇకపై నటన కొనసాగించాలనుకోవడం లేదు. నటుడిగా సక్సెస్ అయితే మాత్రం దర్శకత్వం కంటే నటనే చాలా ఈజీ (నవ్వుతూ)'' అని కె. దశరథ్ అన్నారు. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ లీడ్ రోల్స్‌లో డీవై చౌదరి దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ యు రామ్'. డైరెక్టర్ కె. దశరథ్ కథ అందించడంతో పాటు నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా కె. దశరథ్ మాట్లాడుతూ– ''డీవై చౌదరి, నేను మూడు వెబ్ సిరీస్‌లు చేశాం. ఆ తర్వాత ఒక చిన్న లవ్ స్టోరీ చేద్దామని 'లవ్ యు రామ్' కథ రాశాను. చాలామంది జీవితాల్లో జరిగే కథ ఇది. పెళ్లి నుంచి శోభనం మధ్యలో జరిగే ప్రేమకథ. యూత్‌ఫుల్ లవ్ స్టోరీగా రూపొందిన మా సినిమా అందర్నీ అలరిస్తుంది. రోహిత్, అపర్ణ అంకితభావంతో పని చేశారు. వేద చాలా మంచి సంగీతం ఇచ్చాడు. ఇండస్ట్రీలో ముందు యండమూరి, పరుచూరి బ్రదర్స్, తేజ గార్ల వద్ద రైటర్‌గా పని చేశాను. కానీ నేను డైరెక్ట్ చేసిన సినిమాల్లో వారి స్టయిల్ ఉండదు. నేను నాలా తీయడానికి ఇష్టపడతాను. కానీ, నేను రచయితగా పని చేసినప్పుడు మాత్రం కస్టమర్ ఈజ్ ది కింగ్. వాళ్లకి ఏం కావాలో అది ఇవ్వాలి. అలా 'ఉస్తాద్'కి మాస్ కమర్షియల్ కథ అందించాను. ప్రస్తుతం ఒక కొత్త ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. అలాగే ఒక వెబ్ సిరీస్ చేస్తున్నాను. దానికి డైరెక్టర్ హరీష్ శంకర్ షో రన్నర్‌గా ఉంటారు'' అన్నారు.

## వస్తున్నాం!



● తరుణ్ భాస్కర్

'పెళ్ళిచూపులు', 'ఈ నగరానికి ఏమైంది?' చిత్రాల తర్వాత దర్శక–నటుడు తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'కీడా కోలా'. ఈ చిత్రంలో బ్రహ్మానందం, రఘు రామ్, రవీంద్ర విజయ్, చైతన్య రావు మాదాడిలతో పాటు తరుణ్ భాస్కర్ కూడా ఓ లీడ్ రోల్ చేశారు. కె. వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీ పాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ నిర్మించారు. వినోదాత్మక పాత్రలో బ్రహ్మానందం, లోకల్ డాన్‌గా తరుణ్ భాస్కర్ కనిపిస్తారు. సినిమా షూటింగ్ పూర్తయింది. బుధవారం టీజర్ రిలీజ్ చేశారు. ఏంట్రా అది (బ్రహ్మానందం), గ్రేప్స్.. ఏమో (మరో పాత్రధారి).. గ్రేప్.. గ్రేప్సా... ఎలా బతికావురా ఇన్నాళ్లు నువ్వు...(బ్రహ్మానందం), నువ్వు బతుకుతా లేవా..అట్లనే... (మరో పాత్రధారి) అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. అలాగే టీజర్ చివర్లో 'శ్వాస మీద ధ్యాస.. వస్తున్నాం' అని కూడా కనిపించింది.

## ఫన్ పార్టీ



● వీజే సన్నీ

వీజే సన్నీ, హ్రితికా శ్రీనివాస్ జంటగా సంజయ్ శేరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సౌండ్ పార్టీ'. దర్శకుడు వి. జయశంకర్ సమర్పణలో రవి పోలిశెట్టి నిర్మించిన ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సినిమా టైటిల్ లోగో విడుదల పాత్రికేయుల చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వీజే సన్నీ మాట్లాడుతూ– ''సౌండ్ పార్టీ' చిత్రం థియేటర్స్‌లో గట్టిగా సౌండ్ చేస్తుంది'' అన్నారు. ''ఫుల్ ఫన్ రైడ్ చిత్రం'' అన్నారు సంజయ్ శేరి. ''పాతిక రోజుల్లోనే ఈ సినిమా షూటింగ్‌ను పూర్తి చేశాం. ఇది మా యూనిట్‌కు, వృత్తి నైపుణ్యానికి నిదర్శనం. ఆగస్టులో సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు రవి పొలిశెట్టి.

## మాయా సెల్‌ఫోన్

''మాయా పేటిక' సినిమాలో నా మనసుకు దగ్గరైన పాత్ర నాది.. అందుకే ఎంతో ఇష్టపడి చేశాను. సెల్‌ఫోన్ నేపథ్యంలో రూపొందిన ఈ మూవీ అందరికీ నచ్చుతుంది'' అని హీరో విరాజ్ అశ్విన్ అన్నారు. రమేష్ రాపర్తి దర్శకత్వంలో విరాజ్ అశ్విన్, పాయల్ రాజ్‌పుత్, సిమ్రత్ కౌర్, రజత్ రాఘవ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మాయా పేటిక'. మాగుంట శరత్ చంద్రా రెడ్డి, తారక్‌నాథ్ బొమ్మిరెడ్డి నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రమేష్ రాపర్తి మాట్లాడుతూ– ''మాయా పేటిక' ద్వారా సెల్‌ఫోన్ కథ చెబుతున్నాం. ప్రేమ, భావోద్వేగాలు, వినోదం.. ఇలా అన్ని అంశాలున్న చిత్రమిది'' అన్నారు. ''రెగ్యులర్ కథలకు భిన్నంగా మా సినిమా ఉంటుంది'' అన్నారు మాగుంట శరత్ చంద్రా రెడ్డి. ''నా కెరీర్‌లో 'మాయా పేటిక' ముఖ్యమైనది'' అన్నారు పాయల్ రాజ్‌పుత్. ''అద్భుతమైన డ్రామా, వినోదం, సంగీతం ఉన్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు సిమ్రత్ కౌర్. ఈ కార్యక్రమంలో నటీనటులు శ్యామల, రజత్ రాఘవ్ మాట్లాడారు.



● రమేష్, పాయల్, సిమ్రత్ కౌర్, విరాజ్ అశ్విన్

## కొత్త ప్రయోగంతో...

**- వారణాసి సూర్య**



''జీరో బడ్జెట్‌తో 'గండ' సినిమాని తీసి, వినూత్న ప్రయోగానికి తెరతీశాం. ఈ చిత్రం ద్వారా ఎంతో మంది ప్రతిభావంతులైన నటీనటులు, సాంకేతిక నిపుణులను చిత్ర పరిశ్రమకు పరిచయం చేస్తున్నాను. ఈ సినిమాని అందరూ ఆదరించాలి'' అని వారణాసి సూర్య అన్నారు. ఈజీ మూవీస్ బేనర్‌పై వారణాసి సూర్య స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'గండ' మూవీ రేపు(శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా వారణాసి సూర్య మాట్లాడుతూ– ''మా ఈజీ మూవీస్ సంస్థ త్వరలో ఓ పెద్ద సంస్థతో కలిసి కొత్త ప్రాజెక్ట్స్ చేయనుంది. అలాగే విజయ్ జెడని దర్శకుడిగా పరిచయం చేస్తూ మరో జీరో బడ్జెట్ సినిమా చేయబోతున్నాం. ఇండస్ట్రీలో కేవలం పింఛన్‌పై ఆధారపడిన చిన్న నిర్మాతలకు మా సంస్థ ద్వారా సాయం చేయాలని నిర్ణయించుకున్నాం'' అన్నారు.

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 499 | 63,915 |
| నిఫ్టీ ▲ | 155 | 18,972 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.00 గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 13,566 | ▲ | 11 |
| డోజోన్స్ | 33,792 | ▼ | 134 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,500 | ▲ | 39 |
| డాక్స్ | 15,949 | ▲ | 102 |
| షాంఘై | 3,189 | ▲ | 0 |
| నికాయ్ | 33,195 | ▲ | 656 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**బులియన్** రూ.లలో — ముంబై


| | | | |
|---|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 58,151 | ▼ | 284 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 57,918 | ▼ | 290 |
| వెండి (కిలో) | 68,972 | ▼ | 551 |



# 64,000 బుల్ 19,000 కొత్త రికార్డుల్..!

ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త గరిష్టాలు • ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూలతలు







**సెన్సెక్స్ మైలురాళ్లు (60,000 - 64,000)**

| సెన్సెక్స్ స్థాయి | అందుకున్న తేదీ |
|---|---|
| 60,000 | సెప్టెంబర్ 24, 2021 |
| 61,000 | అక్టోబర్ 14, 2021 |
| 62,000 | అక్టోబర్ 19, 2021 |
| 63,000 | నవంబర్ 30, 2022 |
| 64,000 | జూలై 28, 2023 |

**నిఫ్టీ మైలురాళ్లు (15,000 - 19,000)**

| నిఫ్టీ స్థాయి | అందుకున్న తేదీ |
|---|---|
| 15,000 | మే 21, 2021 |
| 16,000 | ఆగస్టు 3, 2021 |
| 17,000 | ఆగస్టు 31, 2021 |
| 18,000 | అక్టోబర్ 11, 2021 |
| 19,000 | జూన్ 28, 2023 |

**ముంబై:** భారత ఈక్విటీ మార్కెట్లో బుధవారం రికార్డుల మోత మోగింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో సూచీలు మరోరోజూ దూసుకెళ్లాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు దిగిరావడం మరింత ప్రోత్సాహాన్నిచ్చింది. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఒక్క మీడియా మినహా అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులను లిఖించాయి. సెన్సెక్స్ 64,000 స్థాయిని తాకింది. నిఫ్టీ ఎన్నాళ్లుగానో ఊరిస్తున్న 19,000 మైలురాయిని ఎట్టకేలకు అందుకుంది. సెన్సెక్స్ ఉదయం 286 పాయింట్లు లాభంతో 63,702 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 634 పాయింట్లు పెరిగి 64,050 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసిన సెన్సెక్స్ చివరికి 499 పాయింట్ల లాభంతో 63,915 వద్ద ముగిసింది. సెన్సెక్స్ సూచీకిది వరుసగా రెండోరోజూ లాభాల ముగింపు. ఈ సూచీలోని మొత్తం 30 షేర్లలో ఐదు షేర్లు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ 91 పాయింట్లు పెరిగి 18,908 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ట్రేడింగ్‌లో 194 పాయింట్లు ఎగసి 19,011 వద్ద కొత్త ఆల్‌టైం హైని అందుకుంది. మార్కెట్ ముగిసే సరికి 155 పాయింట్ల లాభంతో 18,972 వద్ద స్థిరపడింది. మెటల్, ఫార్మా షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. సూచీల ఆల్‌టైం హై నమోదు తర్వాత చిన్న కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.08% పెరిగి ఫ్లాటుగా ముగిసింది. మిడ్ క్యాప్ సూచీ 0.73 శాతం లాభపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాలతో కదలాడుతున్నాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.12,350 కోట్ల షేర్లను కొన్నారు. దేశీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపుతూ... రూ.1,021 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.

**బక్రీద్ సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు**

బక్రీద్ సందర్భంగా నేడు (గురువారం) స్టాక్ మార్కెట్‌కు సెలవు. అయితే ఫారెక్స్, డెట్, కమోడిటీ మార్కెట్లు మాత్రం సాయంత్రం సెషన్‌లో పనిచేస్తాయి. ట్రేడింగ్ తిరిగి యథావిధిగా శుక్రవారం ప్రారంభం అవుతుంది.

**రెండు రోజుల్లో రూ.3.43 లక్షల కోట్లు**

సెన్సెక్స్ రెండురోజుల వరుస ర్యాలీతో బీఎస్‌ఈలో 3.43 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ. 294.11 లక్షల కోట్లకు చేరింది. ఈ జూన్ 21 తేదిన బీఎస్‌ఈ లిస్టెడ్ మార్కెట్ క్యాప్ రూ. 294.36 లక్షల కోట్లు నమోదై జీవితకాల రికార్డు స్థాయిని తాకిన సంగతి తెలిసిందే. "దాదాపు ఏడు నెలల స్థిరీకరణ తర్వాత తర్వాత నిఫ్టీ 19వేల స్థాయిని అందుకోగలిగింది. ఆర్థిక వృద్ధి ఆశలు, వడ్డీరేట్ల సైకిల్ ముగింపు అంచనాలు, గత కొన్ని రోజులుగా విదేశీ ఇన్వెస్టర్లు వరుస విక్రయ అంశాలు సూచీల రికార్డు ర్యాలీకి అండగా నిలిచాయి. మిగిలిన రంగాలతో పోలిస్తే ఫార్మా, మెటల్ షేర్లకు ఎక్కువగా డిమాండ్ లభించింది'' అని యస్ సెక్యూరిటీస్ గ్రూప్ ప్రెసిడెంట్ అమర్ అంబానీ తెలిపారు.

**మార్కెట్లో మరిన్ని సంగతులు**

- అమెరికాకు చెందిన ఈక్విటీ సంస్థ జీక్యూజీ పార్ట్‌నర్స్, ఇతర ఇన్వెస్టర్లు ఒక బిలియన్ డాలర్ విలువైన వాటాను కొనుగోలు చేయడంతో అదానీ గ్రూప్ షేర్లు రాణించాయి. ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ 5.34% లాభపడింది. అదానీ ట్రాన్స్‌మిషన్ 6%, అదానీ పోర్ట్స్ 5%, అదానీ టోటల్ గ్యాస్, అదానీ విల్మార్ 2%, ఏసీసీ 1%, అదానీ పవర్ అరశాతం, అంబుజా సిమెంట్స్ 0.10 శాతం చొప్పున లాభపడ్డాయి. అయితే అదానీ గ్రీన్ ఎనర్జీ, ఎన్‌డీటీవీలు 0.16%, 0.32 శాతం చొప్పున నష్టపోయాయి.
- ఆర్థిక, బ్యాంకింగ్ షేర్లకు డిమాండ్ నెలకొనడంతో ఎన్‌ఎస్‌ఈలో ఈ రంగ షేర్లకు ప్రాతినిధ్యం వహించే బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ ట్రేడింగ్‌లో 44,508 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 206 పాయింట్ల లాభంతో 44,328 వద్ద స్థిరపడింది.

## అదానీలో జీక్యూజీ భారీ పెట్టుబడులు

**రూ. 8,200 కోట్ల షేర్ల కొనుగోలు**

**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ దిగ్గజం అదానీ గ్రూప్ కంపెనీలలో జీక్యూజీ పార్ట్‌నర్స్ తదితర పెట్టుబడి సంస్థలు తాజాగా బిలియన్ డాలర్లు(సుమారు రూ. 8,200 కోట్లు) ఇన్వెస్ట్ చేశాయి. గ్రూప్‌లోని డైవర్సిఫైడ్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌లో 1.6 శాతం వాటాకు సమానమైన 1.8 కోట్ల షేర్లు కొనుగోలు చేశాయి. ఈ బాటలో అదానీ గ్రీన్ ఎనర్జీలోనూ 2.2 శాతం వాటాకు సమానమైన 3.52 కోట్ల షేర్లను సొంతం చేసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజీల సమాచారంమేరకు రెండు కంపెనీలలో బ్లాక్‌ట్రేడ్స్ నమోదయ్యాయి. యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణల తదుపరి చైర్మన్ గౌతమ్ అదానీ.. గ్రూప్‌పట్ల ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంపొందించేందుకు ముందస్తు రుణ చెల్లింపులు, నిధుల సమీకరణ తదితర చర్యలు చేపడుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఇదే సమయంలో జీక్యూజీ పార్ట్‌నర్స్.. అదానీ గ్రూప్ కంపెనీలలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతూ వస్తోంది. ఈ ఏడాది మార్చిలో అదానీ గ్రూప్‌లోని నాలుగు కంపెనీలలో ప్రమోటర్లు 1.87 బిలియన్ డాలర్ల(రూ. 15,446 కోట్లు) విలువైన వాటాలను జీక్యూజీ పార్ట్‌నర్స్‌కు విక్రయించారు. తదుపరి మే నెలలో మరో 40-50 కోట్ల డాలర్ల విలువైన షేర్లను జీక్యూజీ కొనుగోలు చేసింది.




**బ్లాక్‌డీల్స్ ఇలా..**

అదానీ ఎంటర్‌ప్రైజెస్ కౌంటర్లో మంగళవారం ధర రూ. 2,281తో పోలిస్తే షేరుకి రూ. 2,300 ధరలో బుధవారం బీఎస్‌ఈలో లావాదేవీ నమోదైంది. అయితే అదానీ గ్రీన్‌లో ముందురోజు ధర రూ. 960తో పోలిస్తే రూ. 925-920 ధరలో బ్లాక్‌డీల్స్ జరిగాయి. తద్వారా రెండు కంపెనీలలోనూ విడిగా 50 కోట్ల డాలర్ల విలువైన ప్రమోటర్ల వాటాలు విదేశీ సంస్థలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 5.3 శాతం జంప్‌చేసి రూ. 2,404 వద్ద నిలవగా.. అదానీ గ్రీన్ స్వల్ప నష్టంతో రూ. 958 వద్ద ముగిసింది. తొలుత 7 శాతం పతనంకావడం గమనార్హం! మేలో నిర్వహించిన బోర్డు సమావేశాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ ట్రాన్స్‌మిషన్ 2.5 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 21,000 కోట్లు) సమీకరణకు ఆమోదించాయి. సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్లు విక్రయించాలని ప్రతిపాదించాయి.

## ఇక 3 రోజుల్లోనే లిస్టింగ్

**ఐపీవో, ఎఫ్‌పీఐలపై సెబీ తాజా నిర్ణయాలు**

**ముంబై:** క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పబ్లిక్ ఇష్యూ చేపట్టిన కంపెనీ లిస్టింగ్‌కు ప్రస్తుతమున్న 6 రోజుల గడువును 3 రోజులకు కుదించింది. బుధవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకుంది. వీటిలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు)కు అదనపు సమాచార వెల్లడిని తప్పనిసరి చేసే నిబంధనలు సైతం ఉన్నాయి. ఇన్విట్స్, రీట్స్ కలిగినవారికి బోర్డులో నామినేషన్ హక్కును ప్రవేశ పెట్టింది.



మొత్తం ఏడు ప్రధాన ప్రతిపాదనలను బోర్డు ఆమోదించినట్లు సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్ తెలియజేశారు. దీంతో పబ్లిక్ ఇష్యూ ముగిసిన రోజు నుంచి షేర్ల లిస్టింగ్ గడువు 6 రోజుల నుంచి 3 రోజులకు తగ్గనుంది. సెప్టెంబర్ 1 నుంచి తాజా నిర్ణయం స్వచ్ఛంద పద్ధతిలో అమలుకానుంది. 2023 డిసెంబర్ 1 నుంచి తప్పనిసరికానుంది. ఇక ఎఫ్‌పీఐలకు ఓనర్‌షిప్, ఎకనమిక్ ఇంటరెస్ట్ తదితర అదనపు అంశాల సమాచార వెల్లడి తప్పనిసరికానుంది. ఈ బాటలో ఇన్వెస్టర్ల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ స్కోర్స్‌ను పటిష్ట పరచడం, ఆన్‌లైన్ వివాద పరిష్కార మెకానిజంతో అనుసంధానించడం వంటివి చేపట్టేందుకు నిర్ణయించింది.

## ఎనిమిదేళ్లలో శాఖలు 3 రెట్లు

**1,500కు చేరిన బంధన్ బ్యాంక్ బ్రాంచీలు**

**కోల్‌కతా:** ప్రైవేట్ రంగ బంధన్ బ్యాంక్ గత ఎనిమిదేళ్లలో తమ శాఖల సంఖ్యను మూడు రెట్లు పెంచుకుంది. ప్రస్తుతం బ్రాంచీల సంఖ్య 1,500కు, బ్యాంకింగ్ అవుట్‌లెట్స్ సంఖ్య 6,000కు చేరినట్లు బ్యాంకు ఎండీ చంద్రశేఖర్ ఘోష్ తెలిపారు. 2015 ఆగస్టులో కోల్‌కతా కేంద్రంగా 501 శాఖలతో బ్యాంకును ప్రారంభించామని ఇప్పుడు 34 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు విస్తరించామని ఆయన వివరించారు. ఫిజికల్, డిజిటల్ మాధ్యమాల ద్వారా కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన బ్యాంకింగ్ సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని ఘోష్ చెప్పారు. సూక్ష్మ రుణాల సంస్థగా ప్రారంభమైన బంధన్ బ్యాంక్ ప్రస్తుతం గృహ, వ్యక్తిగత, ఆటో రుణాలు మొదలైన రిటైల్ సాధనాలపైనా మరింతగా దృష్టి పెడుతోంది.




# భవిత



## విద్య, ఉద్యోగ సమాచారం

### ఏపీ ఎస్ఎస్‌సీ బోర్డులో 12 పోస్టులు

విజయవాడలోని ఏపీ ఎస్ఎస్‌సీ బోర్డు, డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ కార్యాలయం.. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్/డేటా ప్రాసెసింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్-11, డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్-01.
» **అర్హత:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ, టైపింగ్ స్కిల్స్‌తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి. ఎంఎస్ ఆఫీస్/పీజీడీసీఏ/డీసీఏ/ఇంజనీరింగ్ సర్టిఫికేట్/కంప్యూటర్ సబ్జెక్టుతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.01.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతి/ఇంటర్మీడియట్/డిగ్రీ మార్కులు, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**07.07.2023
» **ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది:** 11.07.2023.
» **సర్టిఫికేట్ల వెరిఫికేషన్ తేది:** 13.07.2023, 14.07.2023.
» **కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్:** 16.07.2023, 17.07.2023.
» **తుది ఎంపిక జాబితా వెల్లడి:** 19.07.2023.
» **వెబ్‌సైట్:** https://dgeap.aptonline.in

### మనూ, హైదరాబాద్‌లో 46 పోస్టులు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ(మనూ)..మనూ క్యాంపస్‌ల లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 46
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్,అసోసియేట్ ప్రొఫెసర్,హెచ్‌వోడీ తదితరాలు.
» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఈఈఈ, మెకానికల్, ఈసీఈ, సివిల్ ఇంజనీరింగ్, సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్ /బీఎస్/ఎండీ/ఎమ్మెస్సీ/పీజీ డిగ్రీ/ఎంఈడీ/ఎంఏ/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. నెట్/సెట్/స్లెట్ అర్హత సాధించాలి.
» **వేతనం:** నెలకు రూ.56,100 నుంచి రూ.2,18,200 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**08.07.2023
» **వెబ్‌సైట్:** www.manuu.edu.in

## తుది సమరంలో.. సక్సెస్ ఇలా

**గ్రూప్-4.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని 25 శాఖల్లో మొత్తం 8,039 పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న పరీక్ష! జూలై 1 జరిగే ఈ పరీక్షకు.. దాదాపు పది లక్షల మంది పోటీ పడుతున్నట్లు అంచనా! ప్రొఫెషనల్ కోర్సుల ఉత్తీర్ణులు మొదలు.. సంప్రదాయ డిగ్రీ పట్టభద్రుల వరకు గ్రూప్ 4కు హాజరవుతున్నారు. ఇంతలా పోటీ నెలకొన్న ఈ పరీక్ష కోసం నెలల తరబడి సన్నద్ధత పొందిన అభ్యర్థులు.. పరీక్ష రోజు అనుసరించే వ్యూహమే విజయంలో కీలకంగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో.. గ్రూప్-4 అభ్యర్థుల కోసం ఎగ్జామ్ డే సక్సెస్ టిప్స్..**



టీఎస్‌పీఎస్సీ గ్రూప్-4

» జూలై 1న గ్రూప్-4 పరీక్ష
» దాదాపు పది లక్షల మంది పోటీ
» పరీక్ష రోజు సరైన వ్యూహంతోనే విజయం
» ఒత్తిడి లేకుండా పరీక్ష రాయాలంటున్న నిపుణులు

గ్రూప్-4 పరీక్ష రెండు పేపర్లుగా.. 300 మార్కులకు ఉంటుంది. పేపర్ 1 జనరల్ నాలెడ్జ్ 150 మార్కులకు, పేపర్ 2 సెక్రటేరియల్ ఎబిలిటీస్ 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం రెండున్నర గంటలు. పరీక్షలో మెరిట్ ఆధారంగా.. జోనల్, డిస్ట్రిక్ట్, కేటగిరీ వారీ మెరిట్ జాబితా రూపొందించి నియామకాలు ఖరారు చేస్తారు.

**ఒకే రోజున పరీక్ష**

గ్రూప్-4 పరీక్ష రెండు పేపర్లుగా.. ఒకే రోజున ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో జరగనుంది. పేపర్ 1 ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు; పేపర్ 2 మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు ఉంటుంది.

**ప్రశ్నపత్రం పరిశీలన**

గ్రూప్-4 అభ్యర్థులు పరీక్ష కేంద్రంలో ప్రశ్న పత్రం తీసుకున్నాక దాన్ని పరిశీలించేందుకు కనీసం పది నిమిషాల సమయం కేటాయించడం మేలు. ప్రతి ప్రశ్నకు సమాధానం గుర్తించాలనే తొందరపాటు సరికాదు. తొలుత పూర్తిగా ప్రశ్న పత్రాన్ని చదివేందుకు కొంత సమయం కేటాయించాలి. ఫలితంగా ప్రశ్న పత్రం క్లిష్టత స్థాయిపై ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. ముందుగా తమకు సులభంగా భావించిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. అనంతరం ఓ మోస్తరు క్లిష్టత ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. చివరగా అత్యంత క్లిష్టమైన ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. అలాకాకుండా ముందే కష్టమైన ప్రశ్నలకు సమాధానాలిచ్చేందుకు ఉపక్రమిస్తే.. మానసికంగా ఒత్తిడికి గురయ్యే ఆస్కారముంది. పర్యవసానంగా తమకు తెలిసిన ప్రశ్నలకు కూడా సమాధానం ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందని గుర్తించాలి.

**ఎలిమినేషన్.. అప్రమత్తంగా**

ఆబ్జెక్టివ్ పరీక్షల్లో అభ్యర్థులు అనుసరించే వ్యూహం..ఎలిమినేషన్ టెక్నిక్. అంటే.. నాలుగు ఆప్షన్లలో ప్రశ్నకు సరితూగని వాటిని ఒక్కొక్కటిగా తొలగించి.. చివరగా మిగిలిన ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించడం. ఈ టెక్నిక్‌ను పరీక్ష చివరి దశలోనే అమలు చేయాలి. తమకు సమాధానాలు తెలిసిన అన్ని ప్రశ్నలను పూర్తి చేసుకున్నాకే ఎలిమినేషన్‌పై దృష్టి పెట్టాలి. అలాగే గెస్సింగ్ విధానాన్ని కూడా పరీక్ష చివరి దశలోనే అనుసరించాలి.

**ఓఎంఆర్ షీట్.. జాగ్రత్తగా**

ఓఎంఆర్ షీట్‌లో వివరాలు పొందుపరచడంలో అభ్యర్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. అదేవిధంగా సమాధానాలు బబ్లింగ్ చేసేటప్పుడు ప్రశ్న సంఖ్య.. ఆప్షన్‌ను క్షుణ్నంగా గుర్తించాలి. కొంతమంది ఓఎంఆర్ షీట్‌ను పూర్తి చేయడంలో పొరపాట్లు చేసి.. సమాధానాలన్నీ సరిగా రాసి మంచి మార్కులు పొందినా కూడా విజయం చేజార్చుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌ను జాగ్రత్తగా పూరించాలి.

**కమిషన్ నిబంధనలు పాటిస్తూ**

తాజాగా గ్రూప్-4 పరీక్షకు సంబంధించి టీఎస్‌పీఎస్సీ పలు నిబంధనలు జారీ చేసింది. అభ్యర్థులు వాటిని కూలంకషంగా పరిశీలించాలి. అందుకు అనుగుణంగా సిద్ధమై పరీక్ష హాల్‌కు చేరుకోవాలి. పేపర్-1కు ఉదయం 8 గంటల నుంచి పేపర్-2కు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని కమిషన్ వర్గాలు పేర్కొన్నాయి. కాబట్టి అభ్యర్థులు వీలైనంత ముందుగా పరీక్ష హాల్‌కు చేరుకొని నిబంధనలన్నింటినీ పూర్తి చేయాలి.

**హాల్ టికెట్ డౌన్‌లోడ్**

ప్రస్తుతం గ్రూప్-4 హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం అందుబాటులో ఉంది. అభ్యర్థులు వీలైనంత ముందుగా హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. తమకు కేటాయించిన పరీక్ష కేంద్రం వివరాలను తెలుసుకోవాలి. వీలైతే పరీక్ష రోజుకు ముందుగా ఒకసారి పరీక్ష కేంద్రాన్ని వ్యక్తిగతంగా పరిశీలించడం మేలు. దీనివల్ల పరీక్ష రోజు సరైన సమయానికి చేరుకునే వీలుంటుంది.

**ప్రస్తుత సమయంలో.. ఇలా**

అభ్యర్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో.. ముఖ్యాంశాలను, సబ్ హెడ్డింగ్స్‌ను ఒకసారి చూసుకోవాలి. ముఖ్యమైన గణాంకాలు, తేదీలు గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేయాలి. సొంత నోట్స్ రాసుకుని ఉంటే దాని ఆధారంగా పునశ్చరణ పూర్తి చేసుకోవాలి. ముఖ్యంగా షార్ట్ నోట్స్, కీ పాయింట్స్, సినాప్సిస్‌లపై ఎక్కువగా దృష్టి సారించాలి. సినాప్సిస్‌ను చదివితే ఆ అంశానికి సంబంధించిన పూర్తి సమాచారం మదిలో మెదిలే విధంగా ఉండాలి.

**పరీక్షకు ముందు రోజు**

పరీక్షకు ఒకరోజు ముందు అభ్యర్థులు సబ్జెక్ట్ ప్రిపరేషన్ కంటే.. పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన వాటిని సిద్ధం చేసుకోవాలి. హాల్ టికెట్, పెన్నులు, అవసరమైన గుర్తింపు పత్రాలు అన్నింటినీ దగ్గర పెట్టుకోవాలి.

**ఆరోగ్యం జాగ్రత్త**

పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు రేయింబవళ్లు శ్రమిస్తేనే మంచి మార్కులు వస్తాయని భావిస్తుంటారు. పరీక్ష ముందు రోజు కూడా ఇలా అర్ధరాత్రి వరకూ చదువుతూ ఉంటారు. ఇది మరుసటి రోజు పరీక్ష హాల్లో ప్రదర్శన తీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి మనసుకు విశ్రాంతి లభించేలా సేద తీరాలి. ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షకు హాజరవ్వాలి.

**గ్యాప్‌లో చర్చలు వద్దు**

గ్రూప్ 4 మొదటి పేపర్ తర్వాత రెండో పేపర్ ప్రారంభానికి రెండు గంటల వ్యవధి ఉంటుంది. ఈ సమయంలో అభ్యర్థులు.. సహచరులతో మొదటి పేపర్‌లో గుర్తించిన సమాధానాల గురించి చర్చించడం వంటివి చేయడం సరికాదు. దీనివల్ల అనవసరపు ఒత్తిడి ఏర్పడి రెండో పేపర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

**ఎగ్జామ్ డే టిప్స్**

- వీలైనంత ముందుగా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- పరీక్ష రోజు నిర్దేశిత సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
- సమాధానాలు ఇచ్చే ముందు ప్రశ్న పత్రం పరిశీలనకు సమయం కేటాయించాలి.
- సులభమైన ప్రశ్నలతో ప్రారంభించి.. ఓ మోస్తరు క్లిష్టత, ఆ తర్వాత బాగా క్లిష్టంగా ఉన్న ప్రశ్నలపై దృష్టి పెట్టాలి.
- తమకు వచ్చిన అన్ని సమాధానాలు గుర్తించామని భావించాకే గెస్సింగ్, ఎలిమినేషన్ విధానాన్ని అనుసరించాలి.

**ముఖ్య సమాచారం**

- **పరీక్ష తేదీ:** జూలై 1(పేపర్-1 ఉదయం 10:00 - 12:30; పేపర్-2.. మధ్యాహ్నం 2:30-5:00) వరకు.
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం:** పేపర్-1 ప్రారంభానికి 45 నిమిషాల ముందు వరకు
- **వెబ్‌సైట్:** tspsc.gov.in

## మినీరత్న కంపెనీలో.. జూనియర్ ఇంజనీర్

**ఉత్తరాఖండ్ రాష్ట్రం, డెహ్రాడూన్‌లోని మినీరత్న సంస్థ.. తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (టీహెచ్‌డీసీఎల్).. మొత్తం 181 జూనియర్ ఇంజనీర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా, బీఎస్సీ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. టీహెచ్‌డీసీఎల్‌లో జూనియర్ ఇంజనీర్ ఉద్యోగాల పూర్తి వివరాలు..**

» 181 పోస్టుల భర్తీకి టీహెచ్‌డీసీఎల్ నోటిఫికేషన్
» డిప్లొమా, బీఎస్సీ, బీఈ/బీటెక్‌తో దరఖాస్తుకు అర్హత

జాబ్స్ ఇన్ఫో

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 181
- **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీర్ ట్రెయినీ(సివిల్)-72, జూనియర్ ఇంజనీర్ ట్రెయినీ(ఎలక్ట్రికల్)-72, జూనియర్ ఇంజనీర్ ట్రెయినీ (మెకానికల్) విభాగాల్లో 37 పోస్టులు ఉన్నాయి.

**అర్హతలు**



- ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు సంబంధిత విభాగంలో మూడేళ్ల ఫుల్‌టైం రెగ్యులర్ డిప్లొమా/లేటరల్ ఎంట్రీ డిప్లొమా/బీఎస్సీ/బీఈ/బీటెక్ 65 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ/ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్/ డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులు డిప్లొమా ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది.
- **వయసు:** 07.06.2023 నాటికి 27 ఏళ్లు మించకుండా ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

**ఎంపిక విధానం**

- ఆన్‌లైన్(సీబీటీ-కంప్యూటర్ బేస్ట్ టెస్ట్) విధానంలో నిర్వహించే రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో 200 ప్రశ్నలు- 200 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 3 గంటలు. ఇందులో మూడు విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. పార్ట్-1లో సివిల్/ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన 140 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. పార్ట్-2లో జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి-30 ప్రశ్నలు, పార్ట్-3లో రీజనింగ్ నుంచి 30 ప్రశ్నలను అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు లభిస్తుంది. అలాగే ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కును తగ్గిస్తారు. హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లో పరీక్ష రాసుకోవచ్చు.
- రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ పరీక్షలను నిర్వహించి తుది ఎంపిక చేస్తారు.

**శిక్షణ-వేతనాలు**

ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాది పాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ సమయంలోనే మూలవేతనం, డీఏ తదితర ప్రోత్సాహకాలూ లభిస్తాయి. లీవ్, వైద్య సదుపాయం, ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, గ్రాట్యుటీ మొదలైనవి ఉంటాయి. ఉద్యోగం రెగ్యులర్ అయిన తర్వాత కంపెనీ క్వార్టర్స్/హెచ్‌ఆర్‌ఏ వంటివి పొందొచ్చు. పే స్కేల్.. రూ.29,200 - రూ.1,19,000.

**ముఖ్యసమాచారం**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 30.06.2023
- **వెబ్‌సైట్:** https://www.thdc.co.in

## క్లుప్తంగా...

### నిరంతర విద్యుత్ సరఫరా చేయాల్సిందే

సాక్షి, హైదరాబాద్: దేశంలోని విద్యుత్ పంపిణీ సంస్థలు(డిస్కం) భవిష్యత్తులో వినియోగదారులందరికీ నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన వనరుల సమీకరణ కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుని తప్పనిసరిగా ప్రకటించాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టు వనరుల ప్రణాళికల రూపకల్పనకు సంబంధించిన విధానాన్ని ప్రకటిస్తూ బుధవారం అన్ని రాష్ట్రాలకు లేఖ రాసింది. నిరంతర విద్యుత్ సరఫరాలో విఫలమైతే...విద్యుత్ వినియోగదారుల హక్కుల నిబంధనల కింద వినియోగదారులకు జరిమానాలు చెల్లించక తప్పదని హెచ్చరించింది.

### నేడు టీఎస్ఐసెట్ ఫలితాలు

కేయూ క్యాంపస్: 2023–2024విద్యాసంవత్సరంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు గత మే 26, 27 తేదీల్లో నిర్వహించిన పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేయనున్నారు. 29వ తేదీ మధ్యాహ్నం 3.30గంటలకు కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో విడుదల చేయనున్నట్లు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి, టీఎస్ఐసెట్ చైర్మన్, కేయూ వీసీ తాటికొండ రమేష్ ఫలితాలను విడుదల చేస్తారు. వెంటనే ఫలితాలను సంబంధిత వెబ్‌సైట్‌లో ఉంచుతారు.

### అవినీతి ఉద్యోగులకు జైలు

సాక్షి, హైదరాబాద్: బ్యాంక్‌ను మోసగించిన కేసులో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ బ్రాంచ్ మాజీ మేనేజర్ పి.ఫణిప్రసాద్, మాజీ అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్.పాండురంగం చలపతిలకు సీబీఐ కోర్టు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. రూ.75 వేల చొప్పున జరిమానా కూడా విధించింది. వీరిద్దరూ హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ కంపెనీ యజమాని వై.కోటేశ్వర్‌రావుతో చేతులు కలిపి బ్యాంక్‌కు రూ.1.15 కోట్ల నష్టం కలిగించారు. ఇళ్ల నిర్మాణం పేరుతో సదరు మొత్తాన్ని పొందిన కోటేశ్వర్‌రావు.. కొన్ని ఇళ్ల నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేశారు. సరైన పరిశీలన చేయకుండానే ఫణిప్రసాద్, పాండురంగం అతనికి రుణం విడుదల చేశారు. దీనిపై 2005లో కేసు నమోదు చేసిన సీబీఐ 2007లో ముగ్గురిపై చార్జిషీట్ దాఖలు చేసింది. కేసు విచారణ సమయంలో కోటేశ్వర్‌రావు మృతి చెందారు. దీంతో బ్యాంక్ ఉద్యోగులిద్దరికీ శిక్ష ఖరారు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

'మన ఊరు-మన బడి'కి నిధుల కొరత

సర్కారు పాఠశాలల రూపురేఖలు మార్చాలని భావించిన ప్రభుత్వం

రూ.7,289 కోట్ల అంచనా వ్యయంతో పథకం ప్రారంభం

తొలిదశలో 9,058 స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు నిర్ణయం

జూన్ 12 గడువు నాటికి 1,399 పాఠశాలల్లో అసంపూర్తిగానే పనులు

ప్రత్యేక దృష్టి అవసరమంటున్న నిపుణులు

# మన ఊరు.. తడ'బడి'!

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

ప్రాథమిక విద్య అనేది హక్కు మాత్రమే కాదు. పేదల జీవితాల్లో చీకటిని శాశ్వతంగా తొలగించే ఏకైక సాధనం. సమాజ ఆర్థికాభివృద్ధికి శక్తివంతమైన చోదకం కూడా. అందువల్ల ప్రాథమిక దశలో మంచి అభ్యాసన కోసం చక్కటి పాఠశాల వాతావరణం, అన్నిరకాల మౌలిక సదుపాయాల ఏర్పాటు అత్యంత అవశ్యం. దీన్ని దృష్టిలో ఉంచుకునే తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలు మార్చేలా 'మన ఊరు – మనబడి'కి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని 26,195 ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు రూ.7,289 కోట్ల వ్యయంతో దీనిని ప్రారంభించింది. కానీ ఈ పథకం తొలి ఏడాదిలోనే తడబడుతోంది. నిధుల కొరతతో వెనకబడి పోతోంది. మూడు దశల్లో మొత్తం అన్ని పాఠశాలలను సకల హంగులతో తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశ కింద 9,058 పాఠశాలలను ఎంపిక చేయగా, జూన్ 12తో గడువు ముగిసినా 7 వేలకు పైగా పాఠశాలల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. చాలా పాఠశాలల్లో పనులు సుదీర్ఘంగా సాగుతుండగా, అనేకచోట్ల అసంపూర్తిగా నిలిచిపోయాయి. కొన్నిచోట్ల చెట్ల కింద, శిథిల భవనాల్లో పాఠాలు వినాల్సిన పరిస్థితి నెలకొంది.



ఆశించిన స్థాయిలో లేదు..

మన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా ప్రత్యేక పద్ధతుల్లో, తగిన మౌలిక సదుపాయాలతో విద్యాబోధన చేయాల్సిన ఆవశ్యకత ఉంది. అయితే ముఖ్యంగా పేదలు చదివే ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి ఆశించిన స్థాయిలో మెరుగుపడలేదు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ శాంతాసిన్హా, ఎంవీ ఫౌండేషన్

### అన్ని హంగులతో ఆకర్షణీయంగా..



నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరులోని ఈ పాఠశాలలో పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మంచినీళ్లు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్ల ఏర్పాటుతో పాటు కొత్త క్లాస్‌రూంల నిర్మాణం, డిజిటల్ బోర్డులు, పాఠశాల అంతా ఆకర్షణీయ మైన రంగులు లక్ష్యంగా ఈ పథకానికి రూపకల్పన చేశారు. ఇందుకోసం ప్రభుత్వ నిధుల్ని కేటాయించడమే కాకుండా పూర్వ విద్యార్థులు, కార్పొరేట్ సంస్థల నుండి కూడా విరాళాలు సేకరించాలని నిర్ణయించారు. కోటి రూపాయలకు పైబడి ఇస్తే పాఠశాలకు, రూ.10 లక్షలు ఇస్తే ఒక గదికి వారు సూచించే పేరును పెట్టాలని నిర్ణయించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. కానీ దాతల నుండి ఆశించిన స్పందన లేకపోవటం, ప్రభుత్వం నుండి నిధులు ఆగిపోవటంతో పనులు ఎక్కడివక్కడే ఉన్నాయి.



ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి (టి) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరు– మనబడి' పనులు నత్తనడకన సాగుతున్నాయి. పాఠశాలలో శిథిలావస్థకు చేరిన గదులను తొలగించి నూతన భవన నిర్మాణం చేపడుతున్నారు. దీంతో సరిపడా గదులు లేక విద్యార్థులను ఉపాధ్యాయులు ఆవరణలోని చెట్ల కింద కూర్చోపెట్టి పాఠాలు బోధిస్తున్నారు.

### ఇదీ లెక్క..

- 2025 నాటికి అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పూర్తి చేసి, 2030 నాటికి రాష్ట్రంలో 100% అక్షరాస్యత సాధించాలన్నది లక్ష్యం. కానీ ఇప్పుడు రాష్ట్ర సగటు అక్షరాస్యత 73.3 శాతమే. ఇక మహిళల్లో అక్షరాస్యత 64.8 శాతమే.
- రాష్ట్రంలో మొత్తం 62.29 లక్షల మంది విద్యార్థులుండగా అందులో అత్యధికం ప్రైవేటు పాఠశాలల్లోనే చదువుతున్నారు. 50.23 శాతం ప్రైవేటులో, 49.77 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారిలో 49.5% వెనకబడిన తరగతులు (బీసీ), 22.4% జనరల్ కేటగిరి, 17.5 శాతం ఎస్సీలు, 10.6 శాతం గిరిజనులు ఉన్నారు.
- ప్రభుత్వ పాఠశాలలు అత్యధికంగా నల్లగొండ జిల్లాలో, అతి తక్కువగా ములుగు జిల్లాలో ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలలు అత్యధికంగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఉన్నాయి.

### తక్కువ నిధులిస్తోంది మన రాష్ట్రమే



రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (ఎ) మేరకు విద్య అనేది ప్రాథమిక హక్కు. 6 నుండి 12 ఏళ్ల వరకు తప్పనిసరి విద్య అందించాలని రాజ్యాంగం చెబుతోంది. కానీ తెలంగాణలో విద్య అప్రాధాన్య సబ్జెక్ట్ అయింది. దీంతో పేదలు, వారి పిల్లల భవిష్యత్తు అంధకారం అవుతోంది. దేశంలో విద్యకు అతి తక్కువగా నిధులు కేటాయిస్తున్న సర్కార్ మనదే. విద్య విషయంలో ప్రజల్లోనూ ప్రశ్నించే తత్వం పెరగాలి.

– జస్టిస్ చంద్రకుమార్

### ఉమ్మడి జిల్లాల్లో మన ఊరు-మన బడి ఇలా..

| జిల్లా పేరు | మొత్తం బడులు | తొలిదశ ఎంపిక | అసంపూర్తి |
|---|---|---|---|
| కరీంనగర్ | 2,493 | 867 | 612 |
| ఆదిలాబాద్ | 2,888 | 996 | 841 |
| వరంగల్ | 4,875 | 1,625 | 1,499 |
| నిజామాబాద్ | 2,167 | 758 | 683 |
| ఖమ్మం | 2,280 | 794 | 523 |
| నల్లగొండ | 3,145 | 1,097 | 980 |
| మహబూబ్‌నగర్ | 3,139 | 1,099 | 839 |
| మెదక్ | 3,166 | 1,097 | 916 |
| రంగారెడ్డి | 1351 | 464 | 180 |
| హైదరాబాద్ | 691 | 261 | 122 |

### విద్యాశాఖకు బడ్జెట్ వివరాలు

| ఏడాది | కేటాయింపు (రూ.కోట్లలో | బడ్జెట్‌లో శాతం |
|---|---|---|
| 2014-15 | 10,963 | 10.89 |
| 2015-16 | 11,216 | 9.69 |
| 2016-17 | 10738 | 8.23 |
| 2017-18 | 12709 | 8.49 |
| 2018-19 | 13276 | 7.61 |
| 2019-20 | 12220 | 6.76 |
| 2020-21 | 12,144 | 6.69 |
| 2021-22 | 15608 | 6.78 |
| 2022-23 | 16042 | 6.24 |
| 2023-24 | 19093 | 6.57 |



### లెగ్గుపీసే కానీ కోడిది కాదు..

ఏ విషయంలో ముందున్నా లేకున్నా... అన్ని జంతువులను సమభావంతో చూడటంలో చైనీయులు, తైవాన్‌వాసులు ఎప్పుడూ ముందుంటారు.. అందుకే తినే విషయంలో అదీ ఇదీ అని చూడరు. కనువిందుగా కనిపిస్తే చాలు.. ఏదైనా సరే.. నాలుగు రకాల మసాలాలు కుమ్మేసి.. ఆ నూడుల్స్‌తో కలిపేసి.. ఎంచక్కా మింగేస్తుంటారు. తైవాన్‌కు చెందిన విచ్ క్యాట్ అనే రెస్టారెంటోడికి కూడా ఓ మొసలి ఇలాగే కనిపించినట్లుంది. పైగా అక్కడి చెఫ్‌లకు క్రియేటివిటీ కూడా కాసింత ఎక్కువేనట. అందుకే ఎప్పుడూ చికెన్ లెగ్గుపీసులేనా.. మనిసన్నాక కూసింత కళాపోసన ఉండాలని చెప్పి.. మొసలి లెగ్గు పీసుతో ఇదిగో ఈ వంటకాన్ని సిద్ధం చేసేశారు. దీన్ని రుచి చూస్తే. రొమాంటిక్ ఫీలింగ్స్ వస్తాయట. అయితే.. రెస్టారెంట్‌కు వచ్చినోళ్లంతా.. ఫొటోలు తీసుకుంటున్నారు తప్పిస్తే.. దీన్ని ట్రై చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదట. మరి.. ఆ ధైర్యం మీకుందా?

## రెండ్రోజులు రాష్ట్రంలో వానలు

సాక్షి, హైదరాబాద్: రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గురు, శుక్రవారాల్లో ఆదిలాబాద్, కుమ్రుంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 5.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలో 11.96 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావలసిఉండగా.. 6.69 సెంటీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. ఈ నెలలో ఇప్పటివరకు 44 శాతం లోటు వర్షపాతం ఉన్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

## గ్రూప్-1 ప్రాథమిక కీ విడుదల

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ప్రాథమిక కీని బుధవారం తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ ద్వారా ఈ కీని డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఈ కీపైన ఏమైనా అభ్యంతరాలుంటే వాటిని ఆన్‌లైన్ ద్వారా వెల్లడించవచ్చని కమిషన్ కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జూలై 1వ తేదీ నుంచి 5వ తేదీ సాయంత్రం 5గంటల వరకు అభ్యర్థులు కమిషన్ నిర్దేశించిన లింకు ద్వారా అభ్యంతరాలను సమర్పించాల్సి ఉంటుంది. కేవలం ఆన్‌లైన్ పద్ధతిలోనే అభ్యంతరాలను పూర్తి ఆధారాలతో ఇంగ్లిష్‌లో ఇస్తేనే స్వీకరిస్తామని, మాన్యువల్‌గా సమర్పించే వాటిని పరిగణనలోకి తీసుకోమని స్పష్టం చేసింది. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఈ నెల 11వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు 2,33,506 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. కాగా, గ్రూప్–1 పరీక్ష రాసిన అభ్యర్థుల ఓఎంఆర్ కాపీలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. వీటిని వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కాపీలు జూలై 27వ తేదీ వరకు కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 